


అమ్మ
రూ॥ 350/-
పేజీలు: 400
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



రాజ్యసభకు కమల్ హాసన్

ప్రధాని మౌనం వీడాలి

లోపలి పేజీల్లో

కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు 44 మంది ఎమ్మెల్యేలు సిద్ధం



సంపుటి 27, సంచిక: 338 | గురువారం | 29-05-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00


## తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా అపరేశ్ కుమార్ సింగ్



- త్రిపుర హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా ఎంఎస్.రామచంద్రరావు
- మద్రాస్ హైకోర్టుకు జస్టిస్ టి.వినోద్‌కుమార్ బదిలీ
- సుప్రీం కోర్టు కొలీజియం సిఫార్సు

**న్యూఢిల్లీ :** తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌ని సుప్రీం కోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ప్రస్తుతం ఆయన త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటి వరకు తాత్కాలిక న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సుజయ్ పాల్ కల్‌కత్తా హైకోర్టుకు బదిలీ చేస్తూ సుప్రీం కోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ఆయన స్థానంలో పూర్తి స్థాయి చీఫ్ జస్టిస్‌గా అపరేశ్ కుమార్ సింగ్ రానున్నారు.అలాగే తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తడకమల్ల వినోద్‌కుమార్‌ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేస్తూ కొలీజియం సిఫార్సు చేసింది. త్రిపురతో పాటు రాజస్థాన్, జార్ఖండ్, మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులను బదిలీ చేయాలని సిఫార్సు చేస్తూ సోమవారం సుప్రీం చీఫ్ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలో ఐదుగురు సభ్యుల కొలీజియం సమావేశంలో తీర్మానించారు.

### రాంచీ నుంచి...

జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ 1965 జూలై 7న జన్మించారు. ఆయన బిఎ (ఆనర్స్) పూర్తి చేసి, ఢిల్లీ యూనివర్సిటీ నుంచి ఎల్ఎల్‌బి పట్టభద్రుడయ్యారు. 1990లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యి, పట్నా హైకోర్టులో 1990 నుంచి 2000 సంవత్సర వరకు ప్రాక్టీస్‌చేశారు. జార్ఖండ్ రాష్ట్రం ఆవిర్భావం తరువాత 2001 నుంచి 2012 వరకు జార్ఖండ్ హైకోర్టులో న్యాయవాదిగా పని చేశారు. 2012 జనవరి 24న జార్ఖండ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఆయనను 2014 జనవరి 16న పూర్తి స్థాయి న్యాయమూర్తిగా నియమించారు. 2022 డిసెంబర్ 20 నుంచి 2023 ఫిబ్రవరి 19వరకు జార్ఖండ్ హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్‌గా పనిచేశారు. ఆయన జార్ఖండ్ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా తరువాయి 2లో

# ఉద్యోగాల భర్తీని అడ్డుకుంటున్నారు



ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లు నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడింది వాస్తవం కాదా? కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ఏడాదిలోనే 59 వేల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసింది. మొదటి ఏడాదిలోనే ఇన్నిఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదే. గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించి ఫలితాలు సైతం విడుదల చేశాం. కానీ నోటికాడి కూడును కింద పడేసినట్లు, రాజకీయ కుట్రతో నియామక పత్రాలు ఇవ్వకుండా అడ్డుకున్నారు. - సిఎం

- తన ఇంట్లో వాళ్లు ఒక చోట ఓడిపోతే మరో చోట పదవులిచ్చుకున్నారు
- విద్యార్థులకు మాత్రం ఉద్యోగాలు దక్కకుండా చేస్తున్నారు
- కోర్టుల్లో కేసులు వేస్తున్నారు
- అందుకే ఇది సామాజిక సమస్యగా మారుతున్నది
- గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంపై సిఎం రేవంత్‌రెడ్డి మండిపాటు
- ఎస్‌సి గురుకులాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు ప్రదానం



ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆడుకుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కెసిఆర్ కుటుంబ సభ్యులకు మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని విమర్శించారు. హైదరాబాద్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎస్‌సి గురుకులాల్లో పదవతరగతి, ఇంటర్ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లలో ఉద్యోగాల భర్తీకి ఎందుకు నోటిఫికేషన్లు ఇవ్వలేదని బిఆర్‌ఎస్ నేతలను నిలదీశారు. పిజిలు చేసిన విద్యార్థులు ఎంతో విలువైన కాలాన్ని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకున్న పిల్లలకు తాము ఉద్యోగాలు ఇస్తున్నామని, తమ ప్రభుత్వం హయాంలో మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. ఒక్క ఏడాదిలోనే 59 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు. గత 15 ఏళ్లుగా గ్రూప్1 పరీక్షలు నిర్వహించలేదన్నారు. తమ హయాంలో 563 గ్రూప్1 పోస్టులు భర్తీ చేస్తున్నామని వివరించారు. గ్రూప్1లో 89 శాతం పోస్టులు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలకు దక్కాయని వివరించారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా పదేళ్లు నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడింది తరువాయి 2లో




# 14 పంటలకు ఎంఎస్‌పి పెంపు

- వరికి రూ.69పెంచడంతో కనీస మద్దతు ధర రూ.2,369కు చేరిక
- పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఇతర తృణధాన్యాలు, పత్తికి పెరిగిన ఎంఎస్‌పి
- ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ తీర్మానం

**న్యూఢిల్లీ :** నైరుతీ రుతుపవనాలు ప్రవేశించడంతో కేంద్ర మంత్రివర్గం ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో పంటల మద్దతు ధరలు పెంచింది. పంట రుణాలపై వడ్డీ రాయితీ పథకం కొనసాగించాలని నిర్ణయించింది. వరిధాన్యం,పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఇతర తృణధాన్యాల కనీస మద్దతు ధరలు (ఎంఎస్‌పి) క్వింటాలుకు రూ.69లు పెంచాలని కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ (సిసిఇఎ) నిర్ణయించింది. మద్దతు ధరల పెంపుతోపాటు పంట రుణాలపై వడ్డీ రాయితీ పథకాన్ని కూడా కొనసాగించాలని తీర్మానించింది. ఈ నిర్ణయంవల్ల క్వింటాలు సాధారణ రకం వరిధాన్యం మద్దతుధర రూ.2,369లకు, ఏ గ్రేడు వరిధాన్యం మద్దతు ధర క్వింటాలుకు రూ.2,389లు వంతున పెరిగాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన సిసిఇఎ సమావేశం బుధవారంనాడు జరిగింది. వరిధాన్యం మద్దతు ధర క్వింటాలుకు మూడు శాతం పెంచగా, పప్పుధాన్యాలకు మద్దతు ధరను 5.96 శాతానికి, నూనెగింజలు, ఇతర తృణధాన్యాలకు క్వింటాలు ధరను తొమ్మిదీశాతానికి పెంచారు. కాగా పత్తి పంటకు మద్దతు ధరను రూ.589 పెరడంతో దీని క్వింటాలు ధర రూ.7,710 (మధ్యతరహా) పెరిగింది. పొడుగ్గా ఉండే పత్తికి మద్దతు ధర క్వింటాలుకు రూ.8,110లు పెరిగింది. సాధారణ వాతారణ పరిస్థితులకు భిన్నంగా నైరుతీ రుతుపవనాలు చాలా ముందుగా దేశంలోకి ప్రవేశించిన పూర్వరంగంలో 2025–26 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కుగాను కేంద్రమంత్రివర్గ కమిటీ ఈ మద్దతు ధరలు ప్రకటించింది. వ్యవసాయమంత్రిత్వశాఖ చేసిన ప్రతిపాదన మేరకు మంత్రివర్గ కమిటీ ఈ నిర్ణయం తీసుకుందని కేంద్ర సమాచార, ప్రసారాలశాఖామంత్రి అశ్వనీవైష్ణవ్ సమావేశానంతరం మీడియాకు చెప్పారు. ఈ నిర్ణయం ద్వారా ఖరీఫ్‌లో వరినాట్లు, నూనెగింజలు, పప్పుధాన్యాల పంటసాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచడానికి వీలు కలుగుతుందని, రైతులకు ప్రోత్సాహకరంగా ఉంటుందని ఆయన అన్నారు. మనదేశంలోని మొత్తం వార్షిక ఆహార ఉత్పత్తిలో 50 శాతం ఆహార ఉత్పత్తి రుతుపవనాల ప్రభావిత వర్షపాతంమీద ఆధారపడే జరుగుతుందని, దేశంలో ప్రధానంగా ఖరీఫ్ పంటసాగు రుతుపవన తరువాయి 2లో

# రాష్ట్రమంతా ‘నైరుతి’ విస్తరణ

- రుతుపవనాలు, అల్పపీడనల ప్రభావంతో.. మూడురోజులు భారీ వర్షాలు
- పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసిన ఐఎండి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు విస్తరించాయి. మే 26న మహబూబ్‌నగర్‌లోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు ప్రస్తుతం ఆదిలాబాద్ వరకు విస్తరించాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు చెప్పారు. నైరుతి ఋుతుపవనాలు, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో పలు జిల్లాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి. రుతుపవనాల ప్రభావంతో మరో మూడురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం తరువాయి 2లో

# పంటనష్ట పరిహారం రూ.51 కోట్లు విడుదల

- 29 జిల్లాల్లో5,528 ఎకరాలలో పంట నష్టం
- 41,361 మంది రైతుల ఖాతాలో జమకానున్న నిధులు



ప్రజాపక్షం/హైదరాబాద్

అకాల వర్షాలు, వడగళ్ల వానకు దెబ్బతిన్న రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టం అంచనావేసి బుధవారం ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. రాష్ట్రంలో గత రెండు నెలలుగా పలు దఫాలుగా వడగళ్ల వాన, అకాలవర్షాలకు పంట నష్టం సంభవించిన విషయం తెలిసిందే. దీన్ని దృష్టిలో పెట్టుకుని రైతులు నష్టపోకుండా ఉండేందుకు వారికి పంట్ట నష్టం అందించాలని, పంట నష్టం అంచనా నివేదిక అందజేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తరువాయి 2లో

# నిబద్ధతతో పనిచేస్తున్న వారికే నామినేటెడ్ పదవులు



- కాంగ్రెస్ నాయకులకు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సూచన
- పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలతో వరుసగా సమీక్షలు
- పార్టీ శ్రేణులు క్రమశిక్షణ పాటించాలని నేతలకు దిశానిర్దేశం

ప్రజాపక్షం/హైదరాబాద్:

కాంగ్రెస్ పార్టీలో నిబద్ధతతో పనిచేస్తున్న నాయకులకు ప్రాముఖ్యతను ఇవ్వాలని, నామినేటెడ్ పదవుల భర్తీలో వారికిప్రాధాన్యతను ఇవ్వాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టిపిసిసి) వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ నేతలకు సూచించారు. హైదరాబాద్ హైదర్‌గూడలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంపిలతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె పలు కీలక అంశాలను చర్చించారు. పార్టీ శ్రేణుల్లో క్రమశిక్షణ పాటించాల్సిన అవసరాన్ని ఆమె నొక్కి చెబుతూ పార్టీ బలోపేతానికి నాయకులకు దిశానిర్దేశం చేశారని పార్టీ వర్గాలు తెలిపాయి. అలాగే పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆదిలాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్, జహీరాబాద్, మెదక్, మల్కాజిగిరి లోక్‌సభ స్థానాల నేతలతో ఆమె భేటీ అయ్యారు. తొలుత ఆదిలాబాద్ లోక్‌సభ సెగ్మెంట్ నేతలతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో 119 నియోజకవర్గాల ఎంఎల్‌ఎలు పోటీ చేసిన అభ్యర్థులతోనూ ఆమె విడివిడిగా భేటీ అయి ప్రభుత్వం, పార్టీకి సంబంధించి నేతల వద్ద ఫీడ్ బ్యాక్ తీసుకున్నట్లు తెలిసింది. మొదటి దశలో భాగంగా ఆదిలాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్, జహీరాబాద్, మెదక్, మల్కాజ్‌గిరి స్థానాలపై దృష్టి సారించారు. ఈ సమావేశాలలో నియోజకవర్గాల పరిధిలోని తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ కార్యకర్తల అభిప్రాయాలు, భవిష్యత్ కార్యాచరణపై నేతల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలోని కాంగ్రెస్ ఎంఎల్‌ఎలతో పాటు, గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులతో కూడా మీనాక్షి నటరాజన్ విడివిడిగా తరువాయి 2లో



# వానాకాలం వరి నాట్ల లోపు రైతు భరోసా జమ

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల ప్రకటన
- చిట్యాలలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో దుకాణ సముదాయాలు ప్రారంభం

ప్రజాపక్షం/చిట్యాల

వర్షాకాలం వరి నాట్లలోపు రైతులకు ‘రైతు భరోసా’ మొత్తాన్ని అందజేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో రూ.1.40 లక్షల వ్యయంతో నిర్మించిన దుకాణ సముదాయాలను బుధవారం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశంలతో కలిసి ప్రారంభించారు. అలాగే నూతన వ్యవసాయ కమిటీ పాలక వర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో స్థిరమైన, శాశ్వతమైన పాలన కొనసాగుతున్నదని, అప్పుల తాకిడిని తట్టుకుంటూ ప్రజా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజలకు అందజేస్తున్నామన్నారు. రైతు భరోసాను రైతులను అందించడానికి ప్రభుత్వం సిద్ధమౌతుందని అన్నారు. సాంప్రదాయ పంటలను పండించడానికి రైతులు మొగ్గు చూపాలని, తరువాయి 12లో

### తెలంగాణ భాష, యాస కోసం

# సురవరం ప్రతాపరెడ్డి కృషి స్ఫూర్తిదాయకం

- నిజాం రాచరిక పాలనను కలంతో ఎదురొడ్డి నిలిచిన ధీరుడని కొనియాడిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- డా॥ అనుమాండ్ల భూమయ్య, డా॥ సంగి శెట్టి శ్రీనివాస్‌కు సురవరం ప్రతాప రెడ్డి సాహిత్య వైజయంతి సాహితీ పురస్కారం ప్రదానం

ప్రజాపక్షం/హైదరాబాద్

నిజాం రాచరిక పాలనకు వ్యతిరేకంగా తన కలంతో ఎదురొడ్డి నిలిచిన ధీరుడు తెలంగాణ వైతాళికులు సురవరం ప్రతాప రెడ్డి అని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కొనియాడారు. ప్రతాప రెడ్డి చేసిన కృషి తరతరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ప్రతాప రెడ్డి కేవలం సాహితీవేత్త మాత్రమే కాదని, స్వాతంత్ర్య పోరాట యోధులని ప్రశంసించారు. సురవరం ప్రతాప రెడ్డి 129వ జయంతిని పురస్కరించుకుని ‘సురవరం ప్రతాప రెడ్డి సాహిత్య వైజయంతి సాహితీ పుర్కసారం –2025’ ప్రదానోత్సవ కార్యక్రమం బుధవారం తరువాయి 12లో





సిపిఐ పూర్వ వైభవానికి కంకణబద్ధులు కావాలి

03

రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజునే లబ్ధిదారులకు మంజూరు లెటర్లు


### టిడిపి జాతీయ అధ్యక్షుడిగా

# మరోసారి చంద్రబాబు ఎన్నిక

**వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేశ్‌ను నియమించాలని మహానాడులో ప్రతిపాదన**



**కడప:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరోసారి తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కడపలో జరుగుతున్న మహానాడులో రెండవ రోజు బుధవారం ఎన్నికల కమిటీ చైర్మన్ వర్ల రామయ్య టిడిపి ప్రతినిధుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. 1995లో చంద్రబాబు తొలి సారి తెలుగుదేశం పార్టీ పగ్గాలు చేపట్టగా, అప్పటి నుంచి ఇప్పటి వరకు 30 ఏళ్లుగా ఆయన ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నికవుతున్నారు. ప్రతి రెండేళ్లకోసారి టిడిపి అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. ఇందులో భాగంగా తరువాయి 12లో


# చిన్నపిల్లల అక్రమ రవాణా ముఠా అరెస్టు




- 13 మందిని అదుపులోకి తీసుకున్న సూర్యాపేట పోలీసులు
- ఈ ముఠా సభ్యులు 28 మంది పిల్లలను అక్రమ రవాణా చేసినట్లుగా గుర్తింపు
- విలేకరుల సమావేశంలో వెల్లడించిన జిల్లా ఎస్‌పి

ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి

చిన్న పిల్లలను అక్రమ రవాణా చేస్తున్న 13 మంది ముఠా సభ్యులను సూర్యాపేట పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠా సభ్యులు 28 మంది చిన్న పిల్లలను అక్రమ రవాణా చేసినట్లు గుర్తించారు. వారి నుండి పదిమంది పిల్లలను పెంపుడు తల్లిదండ్రుల నుండి తీసుకుని శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు. ఇందులో ఏడుగురు బాలురు ఉండగా, ముగ్గురు బాలికలు ఉన్నారు. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా ఎస్‌పి కె.నర్సింహా బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. బుధవారం ఉదయం పది గంటలకు అక్రమ దత్తతకు తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## ఉక్రేన్‌పై త్రైపాక్షి చర్చలకు జెలెన్‌స్కీ డిమాండ్

**కీవ్:** మరోవైపు ఉక్రేన్ అధ్యక్షుడు వి.జెలెన్‌స్కీ ఒక ప్రకటన చేస్తూ అమెరికా సమక్షంలో ఉక్రేన్–రష్యా మధ్య త్రైపాక్షిక సంప్రదింపులకు తగిన ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. ఉక్రేన్–రష్యా మధ్య ముఖాముఖీ చర్చకు బదులుగా రష్యా ప్రతినిధులతో కలిపి త్రైపాక్షిక సమావేశం జరగాలని ఆయన కోరారు. వారం రోజులక్రితమే ట్రంప్ పాలనాయంత్రాంగం ఒక ప్రకటన చేస్తూ, ఈసారి బహుశా జూన్‌లో జరుగుతాయనుకుంటున్న ఉక్రేన్–రష్యా చర్చల్లో రష్యా ప్రతినిధులు కూడా పాల్గొనడం ద్వారా ఇది త్రైపాక్షిక చర్చలు అవుతాయని చూచాయిగా ప్రకటించింది. ఇస్తాంబుల్‌లో చర్చలు విఫలమైన తర్వాత కొత్త పోప్ లియో–14 ఒక ప్రకటన చేస్తూ, వాటికన్‌సిటీని ఒక తటస్థకేంద్రంగా ఉపయోగించుకుని రష్యా–ఉక్రేన్ నాయకులు శాంతి చర్చలు జరపాలని ప్రతిపాదించింది. దీనిపై ఇప్పటికే పుతిన్ సానుకూలంగా స్పందించారు. ఇదిలా ఉండగా, రష్యా,ఉక్రేన్ మధ్య మరోవైపు దాడులు కొనసాగుతున్నాయి. రాత్రికి రాత్రి రష్యాలోని అన్ని ప్రాంతాలపై ఉక్రేన్ దాడులు చేసిందని, ఈ దాడుల్లో 296 ఉక్రేన్ డ్రోన్లను తాము కూల్చివేశామని రష్యా ప్రకటించింది. అదేవిధంగా రష్యా 88 డ్రోన్లతో, ఐదు బాలిస్టిక్ క్షిపణులతో తమపై దాడి చేసిందని ఉక్రేన్ ప్రకటించింది.

## బంగ్లాదేశ్‌లో బిఎన్‌పి యూత్ భారీ ర్యాలీ



**ఢాకా:** బంగ్లాదేశ్‌లో గత ఏడాది వరకూ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బిఎన్‌పి) బుధవారంనాడు వేలాది మంది యువకులతో భారీ ర్యాలీ నిర్వహించింది. బిఎన్‌పి జాతీయ కేంద్ర కార్యాలయం నయాపాల్తన్ వద్ద ఆ పార్టీకి చెందిన మూడు విభాగాలు ఈ యూత్ ర్యాలీలో పాల్గొన్నాయి. దేశవ్యాప్తంగా 15 లక్షలమంది వచ్చి ఈ ర్యాలీలో పాల్గొంటారని బిఎన్‌పి ముందుగానే ప్రకటించింది. ఈ ఏడాది డిసెంబరు నుండి వచ్చే జూన్ లోపు బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయని మహ్మద్ యూనుస్ పదే పదే ఉద్ఘాటిస్తున్న తరుణంలో ఆ దేశంలో మెల్లిగా ఎన్నికల వాతావరణం క్రమానుగతంగా పెరుగుతున్నది. వైద్య చికిత్స నిమిత్తం ఈ ఏడాది జనవరిలో లండన్ వెళ్ళిన ఖలీదాజియా ఈనెలారంభంలో స్వదేశానికి తిరిగి వచ్చారు. తిరిగి పార్టీ కార్యకలాపాలను భారీస్థాయిలో ఉద్ధృతం చేయడం ఇదే. ‘‘యువకుల రాజకీయ హక్కుల సాధన’’ అనే పేరుతో బిఎన్‌పి ఈ యూత్ ర్యాలీని నిర్వహించింది. బిఎన్‌పి అనుబంధ బంగ్లాదేశ్ జాతియోతబాదీ ఛద్ర దళ్ విద్యార్థిపార్టీ, జూబోదళ్, స్వేచ్ఛాసబక్ దళ్‌లు ర్యాలీలో పాల్గొన్నాయి. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## థర్డ్ వరల్డ్ వార్ కంటే చెడ్డ విషయం లేదు




ట్రంప్‌కు దీమ్రితీ మెద్వెదేవ్ హెచ్చరిక

**మాస్కో :** పుతిన్ నిప్పుతో చెలగాటం ఆడుతున్నారని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో చేసిన పోస్టింగ్‌పై రష్యా మాజీ అధ్యక్షుడు, రష్యా భద్రతా మండలి డిప్యూటీ ఛైర్మన్ దీమ్రితీ మెద్వెదేవ్ తీవ్రంగా స్పందించారు. పుతిన్ నిప్పుతో చెలగాటం ఆడుతున్నారని ఇది నిజంగా చాలా చాలా చెడ్డ విషయమని ట్రంప్ విమర్శించారు. దీనిపై మెద్వెదేవ్ స్పందిస్తూ, నిజంగా చెప్పాలంటే, ‘‘ఈ ప్రపంచంలో మూడో ప్రపంచ యుద్ధంకంటే మించిన అతిచెడ్డ విషయం మరొకటి లేదు’’ అన్నారు. ‘‘నాకు తెలిసిన ఒకే ఒక్క చెడ్డ విషయం ఏమిటంటే, మూడో ప్రపంచ యుద్ధాన్ని మించినది మరొకటి ఉండదు, అదే నాకు తెలిసిన చెడ్డ విషయం, ఈ విషయాన్ని ట్రంప్ అర్థం చేసుకుంటారని నేను ఆశిస్తున్నాను’’ అని ట్రంప్‌కు మెద్వెదేవ్ చురకలు అంటించారు. ఈమేరకు ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు.
ఉక్రేన్‌పై భారీస్థాయిలో డ్రోన్లతో దాడిచేసిన రెండు రోజులకు పుతిన్‌పై ట్రంప్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పుతిన్‌కు పిచ్చి ఎక్కింది, ఆయన ఏం చేస్తున్నాడో ఆయన తెలుసా? అసలు పుతిన్‌కు ఏమైంది?’’ అని ట్రంప్ విమర్శించారు. మంగళవారంనాడు కూడా సోషల్ మీడియా వేదికగా పోస్టింగ్ పెడుతూ, ఉక్రేన్‌తో శాంతి చర్చలను తిరస్కరించడం ద్వారా పుతిన్ నిప్పుతో చెలగాటం ఆడుతున్నారు, నిజంగా ఇది చాలా చెడ్డ విషయం, రియల్లీ బ్యాడ్, నా జోక్యం లేకుండానే రష్యాలో చాలా జరిగి ఉండేది’’ అని ట్రంప్ అన్నారు. దీంతో ‘‘నాకు తెలిసీ ఈ భూమ్మీద మూడో ప్రపంచ యుద్ధం ఒక్కటే నిజంగా చాలా చెడ్డ విషయం’’ అని మెద్వెదేవ్ హెచ్చరించారు. పుతిన్ గనుక మాట వినకపోతే నా దారి నేను చూసుకుంటానని, ఇక శాంతి చర్చల్లో జోక్యం చేసుకోననీ ట్రంప్ ఇంతకు ముందు అన్నారు. ఇప్పుడు ఆయన రష్యాపై కొత్తగా ఆంక్షలు విధించాలన్న యూరప్ ఒత్తిడి గురించి ఆలోచిస్తూ కొత్త పంథా తొక్కేందుకు యత్నిస్తున్నారు. ఈ దశలోనే వాటికన్‌సిటీలో చర్చల విషయం కూడా ప్రముఖంగా ముందుకు వచ్చింది.

## పుతిన్–జెలెన్‌స్కీ ముఖాముఖీ సాధ్యమే, కానీ..

రష్యా దిశగా నాటో విస్తరణ జరగకూడదని షరతు



**మాస్కో :** రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉక్రేన్ అధ్యక్షుడు వి.జెలెన్‌స్కీ మధ్య ముఖాముఖీ సంప్రదింపుల సమావేశం సాధ్యమేననీ, కానీ వివిధ సమస్యలపై రెండు దేశాలమధ్య జరిగే చర్చల ఫలితాల ఆధారంగానే అలాంటి సమావేశం సాధ్యపడుతుందని రష్యా అధికార ప్రతినిధి దీమ్రితీ పెస్కోవ్ చెప్పారు. పుతిన్–జెలెన్‌స్కీ మధ్య ముఖాముఖీ సంప్రదింపుల విషయంలో రష్యా అనుసరించే ముఖ్యసూత్రంలో ఎలాంటి మార్పూ లేదని ఆయన బుధవారంనాడు టాస్ వార్తాసంస్థకు చెప్పారు. రష్యా క్రమశిక్షణతో కూడిన పద్ధతులు పాటిస్తోందని, యుద్ధానికిగల మూలకారణాలు పరిష్కారం కావాలని కోరుతోందని అన్నారు. రెండు దేశాల ప్రతినిధులమధ్య మొదట వివిధ సమస్యలకు సంబంధించి సంప్రదింపులు జరగాలని, ఈ సంప్రదింపుల ఫలితాలనుబట్టే పుతిన్–జెలెన్‌స్కీ ముఖాముఖీ చర్చలకు అవకాశం ఉన్నదీ లేనిదీ తెలుస్తుందని చెప్పారు. అదేవిధంగా చర్చలకు సంబంధించిన వివిధ సమస్యలపై రష్యా ప్రస్తుతం తయారు చేస్తున్న మెమొరాండం పత్రాలు కొద్దిరోజుల్లో సిద్ధం అవుతాయని, ఈ ప్రక్రియ తుదిదశలో ఉందని చెప్పారు. ఈ పత్రాలలోని సారాంశాన్ని మీడియా ద్వారా బహిర్గతం చేయడం సరైన సంప్రదాయం కాదని కూడా ఆయన అన్నారు. తాము అసలు సమస్యలపై ఇంకా చర్చలు జరపలేదని, ఎలాంటి ఒప్పందాలు చేసుకోలేదని అన్నారు. ఇస్తాంబుల్‌లో మే 16న జరిగిన చర్చల్లో తదుపరి చర్చలు కొనసాగించాలని మాత్రం రెండు దేశాలూ అంగీకరించాయి. ఐతే రెండు దేశాలూ దాదాపు వెయ్యిమంది వంతున బందీలైన సైనికులను ఇచ్చిపుచ్చుకోవాలన్న అంగీకారం కుదిరింది. ఈ మేరకు ఈ అప్పగింతల కార్యక్రమం కూడా జరిగింది. కానీ కాల్పుల విరమణ శాంతి ఒడంబడిక, జరగలేదు. టంప్ మళ్ళీ ఫోన్ సంభాషణ ద్వారా మధ్యవర్తిత్వం చేశాక, బహుశా వాటికన్‌సిటీ తటస్థకేంద్రంగా రష్యా–ఉక్రేన్ మధ్య జూన్ మొదటివారంలో శాంతి సంప్రదింపులు జరిగే అవకాశం ఉందని పుతిన్ సూచనాప్రాయంగా తెలియజేశారు. ఉక్రేన్‌కు నాటో సభ్యత్వం ఇవ్వకూడదనీ, తూర్పుదిశగా నాటో విస్తరణ జరగకూడదనీ, ఉక్రేన్‌కు ఎలాంటి ఆయుధ సహాయం ఇవ్వకూడదనీ, ఆక్రమించిన భూభాగాలను స్వాధీనం చేయాలని రష్యా కోరుతున్నది. కాగా రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లోవరోవ్ బుధవారంనాడు రష్యాలోని 13వ ఇంటర్నేషనల్ సమావేశంలో మాట్లాడుతూ, రష్యాకు హామీలు కుమ్మరించినప్పటికీ అందుకు విరుద్ధంగా తూర్పు దిశగా నాటో విస్తరణ కొనసాగుతోందనీ, ఉక్రేన్‌కు నాటో కూటమి సభ్యత్వం ఇచ్చేందుకు ముమ్మర యత్నాలు జరుగుతున్నాయని యూరోపియన్ యూనియన్ పరస్పర విరుద్ధంగా ప్రవర్తిస్తోందని విమర్శించారు. గతంలో సోవియట్ యూనియన్‌కు, తర్వాత రష్యాకు యూరప్,అమెరికాలు ఇచ్చిన హామీ మేరకు తూర్పు దిశగా నాటో విస్తరణ ఆగిపోవాలన్నారు.105 దేశాలకు చెందిన 129 మంది ప్రతినిధులు ఈనెల 27 నుండి 29 వరకూ జరిగే ఇంటర్నేషనల్ సమావేశంలో పాల్గొంటున్నారు.

## ట్రంప్‌కు లెఫ్ట్‌వింగ్ భయం

హార్వర్డ్‌తో ఫెడరల్ కాంట్రాక్టులు రద్దు



**వాషింగ్టన్ :** ట్రంప్ పాలనాయంత్రాంగం,హార్వర్డ్ విశ్వవిద్యాలయం మధ్య రోజు రోజుకూ వివాదం ముదిరిపాకాన పడుతున్నది. విశ్వవిద్యాలయాలలో లెఫ్ట్‌వింగ్ తిష్ట వేసి కూర్చుందని ఆయన భావిస్తున్నారు. పాలస్తినా అనుకూల ఉద్యమాలు క్యాంపస్‌లలో చెలరేగినప్పుడు వాటిని యూనివర్సిటీలు అరికట్టలేకపోయాయని ట్రంప్ తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. హార్వర్డ్ యూనివర్సిటీలో ట్రంప్ పోరాటానికి గల కారణాలలో ఇది ప్రథమకారణంగా ఉంది. దీంతో తాజాగా హార్వర్డ్ విశ్వవిద్యాలయంతో ఉన్న అన్ని రకాల ఫెడరల్ కాంట్రాక్టులను ట్రంప్ ప్రభుత్వం రద్దుచేసింది. ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టులతో పాటు భవిష్యత్ సేవలకు సంబంధించిన అవసరమైన ప్రత్యామ్నాయ కాంట్రాక్టులను కూడా రద్దుచేసింది. యూనివర్సిటీతో ప్రభుత్వానికి మొత్తంమీద 100 మిలియన్ డాలర్లు విలువైన కాంట్రాక్టు ఒప్పందాలున్నాయి. దీంతో ట్రంప్,హార్వర్డ్ మధ్య వివాదం ఇంకా పేట్రేగింది. ఇప్పటికే ఈ వ్యవహారం కోర్టుకు ఎక్కింది. హార్వర్డ్‌లో తొంభైశాతం విద్యార్థులు విదేశీయులేనని, వీరిలో ఎక్కువ మంది సమస్యలు సృష్టించే వారే ఉన్నారని, వీరివల్ల అమెరికాకు సమస్యలు ఎదురవుతున్నాయని ట్రంప్ వాదిస్తున్నారు. తాను చెప్పినవిధంగా యూనివర్సిటీని తీర్చిదిద్దాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. అందుకు తలొగ్గకపోవడంతో యూనివర్సిటీపై ట్రంప్ కఠిన చర్యలకు దిగారు. అమెరికాలో నాణ్యతా ప్రమాణాలతో కూడిన అత్యంత సంపద్వంతమైన విశ్వవిద్యాలయం హార్వర్డ్ మాత్రమే. ఇప్పటికే ట్రంప్ 3.2 బిలియన్ డాలర్ల రీసెర్చ్ నిధులను స్తంభింపజేశారు. తమపై ఎవ్వరి పెత్తనాన్నీ సహించేదిలేదని యూనివర్సిటీ అధ్యక్షుడు అలన్ గార్బర్ ఇప్పటికే స్పష్టం చేశారు. బయటనుండి తమపై చేసే ఒత్తిడికి లొంగేదిలేదని, ఏం చేయాలో, ఏం బోధించాలో ఎవ్వరూ తమకు చెప్పక్కరలేదని, అలాంటి న్యాయవిరుద్ధమైన డిమాండ్లకు లొంగేదిలేదని ఆయన ట్రంప్‌కు హెచ్చరించారు.



### స్టూడెంట్ వీసాల మంజూరుకు స్తంభించిన ఆన్‌లైన్ పరిశీలన

స్టూడెంట్ వీసాలను ఆమోదించేముందుగా విద్యార్థులకు ఇచ్చే అపాయింట్‌మెంట్స్ ప్రక్రియలను నిలిపివేయాలని డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వ ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలలో ఉన్న అమెరికా దౌత్యకార్యాలయాలకు ఆదేశించింది. అమెరికాలో చదువుకోవడానికి అప్పాయింట్‌మెంట్ కోరుతూ విద్యార్థులు దరఖాస్తులు చేసుకుంటారు. విద్యార్థుల అర్హతలు, వారి నైతికత, నడత వంటి అనేక అంశాలను దౌత్యకార్యాలయాలు ఆన్‌లైన్ ద్వారా పరిశీలన చేయడానికి అన్‌లైన్ సోషల్ మీడియాను భారీగా విస్తరించేందుకు దౌత్యకార్యాలయాకలు ప్రయత్నం చేయడంతో ఈ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేయాలని ట్రంప్ ప్రభుత్వం ఆదేశించింది. విద్యార్థుల అర్హతలను ఎంపిక చేసేందుకు సోషల్ మీడియా వేదికలను విస్తరించడంవల్ల మరిన్ని చిక్కులు ఎదురవుతాయని ట్రంప్ యంత్రాంగం భావించింది. అమెరికాలోని విశ్వవిద్యాలయాలలో విదేశీ విద్యార్థులతో సమస్యలు ఎదురవుతున్నాయన్న పేరుతో ట్రంప్ ప్రభుత్వం అమెరికాలో ఉన్న హార్వర్డ్ వంటి ప్రముఖ యూనివర్సిటీలను అణచివేతకు గురిచేస్తున్న తరుణంలో అమెరికా దౌత్యకార్యాలయాలన్నింటికీ ఈ ఆదేశాలు జారీ అయ్యాయి. క్యాంపస్‌లలో పాలస్తినా అనుకూల ఉద్యమాలు తలెత్తినప్పుడు వాటిని అరికట్టడంలో విశ్వవిద్యాలయాలు విఫలమయ్యాయని ట్రంప్ అసహనంగా ఉన్నారు.

### విదేశీ విద్యార్థులకు రక్షణ ఇవ్వాలని చైనా విజ్ఞప్తి

అమెరికా విశ్వవిద్యాలయాలలో చదువుకునే లక్షలమంది విదేశీ విద్యార్థులకు రక్షణ కల్పించాలని చైనా ప్రభుత్వం ట్రంప్‌కు విజ్ఞప్తి చేసింది. విదేశీ విద్యార్థులకు వీసాల మంజూరు విషయంలో ఆన్‌లైన్ అప్పాయింట్‌మెంట్లను నిలిపివేయాలని ట్రంప్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో చైనా ఈ విజ్ఞప్తి చేసింది. చైనా విద్యార్థులు అమెరికాలో గణనీయంగా ఉన్నారనీ, వారితోపాటు అనేకదేశాల విద్యార్థులకు ఉన్న చట్టబద్ధమైన హక్కులను, వారి ప్రయోజనాలను కాపాడాలని దౌత్యమార్గాలలో తెలియజేసినట్లు చైనా విదేశీమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి మావోనింగ్ బుధవారంనాడు మీడియాతో చెప్పారు. విద్యాపరమైన సహకారం, అకడమిక్ ఎక్స్ఛేంజస్‌కు ఎంత మాత్రం విఘాతం కలగకుండా చూడాలని కోరినట్లు మావోనింగ్ చెప్పారు.

## బాసర ఐఐఐటి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్‌జియుకెటి) బాసర ఐఐఐటి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల అయింది. 2025–26 విద్యా సంవత్సరానికి 6 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బిటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలైనట్టు ఆర్‌జియుకెటి విసి ప్రొఫెసర్ వెంకటరమణ, డైరెక్టర్ ప్రొఫెసర్ సతీష్ ఒక ప్రకటన విడుదల చేశారు. నోటిఫికేషన్ వివరాలు ఇలా ఉన్నాయి.
ప్రోగ్రామ్: 6 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బిటెక్ (2 సంవత్సరాల ప్రీ యూనివర్సిటీ కోర్సు + 4 సంవత్సరాల బిటెక్). **మొత్తం 1,500 సీట్లు...**85% సీట్లు తెలంగాణ స్థానిక విద్యార్థులకు, 15% సీట్లు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు మెరిట్ ఆధారంగా కేటాయిస్తారు. 5% సీట్లు గ్లోబల్ కేటగిరీ (ఇతర రాష్ట్రాలు, గల్ఫ్ దేశాల్లోని భారతీయుల పిల్లలు), 2% సీట్లు అంతర్జాతీయ/ఎన్‌ఆర్‌ఐ విద్యార్థులకు కేటాయిస్తారు.
**అర్హత:** 2025లో 10వ తరగతి లేదా తత్సమాన పరీక్షలో మొదటి ప్రయత్నంలో ఉత్తీర్ణత. వయసు 18 ఏళ్లు మించకూడదు. ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు 21 ఏళ్లు) 2025 డిసెంబర్ 31 నాటికి.
**ఎంపిక విధానం:** 10వ తరగతి జిపిఎ, సబ్జెక్టుల్లో వచ్చిన గ్రేడ్ల ఆధారంగా మెరిట్ ద్వారా ఎంపిక. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 0.4 డిప్రివేషన్ స్కోర్ జోడిస్తారు.
**అప్లికేషన్ వివరాలు:** ఆన్‌లైన్ దరఖాస్తులు జూన్ 1, 2025 నుంచి జూన్ 22, 2025 వరకు స్వీకరిస్తారు. టిఎస్ ఆన్‌లైన్ సెంటర్, మీసేవా లేదా వర్సిటీ వెబ్‌సైట్ www.rgukt.ac.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

## రూ.51 కోట్లు విడుదల (మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ శాఖ అధికారులను అదేశించారు. ఒక వైపు పంటల కొనుగోళ్ళను చేపడ్తున్న ప్రభుత్వం, పంట నష్టపోయిన రైతులను కూడా ఆదుకోవాలని, అట్టి నష్ట పరిహారాన్ని కూడా రైతుల ఎకౌంట్లలో నేరుగా జమ చేసేందుకు వీలుగా సర్వేకు ఆదేశాలివ్వగా నివేదికలు ప్రభుత్వానికి సమర్పించడమైనది. దాదాపు 29 జిల్లాల్లో 41,361 మంది రైతులకు సంబంధించి 51.528 ఎకరాలలో పంట నష్టం సంభవించిందని అధికారులు అంచనా వేయడమైనది. దీనికి సంబంధించిన రూ51 కోట్లు నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఇట్టి నిధులను సంబంధిత విభాగాలతో సమన్వయం చేసుకొని త్వరలోనే నష్టపోయిన రైతుల ఎకౌంట్లలో జమ చేయడానికి చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను వ్యవసాయశాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు గారు ఆదేశించడమైనది. రాష్ట్ర వ్యాప్తంగా వరి 36,424 ఏకరాలు, మొక్కజొన్న 3,266 ఎకరాలు, జొన్న 470 ఎకరాలు, ఉద్యాన పంటలు 6,589 ఎకరాలు, ప్రత్తి 4753 ఎకరాలలు మరియు ఇతర పంటలు 477 ఎకరాలలో (ప్రాణహిత వరదల మూలంగా సంభందించిన నష్టం) పంట నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు.

## నామినేటెడ్ పదవులు

(మొదటి పేజీ తరువాయి)

సమావేశమై చర్చించనున్నారు. ఈ విస్తృత స్థాయి సమీక్షల ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిని అంచనా వేసి, తదుపరి చర్యలకు రూపకల్పన చేయనున్నట్లు సమాచారం. మంత్రివర్గ విస్తరణ విషయంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఎంఎల్‌ఎలు రహస్య సమావేశం కావడం, వారిలో కొంత మంది మీనాక్షి నటరాజన్‌తో ఫోన్‌లో మాట్లాడటం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో మాదిగ ఎంఎల్‌ఎలు తనను కలిసేందుకు ఆమె సమయం ఇచ్చారు. దీంతో వారంతా మీనాక్షి నటరాజన్‌ను కలిసి పార్టీ అభివృద్ధి, పదవుల పంపకాలపై చర్చించినట్లు పార్టీ నేతలు తెలిపారు.

## అపరేశ్ కుమార్ సింగ్

(మొదటి పేజీ తరువాయి)

కూడా వ్యవహరించారు. జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ 2023 ఏప్రిల్ 17వ తేదీన త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాద్యలు స్వీకరించారు. కాగా ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న తడకమల్ల వినోద్‌కుమార్ మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేస్తూ సుప్రీం కోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. 1964 నవంబర్ 17న జన్మించిన ఆయన ఉమ్మడి నల్లగొండ జిల్లా సూర్యాపేటలో పాఠశాల విద్యను అభ్యసించారు. అనంతరం హైదరాబాద్‌లో బిఎ, ఎల్ఎల్‌బి(ఉస్మానియా యూనివర్సిటీ) పట్టాలు పొందారు. ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో 1988లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. 2019 ఆగస్టు 26న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

**మరో మూడు హైకోర్టులకు..**

తెలంగాణతో పాటు మరో నాలుగు హైకోర్టులకు కొత్త ఛీఫ్ జస్టిస్‌లను కొలీజియం సిఫార్సు చేసింది. రాజస్థాన్ హైకోర్టు ఛీఫ్ జస్టిస్ మనీంద్ర మోహన్ శ్రీవాస్తవను మద్రాస్ హైకోర్టుకు, మద్రాస్ హైకోర్టు ఛీఫ్ జస్టిస్ కె.ఆర్.శ్రీరామన్‌ను రాజస్థాన్ హైకోర్టుకు,జార్ఖండ్ హైకోర్టు ఛీఫ్ జస్టిస్ ఎం.ఎస్.రామచంద్ర రావును త్రిపుర హైకోర్టుకు బదిలీ చేస్తూ కొలీజియం సిఫార్సు చేసింది.

## ‘నైరుతి’ విస్తరణ (మొదటి పేజీ తరువాయి)

కొనసాగుతుందని, దానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోందని, ఎత్తుకు వెళ్లేకొద్దీ దక్షిణ వైపునకు వంగి ఉందని తెలిపారు. రాబోయే 24గంటల్లో ఉత్తర బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో బుధవారం తెలంగాణలోని భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయన్నారు. మూడు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామన్నారు. ఇక నిర్మల్, నిజామాబాద్, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురుస్తాయన్నారు. నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్నగర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని తెలిపారు. శుక్రవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయన్నారు. వారం రోజుల అనంతరం ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు చెప్పారు.

## ఎంఎస్‌పి పెంపు

(మొదటి పేజీ తరువాయి)

వర్షపాతంపై ఆధారపడే జరుగుతుందని మంత్రి చెప్పారు. ఈ మంత్రివర్గ సమావేశంలో రైతులకు ప్రయోజనం కలిగించే రెండు ప్రధాన నిర్ణయాలను ప్రభుత్వం తీసుకుందని ఆయన చెప్పారు. వీటిల్లో ఒకటి ఖరీఫ్ పంటలకు మద్దతు ధరలు పెంచడంకాగా, రెండోది వడ్డీ రాయితీ పథకం అమలు నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. గడచిన 11 సంవత్సరాలుఆ దేశంలో వ్యవసాయ వ్యయాలు, ధరల కమిషన్ సిఫార్సుల మేరకు 14 ఖరీఫ్ పంటలకు భారీఎత్తున సామూహికంగా మద్దతు ధరలు పెంచామని ఆయన అన్నారు. ప్రస్తుత 2025–26 ఆర్థిక సంవత్సరం మార్కెటింగ్ సీజన్‌లో సాధారణ, ఏ గ్రేడ్ వరిధాన్యం రకాలకు మద్దతు ధరలను క్వింటాలుకు రూ.69లు పెంచామని, తద్వారా సాధారణ రకం వరిధాన్యం క్వింటాలు ధర రూ.2,369లు, ఏ గ్రేడు రకం ధాన్యం క్వింటాలు ధర రూ.2,389గా నిర్దేశిచారు.
ఇక ఇతర తృణధాన్యాలలో రాగులకు మద్దతు ధరను రూ.596 లకు పెంచడంతో దీని క్వింటాలు ధర రూ.4,886లకు పెరిగింది. జొన్నలకు రూ.328లు మద్దతు ధర పెంచడంతో దాని క్వింటాలు ధర రూ.3,699కు చేరింది. హైబ్రీడు రకం జొన్నల క్వింటాలు ధర రూ.3,749లకు, మొక్కజొన్న ధర రూ.175లు పెంచడంతో దాని క్వింటాలు ధర రూ.2,400లు పెరిగింది. సజ్జలుకు రూ.150 లు పెంచారు. దీంతో సజ్జలు క్వింటాలు ధర రూ.2,775కు పెరిగింది. కందులు మద్దతును క్వింటాలుకు రూ.450లు పెంచడంతో దాని క్వింటాలు ధర రూ.8000కు చేరింది. మినపప్పుకు మద్దతు ధర రూ.400లు పెంచడంతో దాని క్వింటాలు ధర రూ.7,400లు పెరిగింది. పెసరపప్పు మద్దతు ధర రూ.86లు పెంచారు. దీనివల్ల పెసలు క్వింటాలు ధర రూ.8,768కు పెరిగింది. అదేవిధంగా వేరుసెనగ పంటకు రూ.480 లు మద్దతు ధర పెంచడంతో దాని క్వింటాలు ధర రూ.7,263లు చేరుకుంది. ఇక సోయాబీన్స్‌కు రూ.436 లు పెంచడంతో దాని క్వింటాలు ధర రూ.5,329లకు చేరింది. పొద్దుతిరుగుడుపువ్వు గింజలకు మద్దతు ధర రూ.441గా నిర్ణయించడంతో దాని క్వింటాలు ధర రూ.7,721లకు పెరిగింది. 2025–26 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో ఈ ధరలు చెల్లుబాటులో ఉంటాయి. అదేవిధంగా నువ్వుల మద్దతు ధర రూ.579గా నిర్ణయించడంతో దీని క్వింటాలు ధర రూ.9,846లకు పెరిగింది. గడ్డినువ్వులకు మద్దతు ధరను రూ.820గా ప్రకటించడంతో దాని క్వింటాలు ధర రూ.9,537లు పెరిగింది. 2025–26 ఖరీఫ్ మార్కెటింగ్ సీజనుకుగాను ఈ ధరలు చెల్లుబాటు అవుతాయి. కాగా పత్తి పంటకు మద్దతు ధరను రూ.589 పెంచారు. దీని క్వింటాలు ధర రూ.7,710 (మధ్యతరహా) పెరిగింది. పొడుగ్గా ఉండే పత్తికి మద్దతు ధరను క్వింటాలుకు రూ.8,110లు పెరిగింది.

**ఖరీఫ్ సీజన్‌లో కెసిసి రైతులకు రూ.15,640 కోట్లు వడ్డీ రాయితీ**

కిసాన్ క్రెడిట్ కార్డు (కెసిసి) కింద రైతులు తీసుకున్న స్వల్పకాలిక పంట రుణాలపై సవరించిన వడ్డీరాయితీ పథకాన్ని కొనసాగించాలని కేంద్రమంత్రివర్గం బుధవారంనాడు నిర్ణయించింది. ప్రధానమంత్రి మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ పథకం ‘‘మిస్’’ (సవరించిన వడ్డీ రాయితీ పథకం)ను 2025–26 ఆర్థిక సంవత్సరంలో రైతులు తీసుకున్న స్వల్పకాలిక రునాలకు వర్తింపజేస్తారు. దేశంలో మొత్తం 7.75 కోట్ల కంటే ఎక్కువ సంఖ్యలోనే కిసాన్ క్రెడిట్ కార్డు (కెసిసి) అకౌంట్లు ఉన్నాయి. ఈ పథకం కింద రైతులు తీసుకున్న స్వల్పకాలిక రుణాలపై వడ్డీని 1.5 శాతం మేరకు రాయితీ ఇస్తారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వమే మినహాయించిన ఈ రాయితీ భారాన్ని భరిస్తుందని కేంద్రమంత్రి అశ్వనీ వైష్ణవ్ మంత్రివర్గ సమావేశానంతరం చెప్పారు. ఈ వడ్డీ రాయితీ పథకం కొనసాగించడంవల్ల ఈ ఖరీఫ్ సీజనులో కేంద్ర ప్రభుత్వం రూ.15,640 కోట్లను భరిస్తుంది. ఈ ‘మిస్’ పథకం కింద కిసాన్ క్రెడిట్ ద్వారా రూ.3 లక్షల వరకూ స్వల్పకాలిక రుణం తీసుకునే రైతులకు మొత్తం 7 శాతం వడ్డీ పడుతుంది. ఇందులో 1.5 శాతం వడ్డీని కేంద్ర ప్రభుత్వం ‘మిస్’ పథకం కింద రైతులకు తగ్గిస్తుంది. ఒకవేళ రైతులుగనుక సకాలంలో రుణాలను బ్యాంకులకు చెల్లించేస్తే అదనంగా మరో మూడుశాతం మేరకు ప్రోత్సాహక రాయితీ పి.ఆర్.ఐ (సకాలంలో చెల్లించినందుకు ప్రోత్సాహకం) కి అర్హులు అవుతారు. ఈ విధంగా నాలుగుశాతం మేరకు రైతులకు రుణ రాయితీలు లభిస్తాయి. ప్రత్యేకించి పశుసంవర్థకం, చేపలు పెంపకంకోసం రూ.2 లక్షల వరకూ తీసుకునే రుణాలపై వడ్డీ ప్రయోజనాలు రైతులకు లభిస్తాయి.

**మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లకు మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులు**

మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో రెండు మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ (సిసిఇఎ) ఆమోదం తెలియజేసింది. రూ.3,339 కోట్ల అంచనా వ్యయంతో 2029–30 సంవత్సరం నాటికి ఈ రెండు రైల్వే ప్రాజెక్టులను పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రయాణికుల రైళ్ళు, సరుకు రవాణా రైళ్ళ రాకపోకలు గణనీయంగా పెరుగుతున్నందవల్ల పెరుగుతున్న రైల్వే వాణిజ్య అవసరాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టులను చేపట్టారు. రట్లమ్–నగ్దా మధ్య మూడు, నాలుగో రైల్వే లైనులు నిర్మిస్తారు. వార్ధా–బల్లార్షా మధ్య నాలుగో రైల్వే లైను నిర్మిస్తారు. ప్రధానమంత్రి గతిశక్తి జాతీయ బృహత్తర ప్రణాళిక కింద ఈ ప్రాజెక్టులను మంజూరు చేశారు. బహుళ అనుసంధాన నమూనా ప్రణాళిక కింద ఎక్కువ అవసరాలు తీరేవిధంగా ఈ రైల్లే లైనులు నిర్మిస్తారు. అటు ప్రయాణికుల రైళ్ళకుగానీ, ఇటు సరుకు రవాణా రైళ్ళ రాకపోకలకుగానీ ఎలాంటి జాప్యం, ఆటంకాలు లేకుండా ఉండేవిధంగా ఈ నిర్మాణాలు జరుగుతాయి. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలోని నాలుగు జిల్లాలలో ప్రజలకు ఈ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం ఉన్న రైల్వే వ్యవస్థలో మరో 176 కి.మీ నిడివి పెరుగుతుంది. మొత్తం 784 గ్రామాలకు, 19.74 లక్షలమంది ప్రజలకు ఈ రైల్వే ప్రాజెక్టులవల్ల ప్రయోజనం కలుగుతుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మూడోవిడత పదవీకాలంలో ఇప్పటివరకూ దేశంలో రూ.4.50 లక్షల కోట్లు కంటే ఎక్కువ విలువైన పలు ప్రాజెక్టులకు ఆమోదాలు తెలియజేశారని మంత్రి అశ్వనీ వైష్ణవ్ చెప్పారు.

## అడ్డుకుంటున్నారు

(మొదటి పేజీ తరువాయి)

వాస్తవం కాదా? అని బిఆర్‌ఎస్ పార్టీ నేతలను సిఎం రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ఏడాదిలోనే 59 వేల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశామని స్పష్టం చేశారు. మొదటి ఏడాదిలోనే ఇన్ని ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని తెలిపారు. గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించి ఫలితాలు సైతం విడుదల చేశామన్నారు. కానీ నోటికాడి కూడును కింద పడేసినట్లు, రాజకీయ కుట్రతో నియామక పత్రాలు ఇవ్వకుండా అడ్డుకున్నారని గత ప్రభుత్వ పెద్దలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో గ్రూప్ 1 పరీక్షలు కూడా నిర్వహించని పార్టీలు కోర్టులో కేసులు వేసి అడ్డుకుంటున్నారన్నారని విమర్శించారు. అందుకే ఇది సామాజిక సమస్యగా మారుతోందన్నారు. తన ఇంట్లో వాళ్లు ఒక చోట ఓడిపోతే మరోచోట పదవులు ఇచ్చుకున్నారని, విద్యార్థులకు మాత్రం ఏళ్ల తరబడి ఉద్యోగాలు దక్కకుండా చేస్తున్నారని రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారు యువతకు ఎదురైతే ప్రశ్నించాలని యువతకు సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. సివిల్స్ మెయిన్స్‌కు ఎంపికైన వారికి రూ.లక్ష ఇచ్చి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

**సురవరం ప్రతాపరెడ్డి స్ఫూర్తిని కొనసాగించేందుకే తెలుగు వర్సిటీకి పేరు..**

తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి స్ఫూర్తిని కొనసాగించేందుకే తెలుగు యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టుకున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. సురవరం ప్రతాపరెడ్డి నిజాంకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తెచ్చారని, ప్రజల కోసం పాటు పడిన వారే చరిత్రలో నిలిచిపోతారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తోందన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా ఎస్‌సి, ఎస్‌టిలను పాలకులుగా మార్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు.

**కులం వల్ల ఎవరికీ గుర్తింపు రాలేదు... చదువుతోనే గుర్తింపు వచ్చింది...**

చాలామంది మహనీయులకు గుర్తింపు తెచ్చింది కులం కాదని, చదువు మాత్రమేనని, ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే చదువుతోనే సాధ్యమవుతుందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆత్మన్యూనత భావాన్ని వీడాలని దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలకు సిఎం రేవంత్ రెడ్డి పిలుపు నిచ్చారు. వారిలోని ఆత్మన్యూనత భావాన్ని తొలగించేందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దళితులు, బిసిలకు గొర్రెలు, బర్రెలు, చేప లు పెంచుకుంటూ ఉండాలన్నట్లుగా మాజీ సిఎం వ్యవహరించారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ వస్తే, ఉద్యోగాలు వస్తాయని భావించిన యువత ఆశలపై నీళ్లు చల్లారని, మాజీ సిఎం తన ఇంట్లో ఉద్యోగాలు ఇచ్చుకున్నారు కానీ, రాష్ట్రంలోని పేదలకు మాత్రం ఉద్యోగాలు ఇవ్వలేదని మండిపడ్డారు. కానీ యువతకు చదువు చెప్పించి రాజ్యాధికారంలో భాగస్వాములను చేస్తామని ఎందుకు చెప్పలేదని బిఆర్‌ఎస్ నేతలను ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి నిలదీశారు.

**తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్...**

దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందని సిఎం అన్నారు. సమాజంలో రుగ్మతలు, అసమానతలు తొలగించాలని ఈ సందర్భంగా విద్యార్థులకు సిఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మొదటి పాతికేళ్ల వయసు వరకు బాగా చదువుకుంటేనే విద్యార్థులు జీవితంలో రాణిస్తారని అన్నారు. తప్పుదారి పడి తే కన్న తల్లిదండ్రులు తలదించుకునే పరిస్థితి ఉంటుందని, అలాంటి పరిస్థితులు ఎప్పుడూ తెచ్చుకోవద్దని విద్యార్థులకు సూచన చేశారు. కష్టపడి ఆత్మ విశ్వాసంతో రాణించి తల్లిదండ్రులకే కాదు, రాష్ట్రానికి గర్వకారణంగా నిలవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. వందేళ్ల ఉస్మానియా చరిత్రలో తొలిసారిగా దళితుడిని వైస్ చాన్సలర్‌గా నియమించిన ఘనత ఈ ప్రభుత్వానిదేనని తెలిపారు. విద్యా కమిషన్ ఛైర్మన్‌గా ఆకునూరి మురళిని నియమించామని తెలిపారు. అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్‌ను ప్రజా ప్రభుత్వంలో ఎంపిక చేసుకున్నామన్నారు. వీరందరికీ కేవలం కులం ప్రాతిపదికన గుర్తింపు రాలేదని, చదువుకున్నారు కాబట్టే వారికి ఈ గుర్తింపు వచ్చిందని విద్యార్థులకు వివరించారు. అన్ని రంగాల్లో విద్యార్థులు, యువత రాణించాలన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## మేడిగడ్డ బ్యారేజీపై ఎన్‌డిఎస్‌ఎ నివేదిక బూటకమని తేలింది

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెండ్ కె.టి.రామారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మేడిగడ్డ బ్యారేజీపై ఎన్‌డిఎస్‌ఎ ఇచ్చిన నివేదిక అంతా బూటకమని, ఇప్పటిదాకా బిఆర్‌ఎస్ చెబుతున్నమాటే అక్షరాలా నిజమని తేలిపోయిందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అన్నారు. కనీస పరీక్షలు నిర్వహించకుండా ఎన్‌డిఎస్‌ఎ తుది రిపోర్టు ఎలా ఇస్తుందని ప్రపంచ ప్రఖ్యాత నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టి సూటిగా ప్రశ్నించడంతో ఈ నివేదిక తప్పులతడక అని రుజువైపోయిందన్నారు. క్షేత్రస్థాయిలో కనీస పరీక్షలు చేయకుండానే ఎన్‌డిఎస్‌ఎ ఇచ్చిన నివేదికను ఎల్ అండ్ టి పూర్తిగా తిరస్కరించడం రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారుకు, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి పూర్తిగా చెంపపెట్టు లాంటిదే అన్నారు. ఇకనైనా పోలవరం తరహాలో పునరుద్ధరణ చర్యలు చేపట్టి తెలంగాణ రైతుల సాగునీటి కష్టాలను తీర్చాలన్నారు.



## బహుముఖ ప్రజ్ఞాశాలి సురవరం ప్రతాపరెడ్డి

రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి
ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, ప్రొఫెసర్లు నిత్యానందరావు, ఎల్లూరి శివారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బహుముఖ ప్రజ్ఞాశాలి, తెలంగాణ పోరాటం, సామాజిక స్ఫూర్తి ప్రదాత సురవరం ప్రతాపరెడ్డి అని, అంత గొప్ప వ్యక్తి పేరు తెలుగు యూనివర్సిటీకి పెట్టడం హర్షనీయమని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో బుధవారం జరిగిన సురవరం ప్రతాపరెడ్డి 129వ జయంతి సభకు డాక్టర్ చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ నూతన లోగోను ఆయన ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డి పేరు ఉమ్మడి రాష్ట్రంలోనే తెలుగు యూనివర్సిటీకి పెట్టాల్సిందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంతటి గొప్ప వ్యక్తి పేరు తెలుగు యూనివర్సిటీకి పెట్టడం చారిత్రాత్మకమని అన్నారు. కవి, రచయిత, ప్రముఖ సంపాదకుడు, సామాజిక వేత్త, ఎంఎల్‌ఎగా ఇలా అనేక రంగాల్లో సురవరం ప్రతాపరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అయిన సురవరం ప్రతాపరెడ్డి గ్రంథాలయాల అభివృద్ధికి ఎంతో కృషిచేశారని డాక్టర్ చిన్నారెడ్డి అన్నారు. ప్రస్తుతం గ్రంథాలయాలు ఈ స్థాయిలో ఉన్నాయంటే సురవరం శతాబ్దం గతంలో వేసిన పునాదే కారణమన్నారు. రెడ్డి హాస్టల్స్ నిర్వహించడమే కాకుండా ఇతర సామాజిక వర్గాల హాస్టల్స్ ఏర్పాటుకు తోడ్పాటును అందించిన మహనీయుడు సురవరం అని, దళితులు, ఇతర వర్గాల అభ్యున్నతి కోసం సురవరం పాటుపడ్డారని కొనియాడారు.

కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, తెలంగాణ సారస్వతపరిషత్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎల్లూరి శివారెడ్డి, తెలుగు యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ వెలుదండ నిత్యానందరావు, అసిస్టెంట్ డైరెక్టర్ రామ్మూర్తి, ప్రముఖ కవి, రచయిత సంగిశెట్టి శ్రీనివాస్, సురవరం ప్రతాపరెడ్డి కుమారులు సురవరం విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

# సిపిఐ పూర్వ వైభవానికి కంకణబద్ధులు కావాలి

ప్రజాక్షేత్రం నుంచి సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలి
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ జిల్లాలో భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ)కి పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు శ్రేణులంతా కంకణ బద్ధులు కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట రెడ్డిలు పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా సిపిఐ 23వ మహాసభలో భాగంగా రెండో రోజు ప్రతినిధుల సమావేశం జరిగింది.

మహాసభకు నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కిన్నెర మల్లవ్వలు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి గత మూడేళ్లలో జిల్లాలో నిర్వహించిన పార్టీ కార్యక్రమాల కార్యదర్శి నివేదికను సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో సిపిఐకి ఘనమైన చరిత్ర ఉందన్నారు. నైజాంను గద్దెదించి ప్రజాస్వామ్యం ఏర్పాటైన తర్వాత తెలంగాణ నుంచి మొట్టమొదటి రాష్ట్ర కార్యదర్శి బద్దం ఎల్లా రెడ్డి జిల్లా వాసి అని గుర్తుచేశారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట రెడ్డి ఈ జిల్లా వాసియేనని పేర్కొన్నారు. రంగు రంగుల పార్టీలు అధికారంలోకి వచ్చి మాటలకు, చేతలకు పొంతన ఉండడంలేదన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ సామాజిక న్యాయం అమలు చేయడంలేదన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శక్తుల విజృంభణ కొనసాగిస్తూ బిజెపి ప్రమాదకరంగా మారిందన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో పెన్షన్, రుణమాఫీ పూర్తి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు వంటి పథకాలు అమలుకావడంలేదన్నారు. అర్హులందరికీ ఇవ్వకుండా ఇష్టారీతిన నిబంధనలు పెట్టడం సమంజసం కాదన్నారు. ఈ విషయమై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి పరిష్కరించాలన్నారు. పేదల పక్షపాతి సిపిఐ అని, ప్రశ్నించే గొంతుకై ప్రజా ఉద్యమాలు చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ సత్తాచాటి నిరూపించుకోవాలన్నారు. తిరగబడాలంటే కమ్యూనిస్టులాగా ఉండాలన్న భావన ప్రజల్లో కలిగిందన్నారు. కొత్త పంథాతో పడిలేచిన కెరటంలో పునరుజ్జీవంతో కమ్యూనిస్టు ఉద్యమం కొనసాగాలన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మర్రి వెంకటస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు పొనగంటి కేదారి, బోయిని అశోక్, కొయ్యడ సృజన్ కుమార్, అందె స్వామి, బత్తుల బాబు, గూడెం లక్ష్మితో పాటు జిల్లా వ్యాప్తంగా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా ‘పంజా’ల శ్రీనివాస్



భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా పంజాల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కరీంనగర్‌లో 23వ జిల్లా మహాసభలో భాగంగా రెండో రోజు బుధవారం ప్రతినిధుల సమావేశంలో నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా మహాసభలో నూతన కార్యవర్గం కౌన్సిల్ ఎన్నిక జరుగగా 14 మందితో కార్యవర్గం, 35 మందితో కౌన్సిల్, ఐదుగురు క్యాండిడేట్ సభ్యులు, నలుగురు ఆహ్వానితులను మహాసభలో ఎన్నుకున్నారు. నూతన జిల్లా కార్యదర్శిగా పంజాల శ్రీనివాస్ ఎన్నికైనట్లు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ ప్రకటించారని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మర్రి వెంకటస్వామి తెలిపారు.

## రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజునే లబ్ధిదారులకు మంజూరు లెటర్లు

జిల్లా కలెక్టర్లకు డిప్యూటీ సిఎం ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2వ తేదీన అన్ని జిల్లాలలో రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు శాంక్షన్ లెటర్ల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఆయా జిల్లా ఇన్‌చార్జి మంత్రులకు లబ్ధిదారుల జాబితాను సమర్పించి వారి అనుమతితో జిల్లా కలెక్టర్లు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన అన్నారు. రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క మల్లు, రాష్ట్ర బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామ కృష్ణారావులు బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజీవ్ యువ వికాసం పథకం అమలు ప్రగతిని అన్ని జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఆశలను ముందుకు తీసుకు వెళ్లే క్రమంలో ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా భావించి రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా 5లక్షల మంది యువతకు 6 వేల 250కోట్లతో స్వయం ఉపాధి కల్పించనున్నారని ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామ కృష్ణారావు మాట్లాడుతూ, లబ్ధిదారులకు నిజమైన లబ్ధి చేకూరే విధంగా యూనిట్ల ఎంపిక ఉండాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. తద్వారా ఎంచుకున్న యూనిట్ల ద్వారా యువతీ యువకులకు ఆదాయ వనరుగా, లబ్ధిదారుని కుటుంబం ఆర్థికంగా బలపడే విధంగా రాజీవ్ యువ వికాసం పథకం తోడ్పడాలని సి.ఎస్ అధికారులకు సూచించారు. లబ్ధిదారులకు శిక్షణ, క్షేత్ర స్థాయిలో యూనిట్ల గ్రౌండింగ్ వరకు అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలని, బ్యాంకర్లతో సమన్వయం చేసుకొని ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి తో పాటు రాష్ట్ర జిడిపిలో వారిని భాగస్వామ్యం చేసే విధంగా యూనిట్ల ఎంపిక జరగాలని సి.ఎస్ సూచించారు. అదేవిధంగా వాతావరణ శాఖ విడుదల చేసిన హెచ్చరికల నేపథ్యంలో సంబంధిత జిల్లాలలో కురుస్తున్న వర్షాల పట్ల జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ముందు జాగ్రత్తలపై దృష్టి సారించాలని సి.ఎస్ అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్‌సి డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, బిసి సంక్షేమ శాఖ సెక్రెటరీ ఇ.శ్రీధర్, బిసి సంక్షేమ కమిషనర్ బాల మాయాదేవి, మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ యాస్మిన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ఉద్యోగులకు వంద శాతం జీతాలు చెల్లింపు

సిఎంకు, మంత్రి సీతక్కకు గిరిజన సంఘాల కృతజ్ఞతలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణా గిరిజన సహకార సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ వంద శాతం జీతాలు విడుదల చేయడం పట్ల రాష్ట్ర వ్యాప్తంగా మారుమూల గిరిజన ప్రాంతాలలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు తరువాత పూర్తి స్థాయి జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఉద్యోగుల బాధలను సానుభూతితో విని సమస్యను పరిష్కరించిన పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంతి ధనసరి అనసూయ సీతక్కకు ఉద్యోగులు కృతజ్ఞతలు తెలియజేశారు. టిజిజిసిసికి సరిపడా నిధులను కేటాయించి సంస్థ ఉద్యోగుల కుటుంబాలలో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రతి ఉద్యోగి రుణపడి ఉంటామని జిసిసి ఉద్యోగ సంఘ నాయకులు తెలియజేశారు. ఉద్యోగుల సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉండి వారి వేతనాల సమస్య పరిష్కారానికి కృషి చేసిన చైర్మన్ కోట్నాక్ తిరుపతి, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డా.ఎ.శరత్ ఉద్యోగులందరి తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సంస్థ ఉద్యోగ సంఘ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి చేపట్టే ప్రతి కార్యక్రమంలో తమ వంతు పాత్ర నెరవేరుస్తూ గిరిజనుల అభివృద్ధికి పాటు పడతామని తెలియజేసినారు. గిరిజన ఉద్యోగులందరికీ సకాలంలో జీతాలు చెల్లించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వరంగ సమాఖ్య ప్రధాన కార్యదర్శి జిటి జీవన్ కృతజ్ఞతలు తెలిపారు.




## భారత్‌లో 2028లో 21వ ప్రపంచ గులాబీ సదస్సు

ప్రకటించిన వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ రోజ్ సొసైటీస్
జపాన్‌లో ముగిసిన 20వ ప్రపంచ గులాబీ సదస్సు తీర్మానం
సొసైటీ అధ్యక్షుడిగా సుశీల్‌ప్రకాష్ ఎన్నిక

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచ సదస్సుకు భారత్ మరో వేదిక కాబోతుంది. 21వ ప్రపంచ గులాబీ సదస్సు 2028లో ఇన్‌క్రెడిబుల్ ఇండియాకు గుండెకాయ అయిన మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరుగుతుందని జపాన్‌లోని ఫుకుయామాలో ఇటీవల ముగిసిన 20వ ప్రపంచ గులాబీ సదస్సులో వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ రోజ్ సొసైటీస్ (డబ్ల్యూఎఫ్ఆర్ఎస్) ప్రకటించింది. ఈ మేరకు ఈనెల 25న జపాన్‌లో జరిగిన 20వ ప్రపంచ గులాబీ సదస్సు తీర్మానించింది. ఈ సదస్సు మధ్యప్రదేశ్ భోపాల్‌లో నిర్వహిస్తామని మధ్యప్రదేశ్ టూరిజం, సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శివ్‌శేఖర్ శుక్లా తెలిపారు. అంతేకాకుండా జపాన్ సదస్సుకు హాజరైన 700 మందికిపైగా అంతర్జాతీయ ప్రతినిధులు వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ రోజ్ సొసైటీస్ (డబ్ల్యూఎఫ్ఆర్ఎస్) అధ్యక్షుడిగా మధ్యప్రదేశ్ పర్యటక శాఖ మాజీ అడ్వయిజర్ సుశీల్‌ప్రకాష్‌ను ఎంపిక చేయడం భారత్‌కే గర్వకారణమని శివ్ శేఖర్‌శుక్లా పేర్కొన్నారు. భారతదేశం మొదటిసారిగా ప్రపంచ గులాబీ సదస్సుకు ఆతిథ్యం కల్పించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం భారతదేశం ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సమావేశాన్ని మొదటిసారిగా నిర్వహిస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా 700మందికి పైగా ప్రతినిధులను ఒకేచోటికి చేరడం తమకు గర్వంగా ఉందని టూరిజం శాఖ డిప్యూటీ డైరెక్టర్, అడ్వయిజర్ వివేక్ జూడ్ తెలిపారు. సరస్సులు, సుందరమైన ఉద్యానవనాలు ఉండడంతోభోపాల్ ఈసమావేశానికి అనువైన వేదికను అందించడానికి సిద్ధంగా ఉందన్నారు. తమ రాష్ట్రానికి చెందిన సుశీల్‌ప్రకాష్ ప్రపంచ రోజ్ సొసైటీకి అధ్యక్షుడు కావడం కూడా తమకు ఆనందంగా ఉందన్నారు.

## కాల్పుల విరమణలో ట్రంప్ పాత్రపై మోదీ వివరణనివ్వాలి

ప్రజాసమస్యల సాధనకు పోరాటం
సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పిలుపు



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** భారత్, పాక్‌లకు వాణిజ్య ఒప్పందాలను రద్దుచేసుకుంటామని చెప్పి కాల్పుల విరమణకు ఒప్పించినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనపై ప్రధాని మోదీ వివరణనివ్వాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. బుధవారం మధ్యాహ్నం సిపిఐ(ఎం) జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ట్రంప్ జోక్యంతో కాల్పుల విరమణ జరగడంపై దేశప్రజలు అవమానంగా భావిస్తున్నారన్నారు. ట్రంప్ వ్యాఖ్యలను ప్రధాని మోదీ ఖండించకపోవడం సందేహాలకు తావిస్తుందన్నారు.

పహల్గాంలో ఉగ్రవాదుల దాడి విషయంలో రాజకీయాలకతీతంగా అన్నిపార్టీలు, ప్రజలు కేంద్ర ప్రభుత్వానికి ఆపరేషన్ సిందూర్ విషయంలో మద్దతునిచ్చారని గుర్తుచేశారు. దేశ, విదేశాల్లో పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిపై కేంద్రం ప్రచారం చేస్తుందని, ఇదే క్రమంలో ఈ సంఘటనపై ప్రధాని పార్లమెంటు సమావేశం నిర్వహించి ఎంపీల అభిప్రాయాలు తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. పహల్గాంలో దాడిచేసిన ఉగ్రవాదులను ఒక్కరిని కూడా అరెస్ట్ చేయకపోవడం సందేహాలకు తావిస్తుందన్నారు. నీతి ఆయోగ్ సమావేశంలో భారత్ 4వ అభివృద్ధి చెందిన దేశంగా ప్రధాని మోదీ చెప్పడాన్ని జాన్‌వెస్లీ తప్పుపట్టారు. 1శాతం ఉన్న కార్పొరేట్లు 40శాతం సంపదను కలిగి వున్నారన్నారు. 50 శాతం ఉన్న పేదలచేతిలో కేవలం 3 శాతం సంపద మాత్రమే వుందన్నారు. దేశంలో 42 శాతం మంది ప్రజలు ఉండడానికి కనీస సౌకర్యాలు లేకుండా వున్నారన్నారు. 30శాతం మంది ప్రజలకు పౌష్టికాహారం లోపముందని వివరించారు. నెలకు రూ.26వేల కనీస వేతనమివ్వాలని కార్మికులు పోరాటం చేస్తున్నారన్నారు. లక్ష మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. దేశంలో ప్రజల మధ్య సంపద సమానంగా లేదన్నారు. సమాన అభివృద్ధి జరిగేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

**ఆరుహామీలను నెరవేర్చాల్సిందే :**

ఎన్నికల్లో ఇచ్చిన ఆరు హామీలను సిఎం రేవంత్ రెడ్డి నెరవేర్చాల్సిందేనని, లేదంటే గుణపాఠం తప్పదన్నారు. ఎన్నికల్లో హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక సిఎం రేవంత్‌రెడ్డి డబ్బులు లేవని, ఏం చేయాలని మాట్లాడడం సరైంది కాదన్నారు. ప్రజా సమస్యల సాధనకు సిపిఐ(ఎం) పోరాటం చేస్తుందని, ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు. విలేకరుల సమావేశంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శనావు, జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎం.చుక్కయ్య, బొట్ల చక్రపాణి, వీరన్న, రాగుల రమేష్, గొడుగు వెంకట్, భానునాయక్, కాడబోయిన లింగయ్య, డి.తిరుపతి, జి. రాములు పాల్గొన్నారు.

## ప్రపంచ అందాల పోటీల ఫైనల్‌కు కౌంట్‌డౌన్

31న జరిగే కార్యక్రమానికి హైటెక్స్‌లో ఏర్పాట్లు
ఫైనల్లో పోటీపడనున్న 40 మంది అందాల భామలు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 72వ మిస్ వరల్డ్ 2025 ఫైనల్ పోటీలకు కౌంట్ డౌన్ మొదలైంది. క్వార్టర్ ఫైనల్‌కు చేరిన 40మంది అందాల భామలు ఫైనల్లో ప్రపంచ సుందరి కిరీటం కోసం పోటీపడతారు. ఇప్పటివరకు స్పోర్ట్స్ ఛాలెంజ్‌లో ఒకరు, టాలెంట్ ఛాలెంజ్‌లో ఒకరు, హెడ్ టు హెడ్ ఛాలెంజ్‌లో నలుగురు, టాప్ మోడల్ పోటీల్లో నలుగురు, బ్యూటీవిత్ ఎపర్పస్ విభాగం నుంచి నలుగురు.. మొత్తం 14 మంది విజేతలై ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో క్వార్టర్స్‌కు చేరారు. మిగతా 26మందిని అమెరికా కరేబియన్, ఆఫ్రికా, యూరప్, ఆసియాఓషియానా ఖండాలవారీగా న్యాయనిర్ణేతలు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇండోనేషియా, వేల్స్ భామలు రెండు పోటీల్లో విజేతలుగా నిలిచారు. ఆ ప్రకారం టాప్ 40లో ఇప్పటివరకు 12 బెర్తులు మాత్రమే ఖరారయ్యాయి. అంటే ఇంకా 28 మందిని ఎంపిక చేయాల్సి ఉంటుంది.

టాప్ 40లో కూడా ఒక్కో ఖండం నుంచి పది మంది ఉండేలా ఎంపిక చేస్తారు. ఆ తర్వాతి రౌండ్లో వీరిలోంచి టాప్ 20ని తీసుకుంటారు. ఒక్కొక్క ఖండం నుంచి ఐదుగురు ఉంటారు. ఇక అంతిమ ఘట్టానికి ముందు టాప్ 8 అంటే ఒక్కో ఖండం నుంచి ఇద్దర్ని ఎంపిక చేస్తారు. ఆ తర్వాత ఒక్కో ఖండం నుంచి ఒక్కొక్కరే అంటే నలుగురు అంతిమంగా కిరీటం కోసం మిగులుతారు. వీరిలో ఒకరు విజేతగా, మిగిలిన ముగ్గురు ఒకటి, రెండు, మూడో రన్నరప్ నిలుస్తారు. హైదరాబాద్ హైటెక్స్‌లో కొత్తగా నిర్మించిన నాలుగో హాల్‌లో 31న జరిగే ఫైనల్ పోటీలకు ఏర్పాట్లు చేస్తున్నారు. సైబర్ పోలీసులు, ట్రాఫిక్ విభాగం, పర్యాటక శాఖ, నిర్వాహకులు ఈ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. హాల్ సామర్థ్యం 3,500 మంది కావడంతో అంతమంది అతిథులు వస్తారనే అంచనాతో ఏర్పాట్లు, భద్రతా చర్యలు చేపడుతున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఫైనల్ వేడుకలు సాయంత్రం నుంచే మొదలవుతాయి. తుది పోటీలు రాత్రి 10 నుంచి అర్ధరాత్రి వరకు జరగనున్నాయి.

# భారీగా పట్టుబడ్డ గంజాయి

వాహన తనిఖీలో 8 క్వింటాళ్ల 30 కేజీలు పట్టివేత
సుమారు రూ.4కోట్ల 15లక్షల విలువ ఉంటుందని అంచనా
9 మందిపై కేసు నమోదు
ప్రెస్ మీట్‌లో వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పి రోహిత్ రాజ్



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మండల పరిధి పడమట నర్సాపురంలో మంగళవారం నిర్వహించిన వాహన తనిఖీలో భారీగా నిషేధిత గంజాయి పట్టుబడినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు సిసిఎస్ పోలీసులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన వాహన తనిఖీలో హెచ్‌ఆర్ 55ఎ హెచ్ 7375 అను ఐసర్ వ్యాన్‌లో నాలుగు కోట్ల పదిహేను లక్షల విలువల గల, 8 క్వింటాళ్ల 30 కేజీల నిషేధిత గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు వ్యక్తులతో పాటు, అమ్మిన, కొనుగోలు చేసిన మొత్తం తొమ్మిది మంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను రిమాండ్ చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ నిషేధిత గంజాయిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, అల్లూరి సీతారామ రాజు జిల్లా, మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని తులసిపాక గ్రామం నుండి భద్రాచలం, కొత్తగూడెం, ఖమ్మం, హైదరాబాద్ మీదుగా ఢిల్లీకి తరలిస్తున్నట్లు విచారణలో తేలిందని అన్నారు. గంజాయి రవాణాకు ఉపయోగించిన ఐసర్ వ్యాన్‌తో పాటు, రెండు మొబైల్ ఫోన్‌లను సీజ్ చేసినట్టు తెలిపారు.

గంజాయి అక్రమ రవాణాను సమర్థవంతంగా అడ్డుకుని నిందితులను చాకచక్యంగా పట్టుకున్న జూలూరుపాడు సిఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ బి.రవి, సిసిఎస్ ఇన్స్పెక్టర్ రమాకాంత్, ఎస్ఐలు ప్రవీణ్, సిబ్బందిని ఎస్పీ రోహిత్ రాజ్ ప్రత్యేకంగా అభినందించారు. యువత ఈజీ మనీకి అలవాటుపడి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్. నం.9, చార్మినార్ జోన్
షార్ట్ టెండర్ నోటీసు నం. 13/EE.Div.No.9/GHMC/2025-26, తేదీ: 27.05.2025
NIT No. షార్ట్ టెండర్ నోటీసు నం. 13/EE/డివి.No.9/GHMC/24-25 తేదీ: 27.05.2025
పని వివరణ: నిర్వహణ పని (06) సంఖ్యలు, అంచనా మొత్తం: రూ. 80.90 లక్షలు, ప్రారంభ తేదీ/చివరి తేదీ మరియు బిడ్ల రసీదుల సమయం: ప్రారంభ తేదీ 28.05.2025, మధ్యాహ్నం 3 గం.లకు, చివరి తేదీ మరియు రసీదుల సమయం 31.05.2025 మధ్యాహ్నం 3 గం.లకు. పేరు మరియు చిరునామా అధికారి సెల్ నం: శ్రీ. జి.హరి కిషోర్, 9849906768.
Sd/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డివిజన్.9, CRZ, GHMC
DIPR R.O.No: 2694-PP/CL/ADVT/1/2025-26 Date: 28-05-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
NIT No. & Date 05/DB/EE/Alwal Circle/GHMC/2025-26, తేదీ. 28.05.2025
పని పేరు: సిసి రోడ్డు వేయడం, చైన్ లింక్ ఫెన్సింగ్ ఏర్పాటు, అంచనా మొత్తం: రూ. లక్షల్లో: 28.20, ప్రారంభ తేదీ మరియు సమయం: 30.05.2025 సాయంత్రం 4.30, బిడ్ రసీదులకు చివరి తేదీ మరియు సమయం: 06.06.2025 సాయంత్రం 4.30, ఇఇ పేరు మరియు చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అల్వాల్ సర్కిల్-27, జిహెచ్ఎంసి, మరిన్ని వివరాలను www.eprocurement.gov.in @ eprocurementలో చూడవచ్చు.
Sd/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అల్వాల్ సర్కిల్-27, జిహెచ్ఎంసి.
DIPR R.O.No: 2657-PP/CL/ADVT/1/2025-26 Date: 28-05-2025

**తెలంగాణ ప్రభుత్వ రోడ్లు మరియు భవనాల విభాగం**
ఇ-ప్రొక్యూర్మెంట్ నోటీసు
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆర్ అండ్ బి), తూర్పు భవనాల విభాగం, ఎర్రమంజిల్, హైదరాబాద్ కార్యాలయం
NIT NO. 01/AEE/DB/EBD/2025-26/e-proc/ తేదీ. 26.05.2025
పని పేరు: P/o డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్, హైదరాబాద్‌లోని వెస్ట్ అనుబంధ భవనం యొక్క కేటాయించిన ప్రాంతాలలో విజిలెన్స్ కమిషనర్ మరియు కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీలకు కొన్ని సివిల్ పనులను అందించడం. అంచనా మొత్తం: రూ.30,00,000/-, బిడ్ సమర్పణ ప్రారంభ తేదీ మరియు సమయం: 30.05.2025 మధ్యాహ్నం 2.30 గం.ల నుండి బిడ్ సమర్పణ ముగింపు తేదీ మరియు సమయం: 03.06.2025 మధ్యాహ్నం 2.30 వరకు, బిడ్ మూల్యాంకనం ప్రారంభ తేదీ మరియు సమయం: 03.06.2025 మధ్యాహ్నం 3 గం.ల తర్వాత మరిన్ని వివరాలను ‘ఈ-ప్రొక్యూర్మెంట్ మార్కెట్ ప్లేస్ www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
Sd/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) తూర్పు భవనాల విభాగం, హైదరాబాద్
DIPR R.O.No: 2679-PP/CL/ADVT/1/2025-26 Date: 28-05-2025

ప్రజాపక్షం
గురువారం, మే 29

# ఎంఎస్‌పికి చట్టబద్ధత ఎప్పుడు?

కేంద్ర ప్రభుత్వం 2025–26 ఖరీఫ్ సీజన్‌కు 14 పంటల కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)ను ఎంతోకొంత పెంచుతూ షరా మామూలు నిర్ణయం తీసుకుంది. స్థూలంగా చూస్తే, ఈ నిర్ణయం రైతులకు మేలు చేస్తుందని అనిపిస్తుంది. కానీ, ఎంఎస్‌పికి చట్టబద్ధత కల్పించే విషయంలో మోదీ సర్కారు దాటవేత ధోరణిలో మార్పులేకపోవడం దుర్మార్గం. ఢిల్లీ సరిహద్దుల్లో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలికి వణుకుతూ రైతులు సుమారు ఏడాదిపాటు కొనసాగించిన ఉద్యమానికి తలవంచిన ప్రభుత్వం, గత్యంతరం లేని పరిస్థితుల్లో మూడు వివాదాస్పద సాగు చట్టాలను రద్దు చేసింది. ఎంఎస్‌పికి చట్టబద్ధతసహా రైతులు చేసిన పలు డిమాండ్లను పరిష్కరించడానికి హామీ ఇచ్చింది. ఇది జరిగి సుమారు నాలుగేళ్లు కావస్తున్నా, ఇప్పటికీ అమలు కాలేదు. రైతుల డిమాండ్లలో ప్రధానమైన ఎంఎస్‌పికి చట్టబద్ధత అంశం ఎప్పుడు తెరపైకి వచ్చినా, మోదీ ప్రభుత్వం 'ఆ ఒక్కటీ అడక్కు' అన్న చందంగానే వ్యవహరిస్తున్నది. రైతులతో చర్చలు జరపడంలో, వారి సమస్యలను పరిష్కరించడంలో కేంద్రం విఫలమైందని సుప్రీం కోర్టు విమర్శించినప్పటికీ ఫలితం లేదంటే, రాజ్యాంగం పట్ల, వ్యవస్థల పట్ల పాలక బిజెపికి ఉన్న గౌరవం ఏపాటిదో స్పష్టమవుతోంది. నల్ల వ్యవసాయ చట్టాలను రద్దు చేసిన తర్వాత, 2021లో ఇచ్చిన వాగ్దానాల ఆధారంగా పంటలపై ఎంఎస్‌పికి చట్టపరమైన హామీని రైతాంగం ఆశించింది. కానీ, హామీని కేంద్రం అటకెక్కించింది. ఎప్పటికప్పుడు తాత్కాలిక ఉపశమనాలతో ముందుకు వెళుతున్నదే తప్ప, శాశ్వత పరిష్కారాన్ని చేపట్టడం లేదు. వ్యవసాయాన్ని కూడా కార్పొరేట్‌పరం చేయడమే బిజెపి సర్కారు లక్ష్యమని, అందుకే ఎంఎస్‌పిని నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నా స్పందన లేదు. వ్యవసాయం కంటే పారిశ్రామిక రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చే విధానాలను రైతులు నిరసిస్తూనే ఉన్నారు. మరోవైపు, రెండేళ్లలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ఘనంగా ప్రకటించి, మొదటిసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం, దశాబ్దకాలం గడచినా చేసింది శూన్యం. ఎంఎస్‌పికి చట్టబద్ధత లేకపోవడంతో, ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రకటించే పెంపు వల్ల ప్రధాన పంటలు పండించని ప్రాంతాల్లో రైతులకు లాభం చేకూరదు. ఉత్పత్తి వ్యయంపై 50 శాతం లాభ మార్జిన్ ఉండాలని స్వామినాథన్ కమిషన్ నివేదికలో చేసిన సూచనకు అర్థం లేదు. లాజిస్టికల్ సవాళ్లు, సేకరణకు అయ్యే అధిక ఖర్చును పేర్కొంటూ ఎంఎస్‌పికి చట్టబద్ధత సాధ్యం కాదన్నది మోదీ సర్కారు వాదన. ఇదే నిజమైతే, రైతులకు హామీ ఎందుకిచ్చినట్టు? వరి, రాగులు, పత్తి, నువ్వులు.. ఇలా వివిధ పంటలకు ఎంఎస్‌పిని పెంచడంతోనే రైతుల సమస్యలు తీరుతాయా? వారి ఉద్యమానికి, సుమారు వేయిమంది రైతుల ప్రాణత్యాగానికి న్యాయం జరుగుతుందా? ఎంఎస్‌పికి చట్టబద్ధత కల్పించడానికి కేంద్ర బూచిగా చూపిస్తున్న ఆహార ద్రవ్యోల్బణం, బడ్జెట్ పరిమితులు సాకులు మాత్రమే. నిజంగానే రైతులకు న్యాయం చేయాలంటే, ఎంఎస్‌పిసహా రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలి. అప్పుడే, లాభం ఎలావున్నా, నష్టాల ఊబిలో చిక్కుకోరు. ఎప్పటికప్పుడు మారిపోతున్న మార్కెట్ ధరకంటే.. నిర్దిష్ట కనీస ధర ఉంటే, రైతు భవిష్యత్తును ఊహించగలుగుతాడు. వ్యవసాయంలో పెట్టుబడులకు ప్రోత్సాహం లభిస్తుంది. మార్కెట్‌లో ధరలు పడిపోతే, కొనుగోలు చేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. రైతులకు అంతర్గత రక్షణ లభిస్తుంది. ఖర్చులు తిరిగి వస్తాయన్న నమ్మకం కలుగుతుంది. అంతర్జాతీయ మార్కెట్ ఒడిదుడుకులతో సంబంధం ఉండదు. మధ్యవర్తుల బెడద తగ్గుతుంది. కోవిడ్ తర్వాత తలెత్తిన పరిణామాల నేపథ్యంలో, అస్థిరమైన ఆదాయం ఎంతోమంది రైతులను నష్టాలపాల్జేస్తున్నది. ఆత్మహత్యలకు పురిగొల్పుతున్నది. ఎంఎస్‌పికి చట్టబద్ధత వల్ల ఆ సమస్యకు కొంతలో కొంతైనా పరిష్కారం లభిస్తుంది. కష్టపడి పండించిన పంటకు, తగిన ప్రతిఫలం పొందే హక్కు రైతుకు ఉంటుంది. కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేయడం అనేది రైతుల సురక్షిత భవిష్యత్తుకు పెట్టిన తొలి మెట్టు. ఇది కేవలం ధర స్థిరీకరణకే కాదు, రైతు జీవన ప్రమాణాల అభివృద్ధికి, వ్యవసాయ రంగ సమగ్ర వికాసానికీ ఆధారం అవుతుంది కూడా. రైతు కేవలం ముడిసరుకు ఉత్పత్తి చేసే యంత్రం కాదనే విషయాన్ని మోదీ సర్కారు తెలుసుకోవాలి. అతని శ్రమను గుర్తించాలి... గౌరవించాలి. న్యాయమైన మద్దతు ధర ఇవ్వాలి. మార్కెట్ ఒడిదొడుకులనుంచి రైతులకు రక్షణ కల్పించటానికి ఎంఎస్‌పికి చట్టబద్ధత అత్యవసరం.

## రష్యా, ఇరాన్‌ను దూరం చేసేందుకు

# సిరియాతో అమెరికా మైత్రి

అసద్ మీర్జా

అమెరికా విదేశాంగ విధానంలో గణనీయమైన మార్పును సూచిస్తూ ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సిరియాపై దీర్ఘకాలంగా ఉన్న ఆంక్షలను సడలిస్తున్నట్లు ప్రకటించారు. ఇది యుద్ధంతో దెబ్బతిన్న ఆ దేశానికి , విస్తృత మధ్య ప్రాచ్యానికి ఒక కీలకమైన మలుపు. ఈ నిర్ణయం అధ్యక్షుడు మధ్య ప్రాచ్య పర్యటన, పట్టపు యువ రాజు మహమ్మద్ బిన్ సల్మాన్‌తో చర్చల సమయంలో వెలువడింది.

సౌదీ క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ (ఎంబిఎస్) చొరవ మేరకు సిరియా తాత్కాలిక అధ్యక్షుడు అహ్మద్ అల్–షరా (గతంలో అబు మొహమ్మద్ అల్–గోలానీగా సుపరిచితుడు), అధ్యక్షుడు ట్రంప్ మధ్య జరిగిన సమావేశం జరిగినట్లు భావిస్తున్నారు. దీని తరువాత ట్రంప్ సిరియాపై ఆర్థిక ఆంక్షలను తొలగించినట్లు అకస్మాత్తుగా ప్రకటించారు. ఇది ఈ ప్రాంతంలో స్థిరత్వం, ఆర్థిక పునరుద్ధరణను పెంపొందించడానికి ఒక వాస్తవిక విధానాన్ని ప్రతిబింబిస్తుంది.

ఇది ఊహించన విధంగా జరిగినప్పటికీ, ఈ ఆంక్షలను అమెరికా స్వయంగా 1979లో విధించింది. అప్పుడు అది హిజ్బుల్లా వంటి సమూహాలకు మద్దతునివ్వడం, లెబనాన్‌లో దాని సైనిక కార్యకలాపాలను పేర్కొంటూ సిరియాను 'తీవ్రవాదాన్ని పోషించే దేశం'గా ప్రకటించింది.

2004లో సిరియా జవాబుదారీతనం, లెబనీస్ సార్వభౌమాధికార పునరుద్ధరణ చట్టం కింద తదుపరి ఆంక్షలు విధించబడ్డాయి. ఇవి సిరియా సామూహిక విధ్వంస ఆయుధాలను తయారు చేస్తున్నదని, పొరుగున ఉన్న ఇరాక్‌లో జోక్యం చేసుకుంటున్నదనే ఆరోపణలతో సిరియాను లక్ష్యంగా చేసుకున్నాయి. అత్యంత కఠినమైన చర్యలు 2011లో వచ్చాయి. అసద్ పాలన శాంతియుత నిరసనకారులపై క్రూరమైన అణచివేతకు ప్రతిస్పందనగా 2019 నాటి సీజర్ సిరియా పౌర రక్షణ చట్టానికి దారితీసింది. ఇది యుద్ధ నేరాలకు ప్రభుత్వాన్ని జవాబుదారీగా ఉంచాలని లక్ష్యంగా పెట్టుకుంది.

తాజా ఆంక్షల సడలింపు సిరియా, దాని కొత్త నాయకుడికి దేశాన్ని పునర్నిర్మించడానికి, అంతర్జాతీయ సమాజంలో తిరిగి కలిసిపోవడానికి ఒక మార్గాన్ని అందించవచ్చు. బషర్ అల్–అసద్ పాలన 2024 డిసెంబర్‌లో పతనమైన తరువాత సిరియా ఒక కొత్త శకాన్ని ప్రారంభించింది. అహ్మద్ అల్–షరా గత సంబంధాలపై ఆందోళనలు వ్యక్తమైనప్పటికీ, ఆయన తన మిలిటెంట్ గతాన్ని దూరం చేసుకోవడానికి, సిరియాను పునర్నిర్మించడానికి కట్టుబడి ఉన్న ఒక రాజనీతిజ్ఞుడిగా తనను తాను ప్రదర్శించుకోవడానికి గట్టి ప్రయత్నాలు చేశాడు. ఆయన మొదటి దౌత్యపరమైన ప్రయత్నం సౌదీ అరేబియాకు, అయన భార్యతో కలిసి మక్కా సందర్శనకు వెళ్ళడం ద్వారా జరిగింది. ఈ పర్యటన ఇరాన్‌కు వ్యతిరేకంగా, అరబ్‌లతో చేతులు కలిపేందుకు సిరియా ఆకాంక్షకు, మరింత ఉదార రూపంలో ఇస్లాంను, పాలనను అందించాలనే ఆకాంక్షకు సంకేతాలిచ్చింది.

నేడు ప్రపంచ దేశాల దృష్టి సిరియాపై ఉండడానికి వేల సంవత్సరాలుగా దాని వ్యూహాత్మక స్థానమే కారణం. సిరియా ప్రభుత్వాన్ని నియంత్రించడానికి జరిగే పోటీ ఫలితం ఆధారంగా రాబోయే సంవత్సరాలలో లెవాంట్ , విశాల మధ్య ప్రాచ్యంలో ఆవిర్భవిస్తున్న రాజకీయ ధోరణులు ఉంటాయి. సిరియాకు ఉన్న ప్రత్యేక స్థానం, స్థితి దృష్ట్యా ఆ దేశంపై అధికారం, ప్రభావం కోసం దేశీయ, ప్రాంతీయ, ప్రపంచ శక్తులు పోటీ పడుతున్నాయి. సిరియా వారసత్వంగా అరుదైన సంపూర్ణ, సంభవాత్మక అరబ్ దేశం. దాని మానవ, సహజ వనరులు, వ్యూహాత్మక భౌగోళిక ప్రాంతంతో పాటు మధ్యప్రాచ్యం , ప్రపంచంతో రాజకీయ, సాంస్కృతిక, జాతి సంబంధాలు అన్నీ ఇందుకు కారణాలు.

అర్ధ శతాబ్దం నిరంకుశ పాలన, 13 సంవత్సరాల యుద్ధం తర్వాత నేడు సిరియా శిథిలావస్థలో ఉన్నప్పటికీ, వందలాది మంది దౌత్యవేత్తలు, వ్యాపారవేత్తలు, పౌర కార్యకర్తలు, అవకాశవాదులకు ఆతిథ్యం ఇస్తుంది. ఇది కొత్తేమీ కాదు. క్రీస్తుపూర్వం మూడవ సహస్రాబ్దిలో డమాస్కస్, అలెప్పో ఉత్పాదక, శక్తివంతమైన, వ్యూహాత్మక పట్టణ కేంద్రాలుగా ఆవిర్భవించినప్పటి నుండి గడిచిన 5,000 సంవత్సరాలుగా సిరియా ప్రపంచానికి తన వంతు సహకారాన్ని అందిస్తోంది. చారిత్రాత్మకంగా సిరియా నేల, అక్కడి ప్రజలు నిరంతరం జ్ఞానం, విలువలతో కూడిన వ్యవస్థలు సృష్టించారు. ఆహారం, సంపద, సంస్కృతి, సాంకేతికత, అస్థిత్వాలను సృష్టించడం ద్వారా వారి భూమిని ఒక వ్యూహాత్మక, ఆకాంక్షల ప్రపంచ కూడలిగా మార్చారు.


ఫైసల్ జె అబ్బాస్ అరబ్ న్యూస్‌లో రాసిన వ్యాసంలో చాలా సముచితంగా అభిప్రాయపడినట్లుగా, వాస్తవానికి, ఆంక్షలను సడలించడానికి అమెరికా నిర్ణయం గత చర్యలకు ఆమోదంగా చూడకూడదు. అది వేగంగా మారుతున్న చలనశీలతకు గుర్తింపు. అమెరికా, సౌదీ అరేబియా, ఇతర మధ్యప్రాచ్య దేశాలు సిరియాను పునర్నిర్మించడంలో సహాయపడటం, ఫలితంగా ఆ దేశాల ప్రభావ పరిధిని విస్తరించగల భవిష్యత్తుపై ఒక పందెం. ఈ దాతృత్వం వెనుక ఉన్న ప్రధాన కారణం సిరియాను దాని పాత మిత్రదేశాలు అంటే రష్యా, ఇరాన్ నుండి దూరంగా ఉంచడం.

అసద్ పాలన అణచివేత విధానాలు, ఆ ప్రాంతంలో అస్థిరపరిచే దాని పాత్రకు వ్యతిరేకంగా పశ్చిమ ఆంక్షలు ప్రధానంగా ఉద్దేశించాయి. ఆ పాలన పతనంతో ఆ ఆంక్షలను కొనసాగించడమంటే సిరియా ప్రజల శాంతి, శ్రేయస్సు ఆకాంక్షలను అడ్డుకోవడమే అవుతుంది.

అంతేకాకుండా, అల్–షరా ఒక సమ్మిళిత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి, మైనారిటీ హక్కులను గౌరవించడానికి, ప్రాంతీయ స్థిరత్వానికి అవకాశం కల్పించే విధంగా విశాల లక్ష్యం అనే ఆకాంక్షతో పునర్నిర్మాణ ప్రయత్నాలపై దృష్టి పెట్టడానికి కట్టుబడినట్లు చాటుకున్నాడు.

ఏళ్ళ తరబడి సంఘర్షణ, ఆంక్షలతో సిరియా ఆర్థిక వ్యవస్థ ధ్వంసమైంది. 90 శాతం మంది ప్రజలు పేదరికంలో జీవిస్తున్నారు. ఆంక్షలు ఎత్తివేయడం అంతర్జాతీయ పెట్టుబడులు, సహాయం, కీలక మౌలిక సదుపాయాల పునర్నిర్మాణానికి తలుపులు తెరుస్తుంది.

అరబ్ దేశాలతో నూతన పాలకుడు అల్–షరా చేసిన మైత్రి, ఇరాన్, రష్యా వంటి పూర్వ మిత్రదేశాల నుండి సిరియాను దూరం చేయడానికి చేసిన ప్రయత్నాలు,అమెరికా వ్యూహాత్మక ప్రయోజనాలకు దోహదపడే పునఃమార్పులకు అవకాశాలను సూచిస్తున్నాయి. అయితే, సిరియాపై ఆంక్షల సడలింపు అనేది ఒక సంక్లిష్ట పరిస్థితికి వాస్తవిక వైఖరిని సూచిస్తున్నదనేది ఒక కచ్చితమైన వాస్తవం. ఇది సిరియా రాజకీయ రంగంలో సంభవించిన పరివర్తనాత్మక మార్పుల ను గుర్తించింది. దేశం పునర్నిర్మించడానికి, అంతర్జాతీయ సమాజంలో తిరిగి కలిసిపోవడానికి ఒక మార్గాన్ని అందిస్తుంది. సంఘర్షణ, ఆర్థిక నిరాశ లేని భవిష్యత్తుపై సిరియా ప్రజలకు ఇది ఆశను కలిగిస్తుంది. ఈ ప్రాంతానికి, ప్రపంచానికి, స్థిరత్వాన్ని పెంపొందించడానికి,తీవ్రవాద ప్రభావాలను ఎదుర్కోవడానికి ఇది ఒక అవకాశాన్ని అందిస్తుంది.




**అరబ్ దేశాలతో నూతన పాలకుడు అల్–షరా చేసిన మైత్రి, ఇరాన్, రష్యా వంటి పూర్వ మిత్రదేశాల నుండి సిరియాను దూరం చేయడానికి చేసిన ప్రయత్నాలు, అమెరికా వ్యూహాత్మక ప్రయోజనాలకు దోహదపడే పునఃమార్పులకు అవకాశాలను సూచిస్తున్నాయి. అయితే, సిరియాపై ఆంక్షల సడలింపు అనేది ఒక సంక్లిష్ట పరిస్థితికి వాస్తవిక వైఖరిని సూచిస్తున్నదనేది ఒక కచ్చితమైన వాస్తవం.**

# జూన్ 2 పై ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆశలు

తెలంగాణ అవతరణ దినోత్సవం జూన్ రెండో తేదీన ఉద్యోగ, ఉపాధ్యాయులకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి వరాలు కురిపిస్తారనే ఆశతో ఎదురు చూస్తున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు అయిదు డి.ఎ లు పెండింగ్‌లో ఉన్నాయి. పిఆర్‌సి గడువు ముగిసి సంవత్సరం ఆరు నెలలు గడిచింది. ఎంతోకాలంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు, పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు నగదు రహిత ఆరోగ్య కార్డులను మంజూరు చేయాలని కోరుతుంటే అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తూ వస్తున్నారు. తెలంగాణ అవతరణ దినోత్సవం నాడు నగదు రహిత ఆరోగ్య కార్డులను మంజూరు చేస్తారని, డి.ఏలను మంజూరు చేస్తారనే ప్రచారం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఉద్యో గ, ఉపాధ్యాయులు ఏ ఇద్దరు కలిసిన డి.ఏల గురించి, నగదు రహిత ఆరోగ్య కార్డుల గురించి మాట్లాడుకోవడం కనిపిస్తుంది.



ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంకోసం రాష్ట్ర ప్రభుత్వం మంత్రి వర్గ సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో, ప్రతి నిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి ముఖ్యమైన 57 సమస్యలపై చర్చలు జరిపింది. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో, శాసన మండలి సభ్యులతో (ఎం.ఎల్.సి ) లతో చర్చించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సమస్యలన్నింటికీ పరిష్కారం లభిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

మంత్రివర్గ ఉపసంఘం హామీ ఇవ్వడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉద్యమాలు, పోరాటాలు చేయాలనుకున్న వారు వాయిదా వేసుకున్నారు. జూన్ రెండో తేదీన ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీపి కబురు వస్తుందని ఆశతో వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం 2004 సెప్టెంబర్ 1 నుంచి కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను అమలుచేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెన్షన్ సౌకర్యం లేకుండా చేసింది. పెన్షన్ ఉంటే పదవీ విరమణ చేసిన తర్వాత వృద్ధాప్యంలో టెన్షన్ ఉండదని ఉద్యోగ, ఉపాధ్యాయులు కేంద్ర, రాష్ట్ర మంత్రులను కలిసి అనేక సార్లు వినతి పత్రాలను సమర్పించారు.

ఎన్నికలకు ముందు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే సి.పి.ఎస్ రద్దు చేసి పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ అమలుకోసం ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆశతో ఎదురు చూస్తున్నారు.

తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు వేసవిలో చేసేటట్లు మార్గదర్శకాలు జారీ చేయాలని తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

గత ప్రభుత్వంలో కోర్టు కేసులతో పెండింగులో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులు రేవంత్ సర్కార్ పరిష్కరించి భాషోపాధ్యాయులకు, పిఇటిలకు, స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు కల్పించింది. పదోన్నతులు కల్పించిన ప్రభుత్వం కౌన్సెలింగ్ ద్వారా కొత్త పాఠశాలలు కేటాయించింది. ఈ వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీలలో జీరో సర్వీస్ కింద పరిగణిం చి పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. గత ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని పది జిల్లాలను ముప్పై మూడు జిల్లాలుగా ఏర్పాటుచేసి జిఒ 317 తెచ్చి ఉద్యోగ, ఉపాధ్యాయులను దూరదూర ప్రాంతాలకు బదిలీ చేసింది. అనేకమంది ఉద్యోగ, ఉపాధ్యాయులు స్థానిక జిల్లాలను వదిలి వేరే జిల్లాల్లో ఉద్యోగాలు చేయాల్సి వస్తుంది. స్థానికులను స్థానికేతరులుగా మార్చిన జీ.వో 317 రద్దు చేయాలని హైకోర్టును అనేక మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆశ్రయిస్తే మానవత దృక్పథంతో పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. మానవతా దృక్పథంతో జిఒ 317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యయలను వారి స్వంత జిల్లాలకు బదిలీ చేయాలని కోరుతున్నారు.

డాక్టర్. ఎస్.విజయ భాస్కర్,
9290826988

# మానసిక వైకల్య బాధితులకు ఆర్‌టిసి ఉచిత ప్రయాణం కల్పించాలి

లేఖ

భారత పార్లమెంట్ ద్వారా ప్రజల హక్కులను కాపాడటానికి చట్టాలు రూపొందించబడినవి. వీటిలో కార్మికులు స్త్రీలు, బాలలు, వృద్ధులకు ప్రత్యేక హక్కులు కల్పించబడినవి. వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం సమాన హక్కులు, సమాన అవకాశాలు, గౌరవం, వివక్షత నిరోధించడానికి 'వికలాంగుల హక్కుల చట్టం–2016ను పార్లమెంట్ ఆమోదించగా 19, ఏప్రిల్ 2017 అమలులోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం అంధత్వం, దృష్టి లోపం, కుష్టు, వినికిడి లోపం, చలనం లేని వైకల్యం, మానసిక వైకల్యం, మానసిక అనారోగ్యం లాంటి లోపాలు గుర్తించబడినవి. ఈ లాంటి లోపాలు ఉన్న వ్యక్తులకు ప్రభుత్వాలు, ప్రభుత్వ సంస్థలు వారికి సమాజంలో ప్రత్యేక గుర్తింపు కల్పించే బాధ్యత కలదు. 2014 సంవత్సర ఒక నివేదిక ప్రకారం తెలంగాణ రాష్ట్ర జనాభాలో 12.2% వికలాంగుల సంఖ్య ఉందని ఒక అంచనా. వికలాంగులు మానసికంగా కృంగిపోకుండా వారి మనో వికాసం కొరకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక పునరావాసం కొరకు పింఛన్, ఇతరులపై ఆధార పడకుండా ఉన్నత విద్యలో రిజర్వేషన్లు, రైలు, బస్సులలో ప్రత్యేక రాయితీలు, బ్యాంక్, పోస్ట్ ఆఫీసులు నందు ప్రత్యేక క్యూ లైన్ వసతి కల్పించింది.వికలాంగులు అనగానే ప్రజల మనస్సులో తళుక్కున మెరిసేవారు అంధులు, బధిరులు మాత్రమే. పుట్టుకతో కొంతమంది మానసికంగా శారీరక ఎదుగుదల లేనివారు సమాజం, కుటుంబంలో ఆదరణ లేక ఇతరులకు చెప్పుకోలేని స్థితిలో జీవిస్తున్నారు. ఇలాంటి వారిని ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థలు గుర్తించి వారికి అవకాశాలు కల్పిస్తున్నాయి. మానసిక వికలాంగులలో మానసిక వైఫల్యం, మానసిక అనారోగ్యం అనే రెండు రకాలు. వీటిలో మానసిక వైఫల్యం పుట్టుకతో వచ్చేది. రెండవది వారు జీవించే స్థితిలో ఉంది. నేడు ఎక్కువగా మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నారు. చదువుల కొరకు తల్లిదండ్రులు, విద్యాసంస్థల ఒత్తిడి, ప్రేమ వైఫల్యం, నిరుద్యోగం, పేదరికం, ఐ.టి రంగాల్లో పనిభారం, మాదక ద్రవ్యాల సేవనం, రోడ్డు, రైలు ప్రమాదాల వలన కూడా మానసిక అనారోగ్యం పాలై ఎటువంటి గుర్తింపు, ఆదరణ లేక జీవచ్ఛవాలుగా జీవిస్తున్నారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఎటువంటి సౌకర్యాలు లభించుట లేదు. రైల్వేలలో అన్ని రకాల వికలాంగులతో పాటు వారి అనుచరులకు కూడా రాయితీలు కల్పిస్తున్నారు.

తెలంగాణా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సులలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, విద్యార్థుల కు వికలాంగులకు, విలేకరులకు, బస్‌పాసులు ఇస్తూ రాయితీలు ఇస్తుంది. నగరాల్లో ఉన్న మానసిక వ్యాధి నిపుణుల వద్దకు మానసిక రోగులు చికిత్స కొరకు రావడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. వీరి ప్రయాణ నిమి త్తం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సుల్లో పాసులు, రాయితీలు లేవు. పార్లమెంట్ ఆమోదించిన వికలాంగుల చట్టం–2016 ప్రకారం మానసిక అనారోగ్యంతో బాధపడే వారికి రాయితీలు ఇవ్వాలి.

పార్లమెంట్‌లో ఆమోదించిన చట్టాలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఖచ్చితంగా అమలు పరచాలి. కావున తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నడిపే బస్సులలో మానసిక వైకల్యం గల వారితో పాటు మానసి క అనారోగ్యంతో బాధపడే వారికి కూడా ప్రత్యేక పాసులు, రాయితీలు వారిని ఆదుకోవాలి.

ఎ.వి. మాధవ్ 8686051752,

# రాజస్థాన్ కోటలో ఎందుకీ ఆత్మహత్యలు!

రాజస్థాన్ నడిబొడ్డున ఉన్న కోట నగరం దశాబ్దాలుగా లక్షలాది యువత ఆశయాలకు నిలయంగా మారింది. భారతదేశ 'కోచింగ్ రాజధాని'గా పేరొందిన ఇది ఐఐటి, ఎయిమ్స్ వంటి అత్యంత ప్రతిష్టాత్మక ఇంజనీరింగ్ మెడికల్ కళాశాలల్లో ప్రవేశానికి సువర్ణ మార్గం అందిస్తుందని వాగ్దానం చేస్తుంది. అయితే ఈ విద్యాపరమైన ఆశల వెనుక భయంకరమైన వాస్తవం ఉంది. ఇక్కడ విద్యార్థుల ఆత్మహత్యల నిరంతర ప్రవాహంగా మారింది. 2023లో నగరంలో 26 విద్యార్థి ఆత్మహత్యలు, 2025లో ఇప్పటికే 14 ఆత్మహత్యలు నమోదయ్యాయి. ఈ భయంకర సంఖ్య జాతీయ స్థాయిలో ఆందోళన రేకెత్తించి, భారత సుప్రీంకోర్టు నుండి తీవ్ర విమర్శలకు దారితీసింది.

మే 23, 2025న, భారత సుప్రీంకోర్టు కోటలో విద్యార్థుల ఆత్మహత్యల ఆందోళనకర పెరుగుదలపై రాజస్థాన్ ప్రభుత్వాన్ని తీవ్ర ఆందోళనతో ప్రశ్నించింది. 'ఈ పిల్లలు ఎందుకు చనిపోతున్నారు? ఈ పిల్లలు ఎందుకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు? కోటలో మాత్రమే ఎందుకు? మీరు దీని గురించి ఆలోచించలేదా?'వంటి అనేక బాణాలను సంధించింది.

**కోట ప్రత్యేక ఆకర్షణ, ఆశయాల కేంద్రం:**

'కోచింగ్ రాజధాని'గా కోట అనే ప్రత్యేక గుర్తింపు ఐఐటి, ఎయిమ్స్ వంటి దేశంలోని అత్యంత ప్రతిష్టాత్మ క ప్రవేశ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడంపై దాని ఏకైక దృష్టి నుండి ఉద్భవించింది. సంప్రదాయ పాఠశాలలకు భిన్నం గా ఈ కేంద్రాలు ఈ నిర్దిష్ట పరీక్షలను ఛేదించడానికి రూపొందించబడిన అత్యంత ప్రత్యేకమైన, తీవ్రమైన శిక్షణను అందిస్తాయి. కోచింగ్ కేంద్రంగా కోట దృగ్విషయం 1980ల చివరలో 1990ల ప్రారంభంలో మొదలైంది. మాజీ ఇంజనీర్ వి.కె. బన్సల్‌ను కోట కోచింగ్ పరిశ్రమ పితామహుడిగా పరిగణిస్తారు. ఆయన విజయం బన్సల్ క్లాసెస్ స్థాపనకు దారితీసింది. ఇది ఇతరులకు నమూనాగా మారింది. అలెన్ కెరీర్ ఇన్‌స్టిట్యూట్, రెజొనెన్స్, వైబ్రెంట్ అకాడమీ, కెరీర్ పాయింట్ వంటి ఇతర ప్రముఖ సంస్థల విజయాలు తల్లిదండ్రులను ఆకర్షించాయి. మెట్రో నగరాలతో పోలిస్తే నగరంలోని ప్రశాంతమైన వాతావరణం, తక్కువ జీవన వ్యయం, తక్కువ అంతరాయాలు ప్రారంభంలో దాని ఆకర్షణకు దోహదపడ్డాయి.

**ఒత్తిడికి నిలయం–కోచింగ్ కేంద్రాలు సౌకర్యాలు**

ఇటీవలి నివేదికల ప్రకారం, కోటలో 250కి పైగా నమోదిత కోచింగ్ సంస్థలు ఉన్నాయి. నమోదుకాని లేదా చిన్న కేంద్రాల సంఖ్య గణనీయంగా ఉంటుందని నమ్ముతారు. అగ్రశ్రేణి కోచింగ్ కేంద్రాలు, ఆధునిక తరగతి గదులు, గ్రంథాలయాలు, కొన్నిసార్లు హాస్టల్ సౌకర్యాలు అందిస్తున్నప్పటికీ, చాలామంది విద్యార్థులు ప్రైవేట్ హాస్టళ్లలో లేదా పేయింగ్ గెస్ట్ వసతులలో నివసిస్తున్నారు.

**విద్యార్థుల్లో ఒత్తిడి కారణాలు:** కోట విద్యార్థులపై ఉన్న తీవ్ర ఒత్తిడి బహుముఖంగా ఉంటుంది. రోజుకు 12–18 గంటల తీవ్రమైన అధ్యయన షెడ్యూల్స్, వారపు పరీక్షలు, నిరంతర ర్యాంకింగ్, నిరంతర పోటీ, పనితీరు ఆందోళన వాతావరణాన్ని సృష్టిస్తాయి. మధ్యతరగతి కుటుంబాల నుండి వచ్చిన విద్యార్థులు కోట కోచింగ్‌లో తమ జీవితకాల పొదుపును పెట్టుబడిగా పెడతారు. వారి పిల్లలు విజయం సాధించి ఆర్థిక త్యాగాన్ని సమర్థించుకోవాలని అపారమైన ఒత్తిడి ఉంటుంది. ఇంజనీరింగ్, మెడిసిన్ భారతదేశంలో ఏకైక 'విజయవంతమైన' వృత్తి మార్గాలుగా పరిగణించ బడతాయి.

**ఇప్పటివరకు తీసుకున్న చర్యలు:**

సంక్షోభానికి ప్రతిస్పందనగా, రాజస్థాన్ ప్రభుత్వం కోచింగ్ సంస్థలు వివిధ చర్యలను అమలు చేశాయి. కోచింగ్ కేంద్రాలకు కొత్త మార్గదర్శకాలు జారీ చేయబడ్డాయి. వీటిలో తప్పనిసరి వారపు సెలవులు, పరీక్షల సమయ నియంత్రణ, పనితీరు ఆధారంగా విద్యార్థులను విభజించకపోవడం, తప్పనిసరి మానసిక కౌన్సెలింగ్, 120 రోజులలోపు సులభంగా నిష్క్రమించే రీఫండ్ విధానాలు ఉన్నాయి. మానసిక ఆరోగ్య మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి, కోచింగ్ కేంద్రాలలో వృత్తిపరమైన మానసిక వైద్యులు, కౌన్సెలర్లను తప్పనిసరిగా నియమిస్తున్నారు. మహిళా విద్యార్థుల భద్రత కోసం పోలీసుల 'కాలికా స్క్వాడ్' కూడా పనిచేస్తుంది. ప్రభుత్వ చట్టంపరంగా, రాజస్థాన్ కోచింగ్ సెంటర్ల (నియంత్రణ) బిల్లు 2025 ఈ రంగాన్ని నియంత్రించడం, వాణిజ్యీకరణను అరికట్టడం, నమోదును తప్పనిసరి చేయడం, నిబంధనలను పాటించని వారికి జరిమానాలు విధించడం లక్ష్యంగా పెట్టుకుంది. జిల్లా యంత్రాంగం ద్వారా 'కలెక్టర్‌తో డిన్నర్', 'సంవాద్' వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ చర్యలు ప్రశంసనీయం అయినప్పటికీ, చాలామంది విమర్శకులు అవి ఎక్కువగా ప్రతిస్పందన 'తాత్కాలిక పరిష్కారం' అని వాదిస్తున్నారు. అవి తీవ్రమైన పోటీ, అవాస్తవ అంచనాలు, ఒత్తిడిని నడిపించే వాణిజ్యీకరణ వంటి ప్రాథమిక వ్యవస్థాగత సమస్యలను పరిష్కరించవు.

**ముందుకు వెళ్లే మార్గం:** కోటలో ఆత్మహత్యలను నిరోధించడానికి అన్ని వాటాదారుల భాగస్వామ్యంతో బహుముఖ, సానుభూతితో కూడిన నిరంతర విధానం అవసరం. వ్యవస్థాగత విద్యా సంస్కరణలు చేపట్టాలి. ఇందులో జెఈఈ, నీట్ వంటివాటి ఏకైక దృష్టిని తగ్గించడం, వృత్తి శిక్షణ, నైపుణ్య ఆధారిత విద్య, చిన్న వయస్సు నుండే ప్రత్యామ్నాయ వృత్తి మార్గాలను ప్రోత్సహించడం వంటివి ఉంటాయి. బట్టీ పట్టడం కాకుండా సామాజికభావోద్వేగ అభ్యాసం, విమర్శనాత్మక ఆలోచన, జీవిత నైపుణ్యాలను పాఠ్యప్రణాళికలో చేర్చడం ద్వారా సమగ్ర అభ్యాసాన్ని ప్రోత్సహించాలి. పరీక్షా నిర్మాణాలను, గ్రేడింగ్ విధానాలను తిరిగి మూల్యాంకనం చేసి విద్యార్థులపై భారాన్ని తగ్గించాలి. తల్లిదండ్రులు, సమాజం ఆలోచనలను మార్చడం అత్యవసరం.








పటిష్టమైన మానసిక ఆరోగ్య మౌలిక సదుపాయాలు అవగాహన కల్పించాలి. తగినంత సంఖ్యలో అర్హత కలిగిన మనస్తత్వవేత్తలు, మనోరోగ వైద్యులు, కౌన్సెలర్లు విద్యార్థులందరికీ సులభంగా అందుబాటులో ఉండేలా చూడాలి. కోచింగ్ సంస్థలకు కఠిన నిబంధనలు జవాబుదారీతనం అవసరం. ప్రస్తుత కొత్త మార్గదర్శకాలను కఠినంగా అమలు చేయాలి, నిబంధనలను పాటించని వారికి గణనీయమైన జరిమానాలు విధించాలి. హామీతో కూడిన విజయాన్ని వాగ్దానం చేసే తప్పుదారి పట్టించే ప్రకటనలను నిషేధించాలి. తమకు సరిపోరని భావించే విద్యార్థులకు సులభమైన నిష్క్రమణ ఎంపికలు, పూర్తి, సకాలంలో రీఫండ్లను నిర్ధారించాలి.

విద్యార్థులు ఒత్తిడిని తగ్గించుకోవడానికి సమతుల్య జీవితాన్ని నిర్వహించడానికి క్రీడలు, కళలు ఇతర పాఠ్యేతర కార్యకలాపాలకు తగిన స్థలాలను అవకాశాలను అందించాలి. విద్యార్థులందరికీ ప్రామాణికమైన, సాధారణ, గోప్యమైన మానసిక ఆరోగ్య చెక్‌ఇన్‌లను అమలు చేయాలి.

తెలుగు రాష్ట్రాల్లో పోటాపోటీ ప్రైవేటు విద్యావ్యవస్థ సైతం తల్లిదండ్రుల ఆశలు సొమ్ముచేసుకుంటున్నది, విద్యార్థులను 'బందిఖానా'ల్లో ఉంచి ఒత్తిడి పెంచుతున్నాయి. అరుదుగానైనా ఆత్మహత్యల వార్తలు వింటున్నాం. కోటలాంటి పరిస్థితులు ఉత్పన్నం కాకమునుపే రాష్ట్ర ప్రభుత్వాలు ముందుగా చర్యలు తీసుకోవటం అవసరం. సం॥

జనక మోహన రావు దుంగ
8247045230



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ప్రొఫెసర్ అలీఖాన్ తాత్కాలిక బెయిలు పొడిగింపు

**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్‌పై సోషల్ మీడియా పోస్టులో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన అశోకా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ అలీ ఖాన్ మహమూద్ తాత్కాలిక బెయిలును సుప్రీంకోర్టు బుధవారంనాడు పొడిగించింది. సిట్ తన దర్యాప్తు నివేదికను సమర్పించాలని ఈ అశంపై విచారణ సందర్భంగా బెంచ్ ఆదేశించింది. ప్రొఫెసర్ అలీఖాన్ భావ ప్రకటనా స్వేచ్ఛ, ప్రసంగంపై ఎలాంటి ఆంక్షలు లేవని, అయితే కేసు నమోదైనందున ఇందుకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఎలాంటి పోస్టులు చేయరాదని స్పష్టం చేసింది. జాతీయ మానవ హక్కుల సంఘానికి కూడా కేసు గురించి చెప్పాలని హర్యానా పోలీసులను సుప్రీం కోర్టు సూచించింది. కాగా, ప్రొఫెసర్ అలీఖాన్‌పై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు కావడంతో ఈ వ్యవహారంపై దర్యాప్తునకు సిట్‌ను హర్యానా డిజిపి శత్రుజిత్ కపూర్ గత వారంలో ఏర్పాటు చేశారు. అలీఖాన్‌కు సుప్రీంకోర్టు తాత్కాలిక బెయిల్ మంజూరు చేయడంతో ఆయన గత గురువారంనాడు జ్యుడిషియల్ కస్టడీ నుంచి విడుదలయ్యారు. దీనికి ముందు, ఆపరేషన్ సిందూర్‌పై సోషల్ మీడియా పోస్టులకు సంబంధించి మే 18న హర్యానా పోలీసులు అలీఖాన్‌ను అరెస్టు చేశారు.

## జస్టిస్ వర్మపై అభిశంసనకు మద్దతివ్వండి : సిపిఐ

### అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులకు సిపిఐ ఎంపి సందోష్ కుమార్ లేఖ




**న్యూఢిల్లీ :** అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మకు వ్యతిరేకంగా పార్లమెంటులో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టడానికి మద్దతు ఇవ్వాలని అన్ని రాజకీయ పార్టీలకు సిపిఐ పార్లమెంటరీ పార్టీ నాయకుడు పి.సందోష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాజకీయ పార్టీల అధ్యక్షులకు ఆయన లేఖ రాసారు. జస్టిస్ యశ్వంత్ వర్మ ఢిల్లీ నివాసంలో నోట్లు తగలబడుతూ బైటపడిన వ్యవహారంలో సుప్రీం కోర్టు నియమించిన విచారణ కమిటీ అభిశంసించిందని ఆయన తెలిపారు. ''ఒకవేళ నిజమే అని తేలితే, ఆ ఆరోపణలు ప్రజల విశ్వాసానికి ద్రోహం చేయడమే కాకుండా న్యాయ వ్యవస్థల నైతికతపై గంభీరమైన ప్రభావాన్ని చూపుతుంది.'' అని లేఖలో సందోష్ కుమార్ పేర్కొన్నారు. భారత న్యాయవ్యవస్థ విశ్వసనీయతను పరిరక్షించేందుకు పక్షపాతాలకు అతీతంగా రాజ్యాంగ బాధ్యత నిర్వర్తించేందుకు అన్ని రాజకీయ పార్టీలు నిలబడాలని కోరారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 124 (సుప్రీం కోర్టు ఏర్పాటు), ఆర్టికల్ 218 (న్యాయమూర్తుల తొలగింపు నిబంధనలు) లకు అనుగుణంగా'' న్యాయవ్యవస్థ ఔచిత్యం, ప్రజలకు జవాబుదారీతనం వంటి తీవ్రమైన ప్రశ్నలు తలెత్తినప్పుడు శాసనవ్యవస్థ మౌన ప్రక్షకురాలిగా ఉండలేదని'' పేర్కొన్నారు. న్యాయవ్యవస్థను మరింత జావాబుదారీ, సమ్మిళితం, సామాజిక ప్రాతినిధ్యం ఉండేలా జాతీయ స్థాయిలో రాజకీయ చర్చ జరగాలని సందోష్ కుమార్ అన్నారు. నియామకాలు విషయంలో న్యాయవ్యవస్థ పారదర్శకరహితంగా ఉంటుందని, ముఖ్యంగా కులం, లింగం, ప్రాంతీయ వైవిధ్యం విషయంలో ప్రాతినిధ్యాల విషయంలో ఇది ఎక్కువ అని అన్నారు. ''మన న్యాయస్థానాలు భారతీయ సమాజం బహుళ స్వభావాన్ని ప్రతిబింబించాలి. ఉన్నత న్యాయవ్యవస్థలో జవాబుదారీ యంత్రాంగం ఏర్పాటు దీర్ఘకాలికంగా నిలిచి ఉంది. నుడు మనం ఎదుర్కొంటున్న అవినీతి ఆరోపణలు కేవలం ప్రత్యేక కేసులకే పరిమితం కాదు. ఇది సంస్థాగత వైఫల్యం. ఇది వ్యవస్థాగత సంస్కరణలు, ప్రజాస్వామ్య నిబద్ధతలను కోరుతుంది.'' అని వివరించారు.

### రాజీనామా .... లేదంటే అభిశంసనే..

ఇదిలావుండగా, జస్టిస్ వర్మకు వ్యతిరేకంగా అభిశంసన తీర్మానాన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు గల అవకాశాలను కేంద్రం పరిశీలిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలియజేశాయని 'పిటిఐ' పేర్కొంది. జస్టిస్ వర్మ రాజీనామా చేయనట్లయితే జూలై మాసం మూడవ వారంలో ప్రారంభమయ్యే పార్లమెంటు వానాకాల సమావేశాలలో అభిశంసన తీర్మానం తప్పదని ఆ వర్గాలు వెల్లడించాయి. అయితే వర్మకు వ్యతిరేకంగా సాధారణ ప్రక్రియను ఇంకా ప్రారంభించలేదని, ఈ విషయంలో ఎలాంటి చర్యనైనా తీసుకునే ముందు ప్రభుత్వం ప్రతిపక్షాలను కూడా విశ్వాసంలోకి తీసుకుంటుందని అధికార వర్గాలు తెలిపాయి.

## సాధ్యమైనంత...సహాయం అందిస్తాం

♦ ఖాండ్వా హత్యాచార బాధితురాలి కుటుంబానికి కాంగ్రెస్‌నేత రాహుల్ గాంధీ హామీ ♦ ఫోన్‌కాల్‌లో మాట్లాడించిన అఖిల భారత ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ విక్రాంత్ భురియా ♦ నిందితులకు శిక్ష పడేలా గట్టిగా కృషిచేయాలని రాహుల్ ఆదేశం



**ఖాండ్వా (మధ్యప్రదేశ్) :** గతవారం మధ్యప్రదేశ్‌లోని ఖాండ్వాలో అత్యంత దారుణంగా సామూహిక హత్యాచారానికి గురైన గిరిజన మహిళ కుటుంబానికి సాధ్యమైనంత మేరకు సహాయం అందజేస్తామని కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారు. ఆయన బుధవారం బాధిత కుటుంబసభ్యులతో ఫోన్‌కాల్‌లో మాట్లాడారు. ఖాండ్వా జిల్లాలో 45 ఏళ్ల వయసు గిరిజన మహిలను శుక్రవారం రాత్రి ఇద్దరు వ్యక్తులు దారుణంగా అత్యాచారం చేసి తీవ్రంగా గాయపర్చగా తీవ్ర రక్తస్రావంతో మరుసటిరోజైన శనివారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సంఘటనకు సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన గిరిజన విభాగమైన అఖిల భారత ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ విక్రాంత్ భురియా బుధవారం మధ్యాహ్నం విక్రాంత్ భురియా బాధిత కుటుంబసభ్యులను వారి నివాసంలో కలిసి మాట్లాడారు. ఆయన రాహుల్‌గాంధీతో ఫోన్‌కాల్‌చేసి హత్యాచార బాధితురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడించారు.ఈ సంభాషణకు సంబంధించిన ఒక వీడియోను కాంగ్రెస్ పార్టీ బుధవారం విడుదల చేసింది. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ వారిని ఓదారుస్తూ కాంగ్రెస్ పార్టీ సాధ్యమైనంత సహాయం అందజేస్తుందని, అండగా నిలబడతామని భరోసా ఇచ్చారు. ఈ ఫోన్ కాల్ సంభాషణలో రాహుల్‌గాంధీ బాధిత కుటుంబసభ్యుల బంధువుతో మాట్లాడుతూ నిందితులు మీ కుటుంబంలో ఎవరికైనా తెలుసా అని అడిగారు. దానికి అతడు సమాధానమిస్తూ తనకు నిందితులు బాగా తెలుసని, వారు కూడా తమ గ్రామానికి చెందిన వారేనని వివరించారు. నిందితులు ప్రస్తుతం జైలులో ఉన్నారా లేదా అని రాహుల్‌గాంధీ వారిని ప్రశ్నించి వారి నుంచి సమాధానం పొందారు. రాహుల్‌గాంధీ విక్రాంత్ భురియాతో మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా నిలవాలని, నిందితులకు శిక్ష పడేలా గట్టిగా ప్రయత్నించాలని సూచించారు. సామూహిక హత్యాచార బాధితురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారని ఇంతకు ముందు పోలీసులు వెల్లడించారు. హత్యాచార బాధితురాలు, నిందితులు కోర్కు గిరిజన తెగకు చెందిన వారని పోలీసులు వెల్లడించిన విషయం తెలిసిందే.

## పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు

### ఆపరేషన్ సిందూర్‌పై కొన్ని ప్రశ్నలకు జవాబివ్వాలి: టిఎంసి



**న్యూఢిల్లీ :** వర్షాకాల సమావేశాలకు ముందు జూన్‌లో ప్రత్యేక పార్లమెంటు సమావేశాన్ని నిర్వహించాలని తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) బుధవారం డిమాండ్ చేసింది. ఆపరేషన్ సిందూర్‌పై కొన్ని అత్యవసర ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం ఇవ్వాలని కోరింది. రాజకీయ ర్యాలీలు నిర్వహించడం ద్వారా అధికార బిజెపి ఆపరేషన్ సిందూర్‌ను రాజకీయం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆ పార్టీ ఆరోపించింది. ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రవాద దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయినప్పటి నుండి ప్రతిపక్ష పార్టీలు పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని డిమాండ్ చేస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్ గురించి ఎంపిలకు తెలియజేయడానికి జరిగిన అఖిలపక్ష సమావేశంలో కూడా ఈ డిమాండ్‌ను లేవనెత్తాయి. ప్రభుత్వానికి పూర్తి మద్దతు ఉన్నదని తాము విశ్వసిస్తున్నామని, అదే సమయంలో పార్లమెంటు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని తొలుత ఎంపి కపిల్ సిబల్ చేసిన డిమాండ్‌కు కూడా తాము ఇప్పుడు మద్దతు ఇస్తున్నామని టిఎంసి రాజ్యసభ ఉప నాయకురాలు సాగరికా ఘోష్ బుధవారం ఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వర్షాకాల సమావేశాలకు ముందు జూన్‌లో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు విదేశీయులు భారతీయ దృక్కోణాన్ని విన్నారు అయితే భారత్, భారత పౌరులు ప్రభుత్వ దృక్కోణాన్ని వినాల్సిన సమయం ఆసన్నమైందని జెప్పారు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా తాము లేవనెత్తుతున్న కొన్ని అత్యవసర ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని సాగరికా పేర్కొన్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సాధారణంగా జూలై మూడవ వారంలో జరగనుండగా, పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను డిమాండ్ చేయడానికి ప్రతిపక్ష పార్టీలు కలిసి రావాలన్నారు. 'బిజెపితో పోరాడుతున్న పార్టీలు, పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలనే డిమాండ్‌పై ఏకతాటిపై ఉన్నామని, కలిసి ముందుకు సాగుతున్నామని, రాజ్యసభలో టిఎంసి పార్లమెంటరీ పార్టీ నాయకుడు డెరెక్ ఓ బ్రెయిన్ విలేకరులతో అన్నారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలనే డిమాండ్‌ను లేవనెత్తిన పార్టీలలో కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, శివసేన (యుబిటి), ఆర్‌జెడి, వామపక్షాలు, నేషనల్ కాన్ఫరెన్స్, జెఎంఎం, ఆప్ ఉన్నాయి. ఈ అంశంపై ప్రతిపక్ష పార్టీలు సంప్రదింపులు జరుపుతున్నాయని వర్గాలు తెలిపాయి. కాగా, ఆపరేషన్ సిందూర్‌ను రాజకీయం చేయడానికి ప్రయత్నిస్తున్న బిజెపిపై ఘోష్ మండిపడ్డారు. ఆపరేషన్ సిందూర్‌ను రాజకీయం చేయాలని బిజెపి యత్నించడం శోచనీయమన్నారు. మన సాయుధ దళాల ధైర్యసాహసాల వల్లే ఆపరేషన్ విజయవంతమైందన్నారు. మన సాయుధ దళాల త్యాగం, ధైర్యాన్ని రాజకీయం చేయాల చూడడాన్ని తాము విశ్వసించబోమన్నారు. ఆపరేషన్ సిందూర్ విషయంలో ప్రధానమంత్రి కూడా అత్యంత నాటకీయ రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.

## రాజ్యసభకు కమల్ హాసన్

### డిఎంకె అధికారిక ప్రకటన



**న్యూఢిల్లీ :** తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రముఖ సినీ నటుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) పార్టీ అధినేత కమల్ హాసన్‌ను రాజ్యసభకు పంపేందుకు అధికార డిఎంకె పార్టీ నిర్ణయించింది. ఈ విషయాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ అధికారికంగా ప్రకటించారు. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో డిఎంకెతో కమల్ హాసన్ పొత్తు పెట్టుకున్నారు. ఈ ఒప్పందంలో భాగంగా, రాజ్యసభలో ఒక సీటును ఎంఎన్ఎం పార్టీకి కేటాయించేందుకు డిఎంకె అంగీకరించింది. ఈ నేపథ్యంలో కమల్ హాసన్‌ను రాజ్యసభ అభ్యర్థిగా ప్రకటించారు. కమల్ హాసన్ 2018లో మక్కల్ నీది మయ్యం పార్టీని స్థాపించారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కోయంబత్తూరు నుంచి పోటీ చేసి ఓటమి చవిచూశారు. అయినప్పటికీ, ఆయన రాజకీయ ప్రయాణాన్ని కొనసాగించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో డిఎంకె నేతృత్వంలోని ఇండియా కూటమికి సపోర్ట్ చేశారు. కోయంబత్తూరు నుంచి పోటీ చేయాలని ఆలోచించినప్పటికీ, బిజెపి అభ్యర్థి అన్నామలై పోటీ వల్ల ఆ నిర్ణయం నుంచి వెనక్కి తగ్గారు. బదులుగా, డిఎంకె తరపున రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేశారు. ఈ సహకారానికి గుర్తింపుగా, డిఎంకె నేత స్టాలిన్ కమల్‌కు రాజ్యసభ సీటు హామీ ఇచ్చారు. జులైలో ఆరు రాజ్యసభ సీట్లు ఖాళీ కానున్నాయి. ఈ సీట్లలో నాలుగు డిఎంకె కూటమికి, రెండు అన్నా డిఎంకె కూటమికి దక్కే అవకాశం ఉంది. డిఎంకె తమ నాలుగు సీట్లలో ఒకదాన్ని కమల్ హాసన్‌కు కేటాయించింది. ఈ నిర్ణయాన్ని ఎంఎన్ఎం పార్టీ కార్యనిర్వాహక కమిటీ కూడా ఆమోదించింది. రాజ్యసభ ఎన్నికలు జూన్ 19, 2025న జరగనున్నాయి. తమిళనాడు అసెంబ్లీలో డిఎంకెకు బలమైన మెజారిటీ ఉండటంతో, కమల్ హాసన్ ఎన్నిక ఖాయంగా కనిపిస్తోంది.


### సోఫియా ఖురేషీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన...

## మంత్రి విజయ్‌షాపై విచారణను నిలిపివేయండి

### మధ్యప్రదేశ్ హైకోర్టుకు 'సుప్రీం' ఆదేశం
### ఈ అంశాన్ని ప్రస్తుతం పరిశీలిస్తున్నామని ధర్మాసనం వెల్లడి

**న్యూఢిల్లీ :** భారత ఆర్మీ ఆఫీసర్ కల్నల్ సోఫియా ఖురేషీకి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలకు సంబంధించి మధ్యప్రదేశ్ రాష్ట్ర మంత్రి విజయ్ షా మధ్యప్రదేశ్ హైకోర్టు ముందు ఎదుర్కొంటున్న విచారణను మూసివేయాలని బుధవారం సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రస్తుతం ఈ అంశాన్ని పరిశీలిస్తున్నామని అత్యున్నత న్యాయస్థానం తెలియజేసింది. సుప్రీంకోర్టు ఇచ్చిన మునుపటి ఆదేశాలకు అనుగుణంగా మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటేశ్వర్ రావులతో కూడిన ద్విసభ్య ధర్మాసనం స్టేటస్ రిపోర్టును కోరింది. దర్యాప్తులో భాగంగా ప్రత్యేక దర్యాప్తు బృందం కొన్ని పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు సుప్రీంకోర్టు గుర్తించింది. మంత్రికి వ్యతిరేకంగా హైకోర్టులో సమాంతర చర్యలు కొనసాగుతున్నాయని సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహతా ధర్మాసనానికి తెలియజేశారు. ఈ విషయం ఇప్పుడు తమ పరిధిలోకి వచ్చినందున హైకోర్టులో విచారణ ముగిసిందని సర్వోన్నత న్యాయస్థానం తెలియజేసింది. విజయ్‌షా అరెస్ట్‌పై స్టే తో సహా మే 19న ఇచ్చిన మధ్యంతర ఆదేశాలు పొడిగించబడ్డాయని ధర్మాసనం తెలిపింది. అనంతరం ఈ అంశంపై తదుపరి విచారణను జులై రెండవ వారానికి వాయిదా వేసింది. ఈ అంశాన్ని రాజకీయం చేయడాన్ని అత్యున్నత న్యాయస్థానం కోరుకోవడం లేదని, ఈ అంశంలో ఎలాంటి జోక్యాన్ని తాము అనుమతించే ప్రసక్తే లేదంటూ ధర్మాసనం తిరస్కరించింది. మే 19న అత్యున్నత న్యాయస్థానం భారత ఆర్మీ ఆఫీసర్ సోఫియా ఖురేషీకి వ్యతిరేకంగా మధ్యప్రదేశ్ రాష్ట్ర మంత్రి విజయ్ షా చేసిన వ్యాఖ్యలపై మందలించింది. ఆయనపై నమోదైన ఎఫ్ఐఆర్‌కు సంబంధించి దర్యాప్తు చేపట్టేందుకు అత్యున్నత న్యాయస్థానం ముగ్గురు సభ్యులతో కూడిన సిట్‌ను ఏర్పాటుచేసింది. ఆపరేషన్ సిందూర్ గురించి మీడియా సమావేశంలో భారత ఆర్మీ ఆఫీసర్ కల్నల్ సోఫియా ఖురేషీ, మరో మహిళా అధికారి వ్యోమికా సింగ్‌తో కలిసి ఇచ్చిన వివరణపై మధ్యప్రదేశ్ రాష్ట్ర మంత్రి విజయ్ షా చేసిన అభ్యంతరకర వ్యాఖ్యల వీడియోపై జాతీయస్థాయిలో విమర్శలు తీవ్రస్థాయిలో వెల్లువెత్తాయి. మధ్యప్రదేశ్ హైకోర్టు విజయ్‌షా అసభ్యకరమైన భాషతో కల్నల్ సోఫియా ఖురేషీపై బురదజల్లడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. ఈ పరిణామాల తర్వాత విజయ్ షా తన వ్యాఖ్యలపై పశ్చాత్తాపం వ్యక్తంచేస్తూ కల్నల్ సోఫియా ఖురేషీపై తనకు ఎంతో గౌరవం ఉన్నదని, ఆమె తనకు సోదరిలాంటిది అని వివరణ ఇచ్చారు.

## ప్రధాని మౌనం వీడాలి



### భారత్–పాకిస్థాన్ మధ్య కాల్పు విరమణ ఒప్పందంపై వాస్తవాలు వెల్లడించాలి : జైరామ్ రమేష్

న్యూఢిల్లీ : భారత్–పాకిస్తాన్ మధ్య కాల్పు విరమణ ఎలా జరిగిందనే దానిపై ట్రంప్ అధికార యంత్రాంగం పదేపదే వ్యాఖ్యలు చేస్తుండగా, దీనిపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మౌనం వీడాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అమెరికా వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్ ఈనెల 23న న్యూయార్క్‌లోని యుఎస్ కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్‌లో చేసిన వ్యాఖ్యలు వాస్తవమేనా అని ప్రధాన మంత్రి దేశానికి తెలియజేయాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలను అడ్డుపెట్టుకుని భారత్ – పాకిస్తాన్ మధ్య స్వల్పమైన కాల్పుల విరమణను కుదుర్చుకున్నారా? తాత్కాలిక శాంతిని తీసుకువస్తున్నామని ప్రమాణం చేశారా అని ప్రశ్నించారు. అయితే అమెరికా వాణిజ్య కార్యదర్శి చేసిన వ్యాఖ్యలపై ప్రభుత్వం స్పందించలేదు. కానీ, ఇరుపక్షాల మధ్య ప్రత్యక్ష చర్చల తర్వాత కాల్పుల విరమణపై భారత్–పాకిస్థాన్ మధ్య అవగాహన కుదిరిందని పేర్కొంది. కాగా, 'మిస్టర్ లుట్నిక్ అధ్యక్షుడు ట్రంప్ అడుగుజాడలను అనుసరిస్తున్నారు. ఆయన 3 వేర్వేరు దేశాలలో 11 రోజుల్లో 8 సార్లు ఈ ప్రకటన చేశారు. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో కూడా ఇదే విషయాన్ని వెల్లడించారు. భారత్–పాకిస్తాన్ మధ్య చర్చలకు 'తటస్థ ప్రదేశం గురించి ప్రస్తావించారు. దీనిపై ప్రధాని మోదీ మౌనం వీడాలి' అని ఎక్స్‌లో జైరామ్ రమేష్ పోస్టు చేశారు. అయితే రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను పరిష్కరించడానికి తాను సహాయం చేశానని అమెరికా అధ్యక్షుడు పదే పదే చెబుతున్నారు. 26 మందిని బలిగొన్న ఏప్రిల్ 22 పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతిస్పందనగా మే 7న భారతదేశం ఆపరేషన్ సిందూర్ కింద ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై కచ్చితమైన దాడులు నిర్వహించింది. భారత చర్య తర్వాత, పాకిస్తాన్ మే 8, 9, 10 తేదీలలో భారత సైనిక స్థావరాలపై దాడి చేయడానికి ప్రయత్నించింది. భారత దళాలు అనేక పాకిస్థాన్ సైనిక స్థావరాలపై తీవ్ర ప్రతిఘటనను ప్రారంభించాయి. నాలుగు రోజుల తీవ్రమైన సరిహద్దు డ్రోన్, క్షిపణి దాడుల తర్వాత సైనిక ఘర్షణను ముగించడానికి భారత్–పాకిస్థాన్ మే 10న ఒక అవగాహనకు వచ్చాయి. వాషింగ్టన్ 'మధ్యవర్తిత్వం'లో సుదీర్ఘమైన చర్చల తర్వాత ఇరు దేశాల మధ్య పూర్తి, తక్షణ కాల్పుల విరమణకు అంగీకరించాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.

## కమల్‌కు చరిత్ర తెలియదనుకుంటా

### కన్నడకు సుదీర్ఘ చరిత్ర ఉంది : సిఎం సిద్ధరామయ్య



**బెంగళూరు :** తమిళం నుంచి కన్నడ భాష పుట్టిందంటూ ప్రముఖ నటుడు కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. తాను నటించిన థగ్ లైఫ్ సినిమా ఆడియో విడుదల సందర్భంగా చెన్నైలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'నా జీవితం, నా కుటుంబం తమిళ భాష' అని పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలపై కన్నడిగులు మండిపడుతున్నారు. తాజాగా ఈ వివాదంపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందించారు. నటుడి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కన్నడ పుట్టుకకు తమిళంతో సంబంధం లేదని పేర్కొన్నారు. కన్నడకు సుదీర్ఘ చరిత్ర ఉందని వ్యాఖ్యానించారు. కమల్ హాసన్‌కు ఆ విషయాలన్నీ తెలియవంటూ ఎద్దేవా చేశారు. 'కన్నడ పుట్టుకకు తమిళంతో సంబంధం లేదు. కన్నడకు సుదీర్ఘ చరిత్ర ఉంది. పాపం కమల్ హాసన్‌కు ఆ విషయాలన్నీ తెలియదనుకుంటా' అంటూ వ్యాఖ్యానించారు. కమల్ హాసన్ నటించిన థగ్ లైఫ్ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో మంగళవారం చెన్నైలో జరిగిన సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌లో కమల్ హాసన్ మాట్లాడుతూ.. 'కన్నడం.. తమిళం నుంచి పుట్టింది' అని కామెంట్ చేశారు. ఇదే కార్యక్రమానికి కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ కూడా హాజరయ్యారు. ఆయన ఎదుటే ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఉయిరే, ఉరవే తమిళే (నా ప్రాణం, నా బంధుత్వం తమిళం) అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన కమల్ హాసన్ అనంతరం కన్నడ స్టార్ శివరాజ్ కుమార్‌ని ఉద్దేశించి మాట్లాడారు. 'శివరాజ్‌కుమార్ వేరే రాష్ట్రంలో నివసిస్తున్నా నా కుటుంబ సభ్యుడు. అందుకే ఆయన ఈ రోజు ఇక్కడ ఉన్నారు. అందుకే నా ప్రసంగం మొదలుపెట్టేటప్పుడు.. నా జీవితం, నా కుటుంబం తమిళ భాష అని చెప్పా. మీ భాష (కన్నడ) తమిళ నుంచే పుట్టింది. ఆ విధంగా మీరు భాగస్వామి అయ్యారు' అని శివరాజ్‌కుమార్‌ను ఉద్దేశించి అన్నారు. అయితే తమిళం నుంచి కన్నడ పుట్టిందన్న కమల్ వ్యాఖ్యలపై కన్నడ సంఘాలు భగ్గుమన్నాయి. బెంగళూరులో థగ్‌లైఫ్ సినిమా బ్యానర్లను కొందరు ఆందోళనకారులు చించివేశారు. 'కర్ణాటకలో మీకు వ్యాపారం కావాలి.. కానీ కన్నడ భాషను అవమానిస్తారా?' అని ధ్వజమెత్తారు.

### జమ్ముకశ్మీర్ రాష్ట్ర హోదా

## చర్చ ఏమి నిలిచిపోలేదు

### ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పష్టీకరణ
### ఇటీవలి నీతి ఆయోగ్ సమావేశంలో రాష్ట్ర హోదా లేవనెత్తానని వెల్లడి



**గుల్‌మార్గ్ (జమ్ముకశ్మీర్) :** ఇటీవల జరిగిన నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశంలో జమ్ముకశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణ గురించి ఏప్రిల్ 22 పహల్గామ్ దాడి చర్చను నిలిపివేయలేదని జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పష్టం చేశారు. తాను ఈవిషయాన్ని నీతి ఆయోగ్ సమావేశంలో లేవనెత్తానని చెప్పారు. జమ్ముకశ్మీర్ హోదా పునరుద్ధరణ చర్చను పహల్గామ్ ఉగ్రవాద దాడి ఏమైనా ప్రభావితం చేసిందా అని అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ ఈ విషయాన్ని వెల్లడించారు. లేదు, ఎంతమాత్రం వాస్తవం కాదు. నీతి ఆయోగ్ సమావేశంలో కొనసాగిన అధికారిక ప్రసంగాన్ని మీరు తీసుకున్నట్లయితే, దానిలో రాష్ట్ర హోదా గురించి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, నీతి ఆయోగ్ పాలక మండలి సభ్యులు అందరి ముందు స్పష్టంగా లేవనెత్తడం జరిగింది అని ఒమర్ అబ్దుల్లా విలేకరులకు తెలియజేశారు. బుధవారం శ్రీనగర్ నుంచి 52కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి ఉత్తర కశ్మీర్ పర్యాటక రిసార్ట్‌లో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా విలేకరులతో మాట్లాడారు. 'కాబట్టి జమ్ముకశ్మీర్ రాష్ట్ర హోదా గురించి చర్చ ఏమీ ముగిసిపోలేదు. జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాన్ని రాష్ట్ర హోదాకు సంబంధించిన చర్చకు ఉపయోగించుకోవడం నాకు ఎంతమాత్రం ఇష్టం లేదు. అంతమాత్రాన రాష్ట్ర హోదా చర్చను నిలిపివేశామని అనుకోవడం సహేతుకం కాదు. ఆ చర్చ కొనసాగుతూనే ఉన్నది' అని ముఖ్యమంత్రి చెప్పారు.ఇక్కడ జరిగిన సమావేశానికి అధ్యక్షత వహించిన ముఖ్యమంత్రి పర్యాటకం పునరుద్ధరణ గురించి మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందినవారు మళ్లీ కశ్మీర్‌లోని పర్యాటక ప్రాంతాలను సందర్శించడానికి ముందు లోయలో పర్యాటక స్థలాలలను సందర్శించేది కశ్మీరీలేనని ఆయన చెప్పారు. దీనికి సంబంధించిన ప్రచారం, చురుకైన కార్యకలాపాలు ఇక్కడ జరగాలి. పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు సంబంధించిన పిక్నిక్‌లను ఇక్కడ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా విద్యాశాఖ మంత్రిని కోరినట్లు చెప్పారు. దీంతో పర్యాటక స్థలాల సందర్శన పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుంటుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.ఉన్నతస్థాయి పౌర యంత్రాంగం అధికారులతో పాటు, కశ్మీర్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, నార్త్ కశ్మీర్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్, బారాముల్లా సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఈ సమావేశానికి హాజరయ్యారు. మంగళవారం దక్షిణ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తన మంత్రి మండలి సమావేశాన్ని నిర్వహించిన విషయం తెలిసిందే. ప్రజల్లో భద్రత, విశ్వాసాన్ని పెంపొందించాలన్న ఉద్దేశంతో జమ్ముకశ్మీర్ పౌర సచివాలయంబయట ఈ కేబినెట్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జమ్ముకశ్మీర్ పర్యాటక సందర్శనకు సిద్ధంగా ఉన్నదన్న సందేశాన్ని పంపించాలన్న ప్రయత్నంతోనే ఇక్కడ సమావేశం నిర్వహించడంలోని ముఖ్యోద్దేశమని ఒమర్ అబ్దుల్లా చెప్పారు.

## కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు 44 మంది ఎమ్మెల్యేలు సిద్ధం

### గవర్నర్‌ను కలిసిన మణిపూర్ బిజెపి నేత సహా పది మంది శాసనసభ్యులు

**ఇంఫాల్ :** మణిపూర్‌లో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి నలభై నాలుగు మంది ఎమ్మెల్యేలు సిద్ధంగా ఉన్నారని బిజెపి శాసనసభ్యుడు తోక్‌చోమ్ రాధేశ్యామ్ సింగ్ తెలిపారు. బుధవారం ఆయన కొంతమంది ఎమ్మెల్యేలతో కలిసి గవర్నర్ అజయ్ కుమార్ భల్లాను కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజల కోరిక మేరకు 44 మంది ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్న విషయాన్ని మేము గవర్నర్‌కు తెలియజేశామన్నారు. రాష్ట్రంలో నెలకొన్న సమస్యకు ఎలాంటి పరిష్కారాలు చూపవచ్చో కూడా చర్చించామన్నారు. తాము చెప్పిన విషయాలను గవర్నర్ సావధానంగా విన్నారని, ప్రజల ప్రయోజనాల కోసం చర్యలు ప్రారంభిస్తారని తోక్‌చోమ్ అన్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారా అని విలేకరులు ప్రశ్నించగా, బిజెపి కేంద్ర నాయకత్వం నిర్ణయం తీసుకుంటుందని బుదులిచ్చారు. అయితే తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేసేందుకు గవర్నర్ వద్దకు వెళ్లామన్నారు. స్పీకర్ సత్యబ్రత వ్యక్తిగతంగా, సంయుక్తంగా 44 మంది ఎమ్మెల్యేలను కలిశారని, కొత్త ప్రభుత్వ ఏర్పాటును ఎవరూ వ్యతిరేకించలేదని సింగ్ అన్నారు. మే 2023లో చెలరేగిన మెయిటీస్, కుకిజోస్ మధ్య జాతి ఘర్షణలపై ప్రభుత్వం నిర్వహించిన తీరుపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో బిజెపి నాయకుడు ఎన్ బిరేన్ సింగ్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. దీంతోఫిబ్రవరి నుండి మణిపూర్ రాష్ట్రపతి పాలనలో ఉంది. 60 మంది సభ్యుల అసెంబ్లీలో ప్రస్తు తం 59 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు, ఒక శాసనసభ్యుడు మరణించడంతో ఒక స్థానం ఖాళీగా ఉంది. బిజెపి నేతృత్వంలోని సంకీర్ణంలో 32 మంది మెయిటీ ఎమ్మెల్యేలు, ముగ్గురు మణిపురి ముస్లిం ఎమ్మెల్యేలు, తొమ్మిది మంది నాగా శాసనసభ్యులు మొత్తం 44 మంది ఉన్నారు. కాంగ్రెస్‌కు ఐదుగురు ఎమ్మెల్యేలు ఉండగా, అందరూ మెయిటీలే. మిగిలిన 10 మంది ఎమ్మెల్యేలు కుకిలు. వారిలో ఏడుగురు గత ఎన్నికల్లో బిజెపి టికెట్‌పై గెలిచారు, ఇద్దరు కుకి పీపుల్స్ అలయన్స్‌కు చెందినవారు, ఒకరు స్వతంత్రుడు. మెయిటీలో నివసించే ఇంఫాల్ లోయలో భద్రతా దళాలు ప్రభుత్వ బస్సు విండ్ షీల్డ్‌పై రాష్ట్ర పేరును రాయడంతో భారీ నిరసనలు చెలరేగాయి. మే 20న గ్వాల్తాబిలో జరిగిన సంఘటనపై గవర్నర్ క్షమాపణ చెప్పాలని, ప్రధాన కార్యదర్శి, డిజిపి, భద్రతా సలహాదారు రాజీనామా చేయాలని మెయిటీ గ్రూపు లు డిమాండ్ చేస్తున్నాయి. మే 2023లో 250 మందికి పైగా మరణించిన జాతి కలహాలు ప్రారంభమైనప్పటి నుండి, మెయిటీ గ్రూపులు ఏ శాంతి ప్రక్రియ లోనూ రాష్ట్ర ప్రాదేశిక సమగ్రతపై చర్చలకు తావు లేదని వాదిస్తున్నాయి, అయితే కుకిజో సంస్థలు సంక్షోభాన్ని పరిష్కరించడానికి ఏకైక పరిష్కారం తాము నివసించే కొండ జిల్లాలకు ప్రత్యేక పరిపాలనను సృష్టించడమేనని వాదిస్తున్నాయి. గ్వాల్తాబి ఘటన ఉద్రిక్తతలకు మరింత బలం చేకూర్చింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## బెయిల్ పిటిషన్ వాపస్ తీసుకున్న శ్రవణ్‌కుమార్

**హైదరాబాద్ :** తనకు బెయిల్ ఇవ్వాలంటూ ఆర్థిక నేరం కేసు నిందితుడు శ్రవణకుమార్‌రావు (ఫోన్‌ట్యాపింగ్ కేసు నిందితుడు) దాఖలు చేసిన పిటిషన్‌ను వాపస్ తీసుకున్నారు. ఇనుప ఖనిజాన్ని కొనుగోలుకు రూ.24 కోట్లు వసూలు చేసి ఖనిజం సరఫరా లేదనే ఫిర్యాదు ఆధారంగా పోలీసులు నమోదు చేసిన కేసులో ఆయన అరెస్టయ్యారు. ఈ కేసులో తనను అన్యాయంగా అరెస్టు చేశారని, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు మరో క్రిమినల్ కేసులో పూచీకత్తులు సమర్పించడానికి పోలీసులు పిలిపించి అరెస్ట్ చేశారని తప్పుపట్టారు. కుట్రపూరితంగా నమోదైన కేసులో బెయిల్ మంజూరు చేయాలన్న పిటిషన్‌ను వేసవి సెలవుల ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శరత్ విచారించేందుకు నిరాకరించారు. విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు బుధవారం న్యాయమూర్తి ప్రకటించారు.
దీంతో ఈ వ్యాజ్యం జస్టిస్ అలిశెట్టి లక్ష్మీ నారాయణ బెంచ్‌కు కేటాయింపు జరిగింది. అయితే, న్యాయమూర్తి విచారణ చేపట్టడానికి ముందే పిటిషన్‌ను వాపస్ తీసుకుంటున్నట్లు శ్రవణ్ కుమార్ న్యాయవాది చెప్పారు. అందుకు అనుమతిచ్చిన న్యాయమూర్తి పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్లు వెల్లడించారు.

# బహుముఖ ప్రజ్ఞానిధి సురవరం ప్రతాపరెడ్డి

### తెలంగాణ సారస్వతపరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో తెలంగాణను మేలుకొల్పి, తెలుగు ప్రజానీకాన్ని జాగృతం చేసిన బహుముఖ ప్రజ్ఞానిధి సురవరం ప్రతాపరెడ్డి అని తెలంగాణ సారస్వతపరిషత్తు అధ్యక్షుడు సురవరం ప్రతాపరెడ్డి, సాహిత్య వైజయంతి ట్రస్ట్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అన్నారు. తెలంగాణ సాహిత్య వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి 129వ జయంతి సందర్భంగా బుధవారం హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఉన్న అయన విగ్రహానికి ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ట్రస్ట్ కార్యదర్శి సురవరం పుష్పలత, తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి, ట్రస్ట్ సంయుక్త కార్యదర్శి జె.చెన్నయ్య, ట్రస్ట్ సభ్యులు, సురవరం కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ పత్రికా సంపాదకులుగా, పరిశోధకుడుగా, పండితుడిగా, రచయితగా, ప్రేరకుడుగా, క్రియాశీల ఉద్యమకారుడుగా బహుముఖాలుగా సాగిన ప్రతాపరెడ్డి ప్రతిభ, కృషి అనన్యమైనవన్నారు. ప్రతాపరెడ్డి ప్రతిష్టాత్మకమైన గ్రంథం 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' తెలుగు ప్రజల చరిత్ర తెలిపే మహాగ్రంథమని, ఈ గ్రంథం తెలుగు వారి వెయ్యి సంవత్సరాల సాంఘిక, కళా సాంస్కృతిక చరిత్ర వివరిస్తుందన్నారు. తెలుగులో చరిత్రను ఆధునికత వైపు మళ్ళించడంలో సురవరం ప్రతాపరెడ్డి చారిత్రాత్మకమైన పాత్ర పోషించారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి పొందిన తొలి తెలుగు రచయితగా అయన విశేషకీర్తిని ఆర్జించారని చెప్పారు. సురవరం ప్రతాపరెడ్డిని ఇప్పటి వరకు ఎవరూ సరిగా అంచనా వేయలేకపోయారని, ఆయనకు సమాజంలో దక్కాల్సిన స్థానం కూడా దక్కలేదని శివారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని తెలుగు విశ్వవిద్యాలయానికి తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి పేరును పెట్టడం అభినందనీయమన్నారు. సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్టు సంయుక్త కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య మాట్లాడుతూ తెలుగు భాషా సంస్కృతుల వికాసానికి కృషి చేసిన మహనీయుడు సురవరం ప్రతాపరెడ్డి అని కొనియాడారు. తన బహుముఖ ప్రతిభా ప్రజ్ఞతో సాంఘిక చరిత్ర, రాజకీయ ఉద్యమాలు, పత్రికా నిర్వహణ, సాహిత్యం తదితర అనేక రంగాలలో అత్యంత ప్రభావవంతమైన ముద్ర వేసారని గుర్తుచేశారు. నిజాం నిరంకుశ పాలనలో తెలుగువారి అణచివేతను వ్యతిరేకిస్తూ సురవరం ప్రజలను చైతన్యవంతం చేసేందుకు ఎనలేని కృషిచేశారన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు డాక్టర్ సురవరం కృష్ణవర్ధన్‌రెడ్డి, కొండా లక్ష్మి కాంత్ రెడ్డి, సురవరం రఘువర్ధన్ రెడ్డి, సురవరం విజయభాస్కర్ రెడ్డి, డాక్టర్ సురవరం రంగారెడ్డి, కుటుంబసభ్యులు సురవరం అనిల్‌కుమార్‌రెడ్డి, సురవరం కపిల్ పాల్గొన్నారు.

### స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు
# మద్దతు ధర పెంచాలి

### తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్



**హైదరాబాద్ :** వరికి , ఇతర పంటలన్నింటికీ డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు మద్దతు ధర పెంచాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఎఐకెఎస్) ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వరికి గతం కంటే క్వింటాకు కేవలం 69 రూపాయలే పెంచిందని ఒక ప్రకటనలో విమర్శించారు. మూడు శాతం మాత్రమే ధరను పెంచారని, పంటకు పెట్టిన ఖర్చుకు 50 శాతం అదనంగా జోడించి మద్దతు ధరలు ప్రకటించాలని రైతాంగం చేస్తున్న పోరాటం పట్ల కేంద్ర పాలకులకు ఏమాత్రం పట్టింపులేదని మండిపడ్డారు. నూనె గింజలు సోయా, పొద్దు తిరుగుడు, వేరుశనగ పంటలకు 8–9 శాతం వరకు ధరలను పెంచారన్నారు. డాక్టర్ స్వామినాథన్ సిఫారసుల మేరకు పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేస్తామని, సంప్రదింపులకు కేంద్ర స్థాయిలో కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రధానమంత్రి గతంలో రైతాంగ పోరాటాల సందర్భంగా హామీనిచ్చారని పశ్యపద్మ గుర్తుచేశారు. ఇచ్చిన హామీని తుంగలో తొక్కి కేంద్ర పాలకులు వరి పంటకు కేవలం 69 రూపాయలు మాత్రమే పెంచడంతో దేశంలో ప్రధాన పంటలలో ఒకటిగా ఉన్న వరిపంట పండిస్తున్న రైతాంగానికి నిరాశ మిగిల్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంటలకు అయ్యే ఖర్చుకు 50శాతం అదనంగా కలిపి పంటలన్నింటికీ మద్దతు ధరలు ప్రకటించి అమలు చేయగలిగితేనే రైతు ఆర్థికంగా బలపడటానికి, వ్యవసాయం విస్తృతంగా అభివృద్ధి చెందటానికి అవకాశం ఉంటుందన్నారు. కేంద్ర పాలకులు విధిగా డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సూచనలు అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేస్తున్నదన్నారు.



## '26వ నేషనల్ రోయింగ్ ఛాంపియన్‌షిప్' పోటీలు ప్రారంభం

### మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హుస్సేన్ సాగర్‌లో ''26వ సబ్‌జూనియర్ నేషనల్ రోయింగ్ ఛాంపియన్‌షిప్'' పోటీలను బుధవారం రాష్ట్ర మంత్రి కొండా సురేఖ జెండా ఊపి ప్రారంభించారు. తెలంగాణ క్రీడా అథారిటీ క్రీడా నైపుణ్యాన్ని ప్రోత్సహించడానికి నిరంతర ప్రయత్నాలలో భాగంగా ఈ పోటీలు కొనసాగుతున్నాయని కొండా సురేఖ అన్నారు. 20కిపైగా రాష్ట్రాల నుండి 300 మందికి పైగా యువ అథ్లెట్లు అండర్13, అండర్15 విభాగాల కింద ఆరు ఈవెంట్లలో పోటీపడతారు. ఇటువంటి వేదికలు మన యువతకు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం మరియు బలమైన భవిష్యత్తును రూపొందించడంలో కీలకమైనవి. తెలంగాణ క్రీడా పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉందని కొండా సురేఖ అన్నారు. భారతదేశంలో క్రీడలు మరియు అథ్లెట్ అభివృద్ధికి తెలంగాణను ప్రముఖ కేంద్రంగా మార్చడానికి అంకితమైన క్రీడా విశ్వవిద్యాలయం జరుగుతోంది.

## ఇష్టం వచ్చినట్లు ప్రెస్ మీట్లు పెట్టొద్దు

### ప్రెస్ మీట్లకు అనుమతి తప్పనిసరి
### బిజెపి నేతలకు కిషన్ రెడ్డి హెచ్చరిక

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కొందరు నేతలు వ్యక్తిగత ఎజెండాతో పనిచేస్తున్నారని కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి పార్టీ నేతలకు వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది. హైదరాబాద్ నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎవరికి వారు ఇష్టం వచ్చినట్లు ప్రెస్ మీట్లు పెట్టి వ్యక్తిగత దూషనలకు దిగితే చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిసింది. పార్టీ కార్యాలయాన్ని వ్యక్తి గత అవసరాలకు వాడుకుంటే ఊరుకునేది లేదని నేతలకు స్పష్టం చేశారు. పార్టీ కార్యాలయంలో పార్టీ లైన్ ప్రకారమే మాట్లాడాలని సూచించారు. ఇక మీదట ప్రెస్ మీట్లు పెట్టాలంటే అనుమతి తప్పనిసరి చెప్పారు. ఇది తనతో పాటు అందరికీ వర్తిస్తుందన్నారు. బిజెపి పార్టీ నేతలు హుందాగా ప్రవర్తించాలన్నారు. బిజెపి అంటే బాధ్యతగల పార్టీ అని, సమాజంలోని అన్ని వర్గాలకు చెందిన పార్టీ అని వ్యాఖ్యాలు చేశారు. రాష్ట్రంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా పార్టీ కార్యాలయం ఆశ్రయిస్తున్నారని, అలాంటి వారికి న్యాయం చేసేలా నేతలు పోరాటం చేయాలని సూచించారు. అలా కాకుండా, ఇష్టం వచ్చినట్లు ప్రెస్ మీట్లు పెట్టి వ్యక్తిగత దూషణలకు దిగుతే చర్యలు తప్పవని నేతలను హెచ్చరించినట్లు తెలిసింది.

## వచ్చే నెలాఖరికి భారత్–అమెరికా తాత్కాలిక వాణిజ్య ఒప్పందం!

**న్యూఢిల్లీ :** భారత్–అమెరికా మధ్య జూన్ 25వ తేదీ నాటికి తాత్కాలిక వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. ప్రభుత్వ వర్గాలు బుధవారం నాడు ఈ విషయం వెల్లడించాయి. వాణిజ్య చర్చల నిమిత్తం అమెరికా ఉన్నతాధికారులు భారత్‌లో పర్యటిస్తారు. ఆ సమయంలో తాత్కాలిక ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. ''చర్చలు కొనసాగుతున్నాయి, సంబంధిత చర్యలన్నీ సజావుగా జరుగుతున్నాయి'' అని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. భారత్ తరపు ఈ వాణిజ్య చర్చల ప్రధాన సంప్రదింపులకర్త, వాణిజ్యమంత్రిత్వశాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ వాషింగ్టన్‌లో నాలుగురోజుల పర్యటనను గతంవారంలోనే పూర్తిచేశారు. ప్రతిపాదిత ఒప్పందంపై అమెరికా వాణిజ్యమంత్రిత్వశాఖాధికారులతో ఆయన చర్చలు జరిపారు. గతవారం కేంద్ర వాణిజ్య,పరిశ్రమల మంత్రి పీయూశ్ గోయల్ కూడా వాషింగ్టన్‌లోనే ఉండి చర్చలకు ప్రేరణ ఇచ్చారు. అమెరికా వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లుత్నిక్‌తో ఆయన రెండుసార్లు సమావేశాలు జరిపారు. ప్రపంచవ్యాప్తంగా అన్నిదేశాలపై భారీ ఎత్తున సుంకాల భారాలు విధించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన 26 శాతం పరస్పర సమానస్థాయి వాణిజ్య సుంకాల వసూలును జులై తొమ్మిదో తేదీ వరకూ వాయిదా వేశారు. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకుని రెండు దేశాలకూ ప్రయోజనకరమైన వాణిజ్య ఒప్పందం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం గట్టి నిర్ణయం తీసుకుని వాణిజ్యసంప్రదింపులు ప్రారంభించింది. ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బిటిఎ) మొదటి దశ పూర్తయేలోపు తాత్కాలిక ఒప్పందం చేసుకోవడానికి ఇప్పుడు రెండు దేశాల అధికారులు, మంత్రులు ఎదురుచూస్తున్నారు.

## ఎన్‌టిఆర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్న టిడిపి

### నందమూరి రామకృష్ణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎన్‌టిఆర్ ఆశయాలకు అనుగుణంగా టిడిపిని పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయకత్వంలో పనిచేస్తుందని నందమూరి రామకృష్ణ అన్నారు. దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో బుధవారం దివంగత మాజీ ముఖ్యమంత్రి, టిడిపి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్.టి.రామారావు జమంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నందమూరి రామకృష్ణ ముఖ్యఅతిధిగా హాజరై, కేక్ కట్ చేశారు. అనంతరం రామకృష్ణ చేతుల మీదగా పేదలకు చీరలు పంపిణి చేశారు. అంతకు ముందు ట్యాంక్‌బండ్ ఎన్‌టిఆర్ ఘాట్‌లో సమాధి వద్ద ఎన్‌టిఆర్‌కు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కేవలం రాజకీయాల కోసమే కాకుండా సేవా దృక్పథంతో పనిచేస్తుందన్నారు. అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉండి, ప్రజలతో మమేకమై ఉండటమే తెలుగుదేశం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. టిడిపి సికింద్రాబాద్ పార్లమెంటు అధ్యక్షులు పి.సాయిబాబా మాట్లాడుతూ ఎన్‌టిఆర్ ఆశయాలకు అనుగుణంగా ఎన్‌టిఆర్ ఆదర్శాల కోసం అందరూ కృషి చేయాలన్నారు. ఎన్‌టిఆర్‌కు భారత రత్న పురస్కారం అందజేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్ గౌడ్, పరుశురామ్, ఎం.ఎ.సిద్ధీఖి, ఎస్.ప్రకాష్, ప్రమీల, జాన్సీ, శ్రీనివాస్ గౌడ్, శ్యామ్ సుందర్, ప్రదీప్ గౌడ్, పి.బాలకృష్ణ, వెంకటేశ్ చౌదరి, కిరణ్, పి.వీరబాబు, రాజు, భాను ప్రకాష్, శక్తి ప్రేమ్, వి.రామారావు, ధనరాజ్, విజయ్ పాల్గొన్నారు.

### న్యాయవాది ప్రతాప్‌పై
# దాడిని ఖండించిన ఐఎఎల్

**హైదరాబాద్ :** సూర్యాపేట జిల్లా తుంగతుర్తికి చెందిన న్యాయవాది బానోత్ ప్రతాప్ కుటుంబంపై దాడిని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) తీవ్రంగా ఖండించింది. కుటుంబం భూమి సమస్య విషయంలో ప్రత్యర్థులు పట్టపగలే బానోత్ ప్రతాప్‌పై దాడి చేసి, కాలును విరగొట్టడమే కాకుండా, ఆయన తండ్రి తలను గాయపరచడం శోచనీయమని పేర్కొంది. ఆ భూమి విషయంలో కోర్టు నుంచి ప్రత్యర్థులపై న్యాయవాది ప్రతాప్ కుటుంబం ఇంజక్షన్ ఆర్డర్‌ను పొందిందని, అందులో వారి కుటుంబానికి పోలీసు రక్షణ ఇవ్వాలని కూడా ఉందని తెలిపింది. అయినప్పటికీ వారి ప్రత్యర్థులు బెదిరించిన విషయాన్ని పోలీసులకు దృష్టికి తీసుకెళ్ళి పోలీసులు ప్రొటెక్షన్ ఆర్డర్స్‌ను అమలు చేయాలని కోరినా సరైన చర్య తీసుకోకపోవడంతో ప్రత్యర్థులు దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరిచారని ఐఎఎల్ వివరించింది. కోర్టు ఆర్డర్ ఉన్నప్పటికీ న్యాయవాదిపై ఇలాంటి దాడి చేయడం న్యాయ వ్యవస్థపై విశ్వసనీయత దెబ్బతీస్తుందని, పోలీసుల నిర్లక్ష్యం సహించరానిదని, ఇందుకు బాధ్యులైన వారిపై కఠినంగా శిక్షించాలని ఇండియాన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో న్యాయవాదులపై జరుగుతున్న దాడులను పరిగణలో తీసుకొని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తక్షణమే అడ్వొకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను తీసుకురావాలని కోరారు. న్యాయవాది బానోత్ ప్రతాప్‌పై దాడి సంఘటన తెలిసిన వెంటనే, వారి కుటుంబాన్ని సూర్యాపేట జిల్లా ఐఎఎల్ అధ్యక్షుడు బొమ్మగాని శ్రీనివాస్, సీనియర్ న్యాయవాది సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదరి తొగట్టి మురళి, సహాయ కార్యదర్శి రాజారామ్, తదితరులు పరామర్శించారు.

# ఎసిబికి చిక్కిన ముషీరాబాద్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలలో ఇద్దరు అధికారులు లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కారు. వివరాలలోకి వెళితే.. ఫిర్యాదు దారునికి కుటుంబ సభ్యుల సర్టిఫికెట్ జారీ చేసేందుకు లంచం తీసుకుంటున్న ముషిరాబాద్ తహసిల్దార్ కార్యాలయం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎఐ భూపాల మహేష్‌ను బుధవారం అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఎసిబి కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఎసిబి డిజి విజయ్‌కుమార్ కథనం మేరకు పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.ముషిరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తికి తన కుటుంబ సభ్యుల సర్టిఫికెట్ అవసరం నిమిత్తం పదిహేను రోజుల క్రితం ముషిరాబాద్ తహసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎఐ భూపాల మహేష్‌ను ఆశ్రయించాడు. కుటుంబ సభ్యుల సర్టిఫికెట్ జారీ చేసేందుకు రూ.లక్ష లంచం అడిగాడు. దీంతో ఆ బాధిత వ్యక్తి ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేశాడు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లంచం అడిగినట్లు ఎసిబి పక్కాసాక్ష్యాధారాలు సేకరించింది. ఈ క్రమంలోనే బుధవారం బాధితుడి నుంచి రూ.25 వేలు నగదు లంచం డబ్బులను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎఐ భూపాల మహేష్ తన కార్యాలయంలో తీసుకుంటుండగా ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఎసిబి అధికారులు ముషీరాబాద్ తహసిల్దార్ కార్యాలయంతో పాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసిబి అధికారులు కీలక పత్రాలు లభ్యమయ్యాయి. పట్టుబడవిన భూపాల మహేష్‌ను నాంపల్లిలోని ఎసిబి కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల జ్యూడీషియల్ రిమాండ్ విధించారు. దీంతో ఎసిబి అధికారులు అతన్ని చంచల్‌గూడ జైలుకు తరలించారు.

## రూ.12లక్షలు లంచం డిమాండ్ చేసిన ఆర్‌ఐ కృష్ణ



**ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం :** ఓ రైతు దగ్గర 12లక్షల రుపాయులు లంచం డిమాండ్ చేశాడని రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణను అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్ట్ చేశారు. బుధవారం ఓ రైతు ఇచ్చిన పిర్యాధు మెరకు అవినీతి నిరోధక శాఖ అధికారులు హుటహుటిన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం తహసీల్థార్ కార్యాలయం పర్యటించి అక్కడే విధులు నిర్వహిస్తున్నా ఆర్‌ఐ జి కృష్ణ అదుపులోనికి తిసుకున్నట్లు ఎసిబి అధికారులు తెలిపారు.
ఈ సందర్భంగా ఎసిబి అధికారులు మాట్లాడుతూ మండల పరిధిలో ఆదిభట్ల గ్రామ సమీపంలో సర్వే నెంబర్ 355లో పట్టాదార్ పాస్ బుక్‌లో 7 గుంటల భూమిని అధనంగా చేర్చి ప్రోసెస్ చేసి ఆర్డిఓ,ఎంఆర్‌ఓ కార్యాలయంలో ఉన్నతాధికారులను ప్రభావితం చేయటానికి ఓ రైతు దగ్గర 12లక్షల రుపాయలు లంచం డిమాండ్ చేసి నట్లు తెలిపారు. ఇబ్రహీపట్నం తహసీల్థార్ కార్యాలయంలో ఆర్‌ఐ కృష్ణను అరెస్ట్ చేసి నగరంలోని నాంపల్లిలో ఎస్‌పిఇ,ఎసిబి న్యాయస్థానంలో అధనపు ప్రత్యేక న్యాయమూర్తి ముందు హజర్ పరిచినట్లు తెలిపారు.ఎక్కడైన ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగినట్లేయితే ఎసిబి యొక్క టోల్ ఫ్రీ నెంబర్ 1064కు ఫోన్ చేయాలని ప్రజలను కోరారు.



## ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా కార్యక్రమం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ డవలప్‌మెంట్ సహకారంతో ఐటిసి లిమిటెడ్ ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ప్రోగ్రాంను విజయవంతంగా ముగించింది. ఈ సందర్భంగా ఐటిసి లిమిటెడ్ న్యూట్రిషన్ సైన్సెస్ లీడ్ డాక్టర్ అగాథ బెట్సీ, ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ డవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ శంతను శర్మ మాట్లాడుతూ అక్టోబర్ 2024లో ప్రారంభించిన ఈ కార్యక్రమం అయోడిన్ లోపం వలన కలిగే వ్యాధుల (ఐడిడి)పై చైతన్యం కలిగించే లక్ష్యాన్ని కలిగి ఉందన్నారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల్లోని 30 జిల్లాల్లో ఆరోగ్యకరమైన ఆహారపు పద్ధతులను గురించి ప్రచారం చేస్తోందన్నారు. కేవలం ఏడు నెలల స్వల్ప కాలంలో, కార్యక్రమం తన ప్రారంభపు లక్ష్యాన్ని అధిగమించిందని, గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, యుక్త వయస్సు బాలికలు, బాలురు సహా 7.5 లక్షల ప్రజలపై వినూత్నమైన, పెద్ద ఎత్తున ప్రభావవంతమైన పద్ధతుల ద్వారా సానుకూలంగా ప్రభావం చూపించిందని తెలిపారు. అయోడిన్ లోపం వలన కలిగే వ్యాధులు, అయోడిన్ ప్రయోజనాలు, ఇతర కీలకమైన సూక్ష్మ పోషకాలు, సమగ్రమైన పౌష్టికాహారం, ఆరోగ్యకరమైన ఆహారపు పద్ధతుల గురించి విస్తృతంగా చైతన్యం కలిగించడానికి ఐటిసి ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ప్రోగ్రాం రూపొందించబడిందన్నారు. దీనిని అమలు చేయడంలో భాగంగా శాశ్వతంగా ప్రవర్తనలో మార్పు కలగడం, ఆరోగ్య ఫలితాల గురించి సమాజాలు బాధ్యతవహించడం నిర్ధారించడానికి ఈ కార్యక్రమం సమాజంలో అవగాహన కలిగించడం, సాంస్కృతికపరమైన జోక్యాలు, సాంకేతిక ఆవిష్కరణ, సామర్థ్య రూపకల్పనల మిశ్రమంతో దృఢంగా, పలు రకాల విధానాలతో రూపొందించబడిందన్నారు.

### సావర్కర్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన..
## రాహుల్ గాంధీ ముఖానికి నల్లరంగు పూస్తా

### శివసేన (యుబిటి) నాసిక్ నగర డిప్యూటీ చీఫ్ బాలా దారాడే

**న్యూఢిల్లీ :** మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీ సారథ్యంలోని మహావికాస్ అఘాడి భాగస్వామ్య పక్షమైన శివసేన (యుబిటి)కు మధ్య అగాథం ఏర్పడుతోంది. స్వాతంత్ర్య సమరయోధుడు వినాయక్ దామోదర్ సావర్కర్ గురించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ నాసిక్‌కు వస్తే ఆయన ముఖానికి తాను నల్లరంగు పూస్తానని, ఒకవేళ అదిసాధ్యం కాకపోతే రాహుల్‌గాంధీ కాన్వాయ్‌పై రాళ్లదాడి చేస్తానని శివసేన (యుబిటి) స్థానిక ఆఫీస్ బేరర్ బాలా దారాడే బుధవారం పరోక్షంగా హెచ్చరించారు. ఆయన వ్యాఖ్యలపై మహారాష్ట్రలోని కాంగ్రెస్ నాయకులు తీవ్రస్థాయిలో స్పందించారు. దారాడే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ బెదిరింపు వ్యాఖ్యలు చేసిన బాలా దారాడే నాసిక్‌లో ఉద్ధవ్ థాకరేనేతృత్వంలోని శివసేన (యుబిటి)పార్టీకి సిటీ యూనిట్ డిప్యూటీ చీఫ్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈ బెదిరింపు వ్యాఖ్యలు ప్రతిపక్ష మహా వికాస్ అఘాడిని ఒత్తిడిలోకి నెట్టేసే అవకావం ఉంది. స్వాతంత్ర్య వీర సావర్కర్ పుట్టిన గడ్డలో మేం నివసించడం మాకు ఎంతో గర్వకారణంగా ఉంది. 'రాహుల్ గాంధీ సావర్కర్‌పై చేసిన వ్యాఖ్యలు అతడిని అగౌరవపరిచేలా ఆయన్ను 'మాఫీ వీర్' అని పిలుస్తున్నారు. దానిని మేం గట్టిగా ఖండిస్తున్నాం. ఒకవేళ రాహుల్ గాంధీ నాసిక్‌కు వస్తే మేం ఆయనకు నల్లరంగు పూస్తాం అన్నారు.

# టిజిఐసిసిసిలో 'ఆర్‌టిఎ డేటాబేస్' అనుసంధానం

### పోలీసులతో రవాణా శాఖ అధికారుల సమావేశం తీర్మానం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రోడ్డు రవాణా అథారిటి (ఆర్‌టిఎ) డేటా బేస్‌ను తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (టిజిఐసిసిసి) వ్యవస్థతో అనుసంధానించాలని బుధవారం టిజిఐసిసిసిలో జరిగిన రవాణా శాఖ, పోలీసుల సంయుక్త సమావేశం తీర్మానించింది. టిజిఐసిసిసి విబి కమలాసన్‌రెడ్డి, తెలంగాణ రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్ ఆధ్వర్యంలో సంయుక్త సమావేశం బుధవారం టిజిఐసిసిసిలో జరిగింది. ట్రాఫిక్ నిబంధనల అమలులో సమాచారం వెంటనే అందుబాటులో ఉండేలా చూడటమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశ్యం. రోడ్డు రవాణా అథారిటీ డేటా బేస్‌ను టిజిఐసిసిసి వ్యవస్థతో అనుసంధానించడంతో చలాన్ వేసే సమయంలోనే వాహనానికి సంబంధించిన ముఖ్యమైన వివరాలు కాలుష్య నియంత్రణ (పియుసి) సర్టిఫికెట్, బీమా, రిజిస్ట్రేషన్ సమాచారం వంటివి టిజిఐసిసిసి సిస్టమ్‌లో వెంటనే కనిపిస్తాయి. ఇలా సమాచారం నేరుగా, వెంటనే అందుబాటులో ఉండటం వల్ల ట్రాఫిక్ పోలీసులు సులభంగా పనిచేయగలుగుతారు. చేతితో వివరాలు తనిఖీ చేసే అవసరం తగ్గుతుంది. ఆర్‌టిఎ డేటా బేస్ నుండి సరైన, అప్‌డేట్ చేయబడిన సమాచారం ఆధారంగానే చలాన్లు జారీ అవుతాయి. ఈ కొత్త ఆటోమేటిక్ చలాన్ విధానాన్ని అమలు చేయడానికి ఒక ప్రత్యేక బృందాన్ని పంపుతామని రవాణా కమిషనర్ హామీ ఇచ్చారు. అలాగే ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఐటిఎంఎస్) కింద ఉన్న ముఖ్యమైన పనుల గురించి కూడా చర్చించారు. వీటిలో ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఎన్‌పిఆర్ – వాహనాల నంబర్ ప్లేట్లను గుర్తించే వ్యవస్థ), పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ (పిఎఎస్ – ప్రజలకు సమాచారం ఇచ్చే వ్యవస్థ), వేరియబుల్ మెసేజ్ డిస్‌ప్లే బోర్డులు (విఎంబిఎస్–సమాచారం ప్రదర్శించే బోర్డులు) ఉన్నాయి. ప్రస్తుతం టిజిఐసిసిసి ఉపయోగిస్తున్న కెమెరాల రకాలు, వాటి సాంకేతిక వివరాలు, వీడియో విశ్లేషణ సామర్థ్యాలను కూడా పరిశీలించారు. ఆర్‌టిఎ వ్యవస్థను టిజిఐసిసిసి మౌలిక సదుపాయాలతో అనుసంధానించడం ఎంతవరకు సాధ్యమో అంచనా వేయడానికి ఒక ప్రత్యేక సాంకేతిక బృందాన్ని నియమించాలని నిర్ణయించారు. ఈ బృందం రెండు వ్యవస్థల మధ్య అనుకూలత, డేటా మార్పిడి పద్ధతులు, ఇతర సాంకేతిక అవసరాలను పరిశీలించి, సాఫీగా, సమర్థవంతంగా అనుసంధానం జరిగేలా చూస్తుంది. ఈ సమావేశంలో జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శివ లింగయ్య, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్, ఇతర ఆర్‌టిఎ అధికారులు. సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ పట్టణంలోని మనోజ్ థియేటర్ సమీపంలో బుధవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. లారీ బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరోకరు ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మరణించారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి వివరాలు ఇదామోని శ్రీశైలం (44) గ్రామం డిండి చింతపల్లి, వంగూరు మండలం, ఈరటు బచ్చయ్య(40) గ్రామం రాచలపల్లి ఊర్కొండ మండల వాసులుగా తెలిపారు.

## సమీకృత గురుకులానికి స్థల పరిశీలన



**ప్రజాపక్షం/నందికొండ:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ప్రాధాన్య మిస్తూ నాగార్జునసాగర్ నియోజకవర్గంలో నిర్మించ తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ గురుకుల నిర్మాణానికి కావలసిన స్థలాన్ని జాయింట్ కలెక్టర్ అమిత్ నారాయణ బుధవారం నందికొండ మునిసిపాలిటీలోని కొన్ని ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు బీసీ గురుకుల పాఠశాల వెనుక రోడ్డులోని స్థలాన్ని , నాట్కో గృహ నిర్మాణ సముదాయం పక్కనే ఉన్న స్థలాలను పరిశీలించారు.ఇంటిగ్రేటెడ్ గురుకులం నాగార్జునసాగర్ లోనే ఏర్పాటు చేయాలనే ఉద్దేశం ఉన్నట్లు తెలుస్తుంది. కొద్దిరోజుల క్రితం నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కూడా సాగర్ లో స్థల పరిశీలన చేయగా బుధవారం జాయింట్ కలెక్టర్ అమిత్ నారాయణ ఆధ్వర్యంలో స్థల పరిశీలన జరిగింది వీరి వెంట డ్యామ్ ఈ.ఈ. మల్లికార్జునరావు, ఫారెస్ట్ రేంజర్ రాఘవేంద్రరావు, ఆర్.ఐ. శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.



## చిట్యాల మార్కెట్ చైర్మన్‌గా వినోద ప్రమాణం

**ప్రజాపక్షం/చిట్యాల :** నల్లగొండ జిల్లా చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గ ప్రమాణ స్వీకారం బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటి ఆవరణలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, శాసనసభ్యులు వేముల వీరేశంలో సమక్షంలో జరిగింది. చైర్మన్‌గా మండలంలోని వట్టిమర్తి గ్రామానికి చెందిన నర్రా వినోదమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా నార్కట్‌పల్లికి చెందిన ఐతరాజు యాదయ్యలచే మార్కెటింగ్ శాఖ జిల్లా సహాయ సంచాలకులు ఛాయాదేవి ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే సభ్యులుగా చిట్యాల మండలానికి చెందిన కోనేటి యాదగిరి(ఉరుమడ్ల), దుబ్బాక అరుణ(నేరడ), షేక కరీం(చిట్యాల), కొండ ఎల్లయ్య(ఎలికట్టె), లెంకల విజయేందర్‌రెడ్డి(వనిపాకల), బూరుగు కృష్ణయ్య(చిట్యాల), గజ్జల భాస్కర్(చిట్యాల) నార్కట్‌పల్లి మండలానికి చెందిన దార యాదయ్య(గోపలాయపల్లి), తొడుసు వీరయ్య(బెండల పహాడ్), బింగి కొండయ్య(తొండ్లాయి), నీరుడు రాంరెడ్డి(ఔరవాణి)లు ప్రమాణ స్వీకారాన్ని చేపట్టారు. నూతన పాలక వర్గానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, రైతులు అభినందనలు తెలిపారు.

## అర్హులైన వారికి క్వార్టర్స్ అందించాలి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఎన్ఎస్పీ కార్యాలయాల్లో పనిచేసి రిటైర్ పట్టణంలోని ఎన్ఎస్పీ కాలనీలో జీవనం కొనసాగిస్తున్న వారందరిని గుర్తించి ప్రభుత్వం వెంటనే బేషరతుగా క్వార్టర్స్ తిరిగి వారికే అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంపు 41వ వార్డుశాఖ మహాసభ బంటు రాజేశ్వరి అధ్యక్షతన జరగగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్ఎస్పీ క్యాంపులో రిటైర్మెంట్ అయి వాళ్ల పిల్లలు కూడా ఇక్కడే ఉండి జీవిస్తున్నారని, అలాంటి వారిని గుర్తించి క్వార్టర్స్‌ను తిరిగి ఇవ్వాలని, అదేవిధంగా అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇండ్లు అందించాలని డిమాండ్ చేశార. లేనట్లయితే సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సీపీఐ పార్టీ భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం అనే ప్రజా పోరాటాలు చేసి వంద సంవత్సరంలోకి అడుగుపెట్టిందన్నారు. ఆనాటి నుంచి నేటి వరకు పేద ప్రజలకు అండగా ఉంటుందని, అనునిత్యం ప్రభుత్వాలతో పోరాటాలు చేస్తూనే ఉందన్నారు. కార్యక్రమంలో దామరచర్ల మండల కార్యదర్శి ధీరావత్ లింగానాయక్, రేణుక, గోలి రమేష్, ఎస్‌కె.జలీల్, పద్మ, వెంకటేశ్వర్లు, గుంజ లక్ష్మి, సువర్ణ, విజయ, అనసూయ, రహీమ తదితరులు ఉన్నారు.

## ప్రజాసంక్షేమ పాలన ఘనత కెసిఆర్‌దే

మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** ప్రజా సంక్షేమ పాలన అందించిన వారిలో కెసిఆర్‌కు మించినవాడే లేడని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట నియోజకవర్గ వ్యాప్తంగా పలు కార్యక్రమాలకు హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. తమ ప్రభుత్వ హాయంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు మరేక్కడ లేవన్నారు. ఈ ఘనత మాజి సిఎం కెసిఆర్‌దేనని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలే కాకుండా అనేకమైన సంక్షేమ పథకాలను ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కార్ ఇప్పటికీ కెసిఆర్ ప్రవేశపెట్టిన పథకాలనే కొనసాగిస్తున్నారే తప్పా కొత్తవి ప్రవేశపెట్టినా ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా చేతులేత్తిసిందన్నారు. ఇప్పటికైనా సిఎం రేవంత్ రెడ్డి పాలనపై దృష్టిపెట్టి ప్రజల సమస్యలను పరిష్కరించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పి వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, మాజీ జడ్పిటిసి జీడిబిక్షం, నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ధాన్యం ఎగుమతుల్లో జాప్యం తగదు

జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు

**ప్రజాపక్షం/తుంగతుర్తి(అర్వపల్లి):** ధాన్యం ఎగుమతులో జాప్యం చేయవద్దని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు అధికారులను అదేశించారు. బుధవారం అర్వపల్లి మండలంలోని వెల్పుచర్ల, రామన్నగూడెం, అర్వపల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలకు రైతులు అమ్మకానికి తెచ్చిన ధాన్యం, కాంటాలువేసిన ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సివిల్ సప్లై అధికారులను, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను అదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యంను వెంటనే మిల్లులకు ఎగుమతి చేయాలన్నారు. రెండు, మూడు రోజుల్లో ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని అదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని ఆగ్రో రైతుసేవా కేంద్రాన్ని ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువులు స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు. ఎరువుల కొరత సృష్టించిన చర్యలు తప్పవన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి, తహసిల్దార్ యాదగిరి, మండల వ్యవసాయశాఖ అధికారి గణేష్ పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతి పేదవాడికీ ఇందిరమ్మ ఇళ్లు

నియోజకవర్గంలో రానున్న మూడున్నరేళ్లలో 20వేల ఇళ్లు కట్టించే బాధ్యత నాదే : ఎమ్మెల్యే బాలునాయక్




**ప్రజాపక్షం/దేవరకొండ :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గుడిసెలో నివసిస్తున్న పేద, బడుగు, బలహీన వర్గాల వారికి ఇందిరమ్మ ఇళ్లను కట్టించి ఇస్తున్నదని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. బుధవారం పట్టణంలోని సాయిశివ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు పట్టాల పంపిణి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 5లక్షల ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో 3500 ఇండ్లు కట్టించి ఇస్తున్నామని, పేదల్లో అత్యంత పేదలకు మొదటి ప్రాదాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పొందిన లబ్దిదారులు 30 రోజుల్లో గృహాల నిర్మాణాన్ని ప్రారంభించాలని లేనట్లయితే మంజూరు రద్దు అవుతుందని తెలిపారు. గతంలో దేవరకొండ పట్టణంలో ఇల్లు నిర్మించుకొని రెగ్యులరైజేషన్ కానీ వారికి రెగ్యులరైజేషన్ చేయలాని, గ్రామ కంఠం, వక్ఫ్ భూములలో ఇల్లు నిర్మించుకున్న వారందరికి హక్కు పత్రాలు కల్పించాలని ఆయన జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల జాబితాను పారదర్శకంగా, శాస్త్రీయ పద్దతిలో నియమ నిబంధనలకు అనుగుణంగా రూపొందించడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గంలో 2346 మంజూరు ఉత్తర్వులను బుధవారం ఇస్తున్నట్లు ఆమె వెల్లడించారు. అంతకు ముందు జిల్లా గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల మంజూరు విధి విధానాలు తదితర అంశాలను వెల్లడించారు. అనంతరం లబ్దిదారులకు ఎంఎల్‌ఏ, కలెక్టర్ మంజూరు పత్రాలు అంశారు. ఈ సమావేశంలో ఆర్డీవో రమణారెడ్డి, తహశీల్దార్లు, ఎంపిడివోలు, మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, ప్రజా ప్రతినిధులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే పిడి యాక్ట్ నమోదు

బయటి ప్రాంతం నుండి జిల్లాకు నకిలీ విత్తనాలను రానీయవద్దు

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి:** నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ నమోదు చేయాలని, నకిలీ విత్తనాలు అమ్మేవారి పై దాడులు నిర్వహించి కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇతర ప్రాంతాల నుండి జిల్లాలోకి నకిలీ విత్తనాలు రాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, ఎవరైనా బయటి ప్రాంతం నుండి ఎట్టి పరిస్థితులలో జిల్లాకు నకిలీ విత్తనాలను రానీయవద్దని ఆమె అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి, పత్తితో పాటు ,ఇతర ఉద్యాన పంట లు, వాణిజ్య పంటలు పండించేందుకు ఎక్కువగా అవకాశం ఉందని ,ఈ సంవత్సరం ముందుగానే వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతులు పంటలు వేసుకునేందుకు ముందే చర్యలు తీసుకుంటారన్నారు. మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, సహాయ సంచాలకులు , సబ్ ఇన్స్పెక్టర్లు వారివారి పరిధిలో నకిలీ విత్తనాల సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. రైతులు నకిలీ విత్తనాల బారిపడకుండా ముందుగానే అవసరమైన అవగాహన కల్పించాలని ఆమె ఆదేశించారు. జిల్లాలో 140 మంది గజిటెడ్ అధికారులు వ్యవసాయ శాఖలో పని చేస్తుండగా ,జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి మేరకు మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి 97 మందిని అదనంగా జిల్లాకు నియమించేందుకు అంగీకరించడం పట్ల ఆమె కృతజ్ఞత తెలిపారు. జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ ఎక్కడైనా నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు వ్యవసాయాధికారుల దృష్టికి వచ్చినట్లయితే పోలీస్ సహకారం తీసుకుని వారిని కట్టడి చేయాలని చెప్పారు. నకిలీ విత్తనాలమ్మే వారిపై పి డి యాక్ట్ నమోదు చేస్తామన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ ,మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.




## త్వరితగతిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంను త్వరతగతిన పూర్తి చేసేందకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అధికారులను అదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, రాజీవ్ యువ వికాసం, పారిశుద్య పనులపై ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులకు వెబ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన జిల్లాకు ఇందిరమ్మ ఇండ్లు 12,868 మంజూరు కాగా మొదటి విడతలో 4322 మంది లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణం వివిధ దశలో ఉందని తెలిపారు. రెండవ దశలో 8,546 లక్ష్యానికి గానూ 2017 మంది లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. మండల స్పెషల్ అధికారులు త్వరలో ఎ ంపిక చేసిన నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలన్నారు. దశల వారిగా ట్యాబ్ ఎంట్రీ చేసి ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాలో డబ్బులు జమ చేయాల న్నారు. ధరల నియంత్రణ కమిటి ఏర్పాటు చేసుకుని ఇండ్ల సామాగ్రి మేస్త్రీ, కూలీ రేట్లు పెరగకుండా ఈ కమిటి పర్యవేక్షించాలన్నారు. రాజీవ్ యువ వికాసం పథకానికి జిల్లాలో 60,085 దరఖాస్తులు రాగా 57,985 డెస్క్‌లెవల్ వెరిఫికేషన్ జరిపి బ్యాంకులకు పంపడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి వివి అప్పారావు, హౌజింగ్ పిడి ధర్మారెడ్డి, ఎస్‌సి కార్పోరేషన్ ఈడి శ్రీనివాస్‌నాయక్, డిఎండబ్లూవో జగదీశ్వర్‌రెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ బాపూజీ, డిపివో యాదయ్య పాల్గొన్నారు.

## ఐవిఓ కృషి అభినందనీయం



**ప్రజాపక్షం/కోదాడ:** ప్రజల్లో దేశభక్తి పెంపొందించేందుకు ఇండియన్ వేటరన్ ఆర్గనైజేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని ప్రముఖ సినీ నటుడు సుమన్ అన్నారు. బుధవారం కోదాడ పట్టణంలోని సింగారం వెళ్లే దారిలో ఐవివో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వంద అడుగుల జాతీయ జెండాను సందర్శించి మాట్లాడారు. అనంతరం పహల్గాంలో మృతి చెందిన సైనికులకు రెండునిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐవివో సభ్యులు హీరో సుమన్‌ను ఘనంగా సన్మానించారు. హీరో సుమన్‌కు ఐవివో స్టేట్ అడ్వయిజర్ కమిటి మెంబర్‌గా రాష్ట్ర అధ్యక్షులు ఉజ్జిని రవీందర్‌రావు ఆమోదంతో నియమించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సామినేని ప్రమీల, డాక్టర్ మధుసూదన్‌రావు, డిసిప్లేవ్ కమిటి వెంకన్న, మహదేవ్, నవీన్, షేక్ రహీం, స్టాలిన్, నాగార్జున పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లాలో కల్తీ ఎరువులు, నకిలీ విత్తనాలు అమ్మిన, అధిక ధరలకు విక్రయించిన కఠిన చర్యలు తప్పవని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ శాఖ , ఉద్యానవన శాఖ అనుసంధానంతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో జిల్లాలోని ఎరువుల డీలర్స్, విత్తన డీలర్స్, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ ఎక్స్టెన్షన్ అధికారులు, తో ఆయిల్ ఫామ్ సాగుపై రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ హనుమంతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాన కాలం సీజన్ ప్రారంభమవుతున్నందున అందుకు అనుకూలంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఫర్టిలైజర్ షాపుల యాజమానులు షాపులలో లైసెన్స్, స్టాక్ రిజిస్టర్, బిల్ రిజిస్టర్, యూరియా, డిఏపి, తదితర పురుగుల మందులు స్టాకులను సీడ్స్ డీలర్స్ పక్కాగా మెయింటైన్ చేయాలన్నారు. లేనిపక్షంలో సంబంధిత వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో నకిలీ విత్తనాలు తమ ఎరువులను అధిక ధరలకు ఇక్కడ కూడా విక్రయించారు. విక్రయిస్తే అట్టి వారిపై వీడి యాక్ట్ కింద కేసులు నమోదు చేసి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. అనంతరం ఈపాస్ మిషన్లు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా డీలర్లకు అందజేశారు. తదుపరి ఆయిల్ ఫామ్ సాగు అనే పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, ఉద్యాన శాఖ అధికారి సుభాషిణి, ఎడిఏ నీలిమ, మండల వ్యవసాయ అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

## 6న తుర్కపల్లికి సిఎం రేవంత్ రెడ్డి

బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించిన ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తెలంగాణ రాష్ట్రంలోని యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలో సుమారు రూ.1500 వందల కోట్ల నిధులతో చేపట్టే అభివృద్ధి పనులతో ఆలేరు నియోజకవర్గాని అగ్రగామిగా నిలుపుతామని ఆలేరు ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. వచ్చేనెల, జూన్ 6న ఆలేరునియోజకవర్గంలోని తుర్కపల్లి మండలానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రానున్నారని, మండలంలోని వాసాలమర్రి గ్రామం వద్ద సిఎం భారీ బహిరంగ సభా స్థల పరిశీలన చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ హనుమంతరావుతో కలిసి సీఎం సభ స్థలాన్ని గుర్తించి అక్కడి పరిస్థితులు, సభా స్థలి,హెలిప్యాడ్,పార్కింగ్ స్థలాలను అనుగుణమైన వాతావరణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని తుర్కపల్లి మండలంలో 700 కోట్లతో గంధమల్ల ప్రాజెక్టు నిర్మాణం, 183 కోట్లతో మెడికల్ కాలేజ్, 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్, 23 కోట్లతో వేద పాఠశాల, కొలనుపాక, కాల్వపల్లి, కల్వర్టు పనులు 15 కోట్లతో, మోటకొండూరు మండల ప్రభుత్వ కార్యాలయలు 10 కోట్లతో, గోదాములకు సంబంధించిన సుమారు 15 వందలకోట్ల పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. జూన్ 6వ తేదీన నిర్వహించే బహిరంగ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటుగా, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, హాజరువుతున్నారని తెలిపారు. ఈ మేరకు ఆలేరు నియోజకవర్గం నుండి సుమారు 50 వేల మందితో పెద్ద ఎత్తున్న తరలివచ్చి ఈ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## పోచంపల్లి ఇక్కత్ చేనేత కార్మికుల కళా నైపుణ్యం అద్భుతం

ఆఫ్రికన్ దేశాల మీడియా ప్రతినిధుల బృందం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పోచంపల్లి ఇక్కత్ చేనేత కార్మికుల కళా నైపుణ్యం అద్భుతమని ఇక్కడి పర్యాటక ప్రాంతం అమేజింగ్ అని ఆఫ్రికన్ దేశాల మీడియా ప్రతినిధుల బృందం ప్రశంసిస్తూ కొనియాడుతూ అబ్బుర పడిపోయారు. కేంద్ర మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న హెరిటేజ్ టూర్ లో భాగంగా ఆఫ్రికా ఖండానికి చెందిన వివిధ దేశాల 25 మంది మీడియా ప్రతినిధుల బృందం, మిగిలిన ఎనిమిది మంది అధికారులు తో కలిపి 33 మంది బుధవారం పోచంపల్లి టూరిజం చేనేత ఇక్కత్ పరిశ్రమను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు టూరిజం పార్కులోని ఇక్కత్ చీరల చరిత్ర చేనేత మ్యూజియం మగ్గాల యూనిట్లు చేనేత తయారీ ప్రక్రియను వారు పరిశీలించి మగ్గాలపై కూర్చుని చీరలు వేసినట్లుగా ఫోటోలకు ఫోజులు ఇచ్చి కళాకారుల పనితీరును అభినందించారు. కొంతమంది ప్రతినిధులు రాట్నం తిప్పుతూ దారాన్ని వడికారు. మరి కొంత మంది మీడియా ప్రతినిధులు చీర తయారీలో డిజైన్ ఎలా తయారవుతుంది నిశితంగా పరిశీలించి ఫోన్లో బంధించారు. చేనేత వస్త్రాలను కళాకృతులను చూసి సెల్ఫీలు దిగారు. ప్రతినిధుల బృందానికి ఆర్డీవో శేఖర్ రెడ్డి, మంత్రిత్వ శాఖ అధికారులు పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రతినిధుల బృందం పట్టణంలోని సాయిని భరత్ భాస్కర్ సోదరుల కళా పునర్వి హ్యాండ్లూమ్ యూనిట్ ను సందర్శించి చేనేత వస్త్రాల తయారీ పరిశీలించి చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారు. కాగా విదేశీ మీడియా ప్రతినిధుల బృందం పర్యటన సందర్భంగా సిఐ రాములు, ఎస్సై భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును నిర్వహించారు. ఐఎఫ్ఎస్ ఉన్నతాధికారులు, ఎమ్మార్వో శ్రీనివాస్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, హ్యాండ్లూమ్ ఏడి శ్రీనివాస్, డిప్యూటీ ఎమ్మార్వో నాగేశ్వరరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ గుత్తా వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.


## ఆర్అండ్‌బి రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలి : ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/ఉండవెల్లి :** అల్లంపూర్ నియోజకవర్గంలోని ఆర్అండ్‌బి రోడ్డు మరమ్మత్తులు పనులు నాణ్యతగా చేపట్టాలని అల్లంపూరు నియోజకవర్గం ఎమ్మెల్యే విజయుడు అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని ఐజ నుండి కర్నూలు రోడ్డు మార్గమధ్యలో బ్రిడ్జి కల్వర్టు శిథిలావస్థలో ఉన్న పనులను పరిశీలించి బిజీ కల్వర్టులను ఆరు కిలో మీటర్ల వరకు బీటీ రోడ్లు మరమ్మత్తులు పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధాధికారులకు ఆదేశించారు. అట్టి పనులకు మూడు కోట్ల 50 లక్షల నిధులు మంజూరు చేసినట్లువారు తెలిపారు. పనులు ప్రారంభించి చాలా కాలం అవుతున్న పనులు ఎందుకు ఆలస్యంగా జరుగుతున్నాయని వారు అధికారులను ప్రశ్నించారు. వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, భారీ వాహనాలు వచ్చినప్పుడు సమస్య ఏర్పడుతుందని వారు తెలిపారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఆర్అండ్‌బి రోడ్డు పనులు వేగవంతంగా చేసి వాహనదారులకు సమస్య లేకుండా చూడాలని వారు తెలిపారు. ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి చొరవతో నిధులో మంజూరు అయినట్లు వారు తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆర్అండ్‌బి డిఈ సుభాష్ ఏఈ అల్తాఫ్ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన పత్తి విత్తనాల ఉత్పత్తికి కృషి

స్పీడ్ ఆర్గనైజర్లకు సూచించిన జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి:** రైతులకు మెరుగైన విత్తనాలు అందించేందుకు అధికారులు, స్పీడ్ ఆర్గనైజర్లు, సీడ్ కంపెనీలు పరస్పరం సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అన్నారు. బుధవారం ఐడిఓసి సమావేశం హాల్‌లో పత్తి విత్తన ఉత్పత్తిపై వ్యవసాయ శాఖ అధికారులు, సీడ్ కంపెనీలు, సీడ్ ఆర్గనైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం వర్షాలు అనుకూలంగా ఉన్నాయి. కాబట్టి పంట నష్టం లేకుండా రైతులకు మంచి ఆదాయం అందే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో పత్తి విత్తనాలే ప్రధాన ఆదాయం మార్గం కావడంతో, సుమారు 30000 ఎకరాల్లో సాగు కొనసాగుతూ 35000 నుండి 40000 మంది రైతులు విత్తన ఉత్పత్తి చేస్తున్నారని తెలిపారు. అధికారులు, సీడ్ ఆర్గనైజర్లు సీడ్ కంపెనీలు పరస్పరం సమన్వయంతో పనిచేసి, రైతులకు మంచి దిగుబడి కలగడానికి, అందరికి లాభం చేకూరడానికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ ఏడాది విత్తన ఉత్పత్తి సంబంధించి కంపెనీలు తమ కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని సూచించారు. గత సంవత్సరానికి చెందిన మొత్తం విత్తన ఉత్పత్తి వివరాలతో పాటు ఎంతమంది రైతుల విత్తనాలు జిఓటి పరీక్షలో ఉత్తీర్ణమయ్యిందో, ఎంత పరిమాణం విఫలమైందో వివరించిన జాబితాను సమర్పించాలని స్పష్టంగా ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ జగ్గు నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్, ఏడిఏ సంగీతలక్ష్మి, టెక్నికల్ ఏడీఏ రమేష్, మండల వ్యవసాయ శాఖ అధికారులు, సీడ్ కంపెనీల ప్రతినిధులు, సీడ్ ఆర్గనైజర్లు తదితరులు ఉన్నారు.



# లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**ప్రజాపక్షం/మఖ్తల్:** మక్తల్ నియోజకవర్గం కేంద్రం స్థానిక తాహసిల్దార్ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి , షాదీముబారక్ సీఎం సహాయనిధి చెక్కులను లబ్దిదారులకు మక్తల్ నియోజకవర్గం శాసనసభ్యులు డా.వాకిటి శ్రీహరి అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో అప్పుల్లో ఉన్న పేదోడికి సహాయం అందించే కార్యక్రమాల్లో భాగంగా కళ్యాణలక్ష్మి , షాదీముబారక్, సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్విరామంగా కొనసాగిస్తున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటివరకు మక్తల్ నియోజకవర్గంలోని ఏడు మండలాలకు గాను కళ్యాణ లక్ష్మి , షాదీముబారక్ చెక్కులను 2122 మందికి ఇరవై ఒక్క కోటి 22 లక్షల రూపాయలు ఇవ్వడం జరిగిందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# నల్లమలలో రెండురోజుల పాటు పాత్రికేయులకు శిక్షణా తరగతులు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :**నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమల ప్రాంతంలోని అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో అటవీశాఖ వనమాలిక వద్ద తెలంగాణరాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుసంఘం సహకారం, జిల్లా అటవీశాఖ వారి సౌజన్యంతో జర్నలిస్టుల రెండురోజుల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలంగాణమీడియా కార్యదర్శి ఎన్.వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈశిక్షణ తరగతులకు ముఖ్యఅతిథి రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటకశాఖమంత్రి జూపల్లికృష్ణారావు , సభాధ్యక్షులు తెలంగాణ మీడియా అకాడమీచైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, విశిష్టఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ, దిశ ఎడిటర్ మార్కండేయ, ఇతర పత్రికల సంపాదకులు కె.శ్రీనివాస్, దిలీప్‌రెడ్డి, ఆర్.రామారావులు హాజరవుతున్నారు. మొదటిరోజు గురువారం ఉదయం 10గంటలకు ప్రారంభ సమావేశం నిర్వహిస్తారని , తదుపరి శిక్షణ తరగతులు నిర్వహించబడతాయని తెలిపారు.

## వ్యవసాయ పొలాల గట్లపై చెట్లపెంపకంతో అదనపు ఆదాయం



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** వ్యవసాయపొలాల గట్లపై చెట్లుపెంచి అదనపు ఆదాయాన్ని పొందవచ్చని డాక్టర్ చరణ్‌తేజ్ అన్నారు. రైతుముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ కళాశాల శాస్త్రవేత్తలు బుధవారం తెలకపల్లి మండలంలోని గడ్డంపల్లి గ్రామంలో రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయరంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతన్నలుకూడా మారాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం వ్యవసాయంమీదనే ఆధారపడకుండా అనుబంధంగా తోటలు పొలంగట్లపై ఆదాయాన్నిచ్చే చెట్లను పెంచుకొని అధికలాభాలు పొందవచ్చని అన్నారు. ఆదాయంతోపాటు పర్యావరణ పరిరక్షణకు కూడా చెట్లు చేపడతాయని తెలిపారు. వ్యవసాయ పొలాలలో కూడా జీలుగాపిల్లి , పెసరజనుములాంటి విత్తనాలు చల్లిపూతదశలో కలియదున్నితే నేల సారవంతంపెరిగి రసాయన ఎరువులవాడకం అంతగా ఉండదని రైతన్నలకు క్షుణ్ణంగా వివరించారు. అనంతరం డాక్టర్ జోయల్ మాట్లాడుతూ నేటి రైతన్నలు మోతాదుకుమించి విరివిగా రసాయన ఎరువులువాడటంద్వారా నేల ఆమ్లత్వం క్షారత్వం ఏర్పడి పూర్తిగా సారవంతహీనంగా మారుతుందని తెలిపారు. కళాశాల విద్యార్థులు భూసార పరీక్షలకోసం మట్టినమూనా సేకరణగురించి రైతులకు పూర్తిగా వివరించారు. పెరట్లో వర్మికంపోస్టు ఏర్పాటుచేసుకునే విధానంగురించి చార్టులద్వారా ప్రదర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అన్వర్ పాషా, విద్యార్థులు, ఆదర్శరైతులు పాల్గొన్నారు.

## గర్భిణీలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి



**ప్రజాపక్షం/వెల్దండ:**గర్భిణీలు బలవర్ధకమైన పోషక ఆహారాన్ని తీసుకుంటే పుట్టబోయేబిడ్డ ఆరోగ్యంగా పుడతాడని కొట్రమాజీసర్పంచ్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం మండలపరిధిలోని కొట్రగ్రామంలో ఉప్పలచారిటబుల్‌ట్రస్టుచైర్మన్, మిషన్‌భగీరథ మాజీవైస్‌చైర్మన్ ఉప్పలవెంకటేష్ సమకూర్చిన గర్భిణీస్త్రీలకు మెడికల్‌కిట్లను మాజీ ఎంపిటిసి నీరటి రాములు గ్రామస్తులతోకలిసి పంపిణీచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు పోషకాహారాన్ని తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండటమేకాకుండా తల్లి ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్‌గ్రామ పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు , గర్భిణీలు పాల్గొన్నారు.

## నిరుపేద ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత

**ప్రజాపక్షం/ఊర్కొండ:** ఊర్కొండ మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఊర్కొండ గ్రామానికిచెందిన కంఠంమేరమ్మ కుమారుడు లబ్దిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి సహకారంతో తహసీల్దార్ యూసుఫ్‌అలీ, మండల గిర్దావర్ రాఘువేంద్రరావుతోకలిసి కాంగ్రెస్ నాయకులు పంపిణీచేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ పేదల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం పెద్దపీటవేస్తూ సబ్బండవర్గాల ప్రజలకు అండగా ఉందన్నారు. మహిళల అభివృద్ధికి ప్రజాప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నిరుపేదలందరికి సంక్షేమపథకాలు అందించడం ప్రజాపాలన ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎండి ఆరిఫ్, కాంగ్రెస్ యువజనవిభాగం మండల అధ్యక్షుడు ఆదినారాయణ, నాయకులు దయాకర్, రఫిక్, తేజ పాల్గొన్నారు.

## ఐఐఐటితో మారనున్న జడ్చర్ల రూపురేఖలు

**ప్రజాపక్షం/జడ్చర్ల:** మహబూబ్‌నగర్ జిల్లాకు మంజూరైన ఐఐఐటితో జడ్చర్ల రూపురేఖలు మారనున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న వాటిలో జడ్చర్ల ముందడుగు నూతనంగా మంజూరైన ఐఐఐటి ద్వారా మరింతగా ముందుకు సాగనుంది. జిల్లాకు మంజూరైన ఐఐఐటి మండలంలోని చిట్టెబోయినపల్లి శివారు స.నెం.1 లో 21 ఎకరాల 26 గుంటలు, మహబూబ్‌నగర్ అర్బన్ మండలం మూడు సర్వే నెంబర్లలో 20 ఎకరాల 6 గుంటల భూమి కేటాయించారు. కేటాయించిన భూమి 44వ నెంబరు జాతీయ రహదారికి సమీపంలో ఉండటంతో ప్రత్యక్షంగా పరోక్షంగా ప్రాంతం త్వరితగతిన అభివృద్ధి చెందే ఆస్కారం కలుగుతుంది. ఐఐఐటి జడ్చర్ల, మహబూబ్‌నగర్ శివార్లలో ఏర్పాటు చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే జానంపల్లి అనిరుద్ రెడ్డి తీవ్రంగా కృషి చేశారు. అందుకు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సైతం ఆమోదించడం పట్ల జడ్చర్ల వాసులు అభినందనలు తెలియజేస్తున్నారు. వాస్తవానికి గత ప్రభుత్వ హయాంలో జిల్లాకు మంజూరైన మెడికల్ కళాశాల, జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో ఏదో ఒకటి ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

## కుక్కల దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు



**ప్రజాపక్షం / వీపనగండ్ల:**తన ఇంటి ముందు తోటి చిన్నారులతో కలిసి ఆటలాడుకుంటున్న ఓ చిన్నారిపై కుక్కలు విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చి ఘటన బుధవారం ఉదయం వీపనగండ్ల మండల కేంద్రంలో చోటు చేసుకుంది. తూముకుంట గ్రామానికి చెందిన కడతల విజయ్ నాగమణిలు తమ కూతురు గీతికతో కలిసి పుట్టినిల్లు అయిన వీపనగండ్ల గ్రామానికి వేసవి సెలవుల నిమిత్తం వచ్చినట్లు గీతిక ఇంటి వద్ద తోటి పిల్లలతో ఆటలాడుకుంటుండగా పెంపుడు కుక్కతో పాటు వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేసి చిన్నారి గీతకను విచక్షణారహితంగా కొరకటంతో చిన్నారి గీతకు నడుముపై కాలుపై తీవ్ర గాయాలు అయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే తీవ్రంగా గాయపడిన బాలికను వీపనగండ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. మరింత మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రి సిబ్బంది అంబులెన్స్ ద్వారా బాలికను వనపర్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో వీధి కుక్కల బెడద ఎక్కువైందని, ద్విచక్ర వాహనాలకు అడ్డురావడంతో వాటిపై వెళ్లేవారు ప్రమాదాలు బారిన పడిన ఘటనలు కూడా ఉన్నాయని గ్రామస్తులు తెలిపారు. గ్రామ పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకొని కుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

# మహబూబ్‌నగర్ అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలి



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి:**మహబూబ్ నగర్ అభివృద్ధి లో భాగస్వామ్యులు కావాలి అని సీనియర్ సిటిజన్స్ ఫోరం సభ్యులకు పిలుపునిచ్చారు. మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి. మహబూబ్ నగర్ పట్టణం లోని, మెట్టుగడ్డ లో 10 లక్షల రూపాయల జనరల్ ఫండ్ నిధులతో నిర్మించనున్న సీనియర్ సిటిజన్స్ ఫోరం సమావేశ మందిరం భవనానికి భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్దిష్టమైన ప్రణాళికలతో విజన్ 2047 ను అమలు చేస్తున్నారని, వారి అడుగుజాడల్లో నడుస్తూ మన మహబూబ్ నగర్ ను కూడా తెలంగాణ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. 2047 వరకు మన మహబూబ్ నగర్ ఎలా ఉండాలి ఏఏ అభివృద్ధి పనులు చేయాలి అని ఓ నిర్దిష్టమైన ప్రణాళిక ల తోటి ముందుకు సాగుతున్నామని ఆయన చెప్పారు. శాశ్వతమైన అభివృద్ధి అంటే అన్ని రకాల విశ్వవిద్యాలయాలు, రోడ్లు, వైద్యం, డ్రైనేజీ లతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించినప్పుడే సాధ్యం అని అన్నారు. దీర్ఘకాలిక లక్ష్యం తోటి మన మహబూబ్ నగర్ ను కార్పొరేషన్ గా మార్చుకొని మన గౌరవం పెంచుకున్నామని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అర్బన్ డెవలప్మెంట్ ద్వారా ఇచ్చే నిధులను ఎక్కువ తెచ్చుకొని మన మహబూబ్ నగర్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసుకోవచ్చు అని ఆయన అన్నారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా తాగునీటి కోసం 220.94 కోట రూపాయలు మన మహబూబ్ నగర్ కార్పొరేషన్ కు మంజూరు అయ్యాయి అని ఆయన తెలిపారు. మహబూబ్ నగర్, భూత్పూర్, జడ్చర్ల ఒక క్లస్టర్ గా 736 కోట్ల రూపాయల తో ప్రాజెక్టు తయారు చేశామని, భవిష్యత్తులో అద్భుత నగరంగా ట్రై సీటి తయారు చేస్తామని ఆయన తెలిపారు. మహబూబ్ నగర్ ను ఎడ్యుకేషన్ హబ్ గాను, ట్రాన్స్ పోర్ట్ హబ్ గాను, మెడికల్ హబ్ గా తీర్చిదిద్దడం, ఉత్తమమైన జీవన విధానంతో పాటు మన పిల్లలకు ఉపాధి అవకాశాలు మెరుగు పరచడానికి ఫౌండేషన్ వేస్తున్నామని, ఉత్తి మాటలు చెప్పడం కాదు అభివృద్ధి చేసి చూపిస్తాం అని ఆయన స్పష్టం చేశారు. . ఆక్స్ ఫర్డ్ లాంటి సంస్థల ద్వారానే ప్రపంచానికి తెలిసింది అని, అలాగే ఎన్నో వేల సంవత్సరాలైనా నలందా ఖ్యాతి తరిగిపోలేదని ఆయన చెప్పారు. మహబూబ్ నగర్ బస్ స్టేషన్ ను ఇంటర్ స్టేట్ టెర్మినల్‌గా చేసుకోవడానికి ముఖ్యమంత్రికి వివరించడం జరిగిందని, వారు సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.మహబూబ్ నగర్ లో ఉన్న మెడికల్ సదుపాయాలు కూడా మెరుగు పరచడానికి కృషిచేస్తున్నాని ఆయన చెప్పారు. గతంలో మన మహబూబ్ నగర్ 140 మున్సిపాలిటీలలో ఒకటిగా ఉండేదని, ఇప్పుడు అదే మహబూబ్ నగర్ కార్పొరేషన్ గా 16 కార్పొరేషన్ లలో ఒకటిగా అభివృద్ధి చెందిందని, మహబూబ్ నగర్ అభివృద్ధికి విజన్ 2047 మాస్టర్ ప్లాన్ తయారు చేసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మా రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మ ణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ , తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్‌ల దిక్సూచి సురవరం

### సురవరంకు నివాళులర్పించిన టియుడబ్ల్యుజె(ఐజెయు) నాయకులు



**ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి:** సురవరం ప్రతాపరెడ్డి జీవితం జర్నలిస్ట్‌లకు దిక్సూచి లాంటిదని టియుడబ్ల్యు (ఐజెయు) నాయకులు అన్నారు. సురవరం ప్రతాపరెడ్డి జయంతిని పురస్కరించుకొని టియుడబ్ల్యూజే (ఐజెయు) వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి డి. మాధవరావు ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐజెయు నాయకులుమాట్లాడుతూ గోలకొండ పత్రికను స్థాపించి నిజాం నిరంకుశత్వాన్ని ప్రజలకు తెలియజేసిన ధైర్యశాలి , కలం వీరుడు సురవరమని కొనియాడారు. జాగీరుదారుల దోపిడి, భూస్వాముల ఆదిపత్యం, హింస, దుర్భరదారిద్ర్యం, క్రూరమైన శిక్షలు, బానిసత్వం , నిర్బంధ వసూళ్లు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు సంకేళ్లు ఇవీ, నిజాం నిరంకుశ పాలనకు ఆనవాళ్లని అన్నారు. అటువంటి విపత్కర పరిస్థితుల్లో నిద్రాణమైన తెలుగుజాతిని తట్టి లేపేందుకు ఉవ్వెత్తున ఎగసిన కలం కెరటం సురవరం ప్రతాపరెడ్డి అని చెప్పారు. నిస్వార్థ రాజకీయ నాయకుడిగా , పలు సంస్థల స్థాపకుడిగా, సారస్వత భగీరథుడిగా సురవరం చేసిన కృషి ఎనలేనిదని అన్నారు. మహిళా విద్య కోసం, బిసి హాస్టల్ ల ఏర్పాటులో, దళిత చైతన్యానికి కీలకంగా వ్యవహరించారని అన్నారు. 1952లో వనపర్తి తొలి శాసన సభ్యునిగా ఎన్నికై వనపర్తి కీర్తిని నలు దిశలా వ్యాపింపజేశాడని అన్నారు. సుర వరం జీవితాన్ని జర్నలిస్టులు ఆదర్శంగా తీసుకోవాలని సూచి ంచారు. పట్టణ ప్రధాన కార్యదర్శి ,తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది: కలెక్టర్



**ప్రజాపక్షం / శ్రీరంగాపురం :**రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందని రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి రైతులకు భరోసా ఇచ్చారు. బుధవారం ఉదయం శ్రీరంగాపూర్ మండలంలోని శేరిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లుతో కలిసి సందర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన టార్పాలిన్‌లు అందుబాటులో ఉన్నాయని, వర్షానికి వడ్లు తడిచిపోకుండా కప్పి ఉంచాలని తెలియజేశారు. లారీల కొరత లేదని, తేమ శాతం 17 వరకు ఉన్నా వెంటనే తూకం వేసి లారీల్లో ఎక్కించాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. హమాలిల కొరత లేకుండా చూసుకోవాలని ధాన్యం తరలింపు వేగంగా జరగాలని సూచించారు. నైరుతి రుతుపవనాలు రాష్ట్రానికి 15 రోజులు ముందుగా రావడం వల్లరైతులు కొంత ఇబ్బందులకు గురవుతున్నారని , ఈ వాతావరణ మార్పుకు అనుగుణంగా రైతులు సైతం పంట కోతలు త్వరగా ప్రారంభించి కొనుగోలు కేంద్రాల్లో తూకం చేసే వరకు వడ్లు తడిచిపోకుండా టార్పాలిన్‌లలు కప్పి ఉంచాలనిరైతులను సూచించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై అధికారి విశ్వనాథ్ , శ్రీరంగాపూర్ తహసీల్దార్ రాజు, రైతులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# రాజీవ్ యువవికాసం, ఇందిరమ్మ ఇండ్లపథకాలపై సమీక్ష

### జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశమందిరంలో బిసి, ఎస్సి, మైనార్టీ, ట్రైబల్‌కార్పొరేషన్, ఎంపిడిఓలు, మున్సిపల్ కమీషనర్లు సంబంధిత శాఖల అధికారులతో రాజీవ్‌యువవికాసం, ఇందిరమ్మ ఇండ్లు, పథకాలలబ్దిదారుల వివరాలపై జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజీవ్‌యువవికాసం స్కీమ్‌ద్వారా దశలవారిగా లబ్దిచేకూరేలా ప్రణాళికరూపొందించి జూన్ 2న లబ్దిదారులకు మంజూరుపత్రాలు పంపిణీచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాజీవ్‌యువవికాసం యూనిట్ల గ్రౌండింగ్ ఏర్పాట్లను సిద్దంచేయాలని సూచించారు. స్వయం ఉపాధి యూనిట్ల ప్రారంభోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. యూనిట్లన్ని గ్రౌండింగ్‌అయ్యేలా లక్ష్యాన్ని నిర్ధేశించుకుంటూ స్థాని ఎమ్మెల్యేల సహకారంతో లబ్దిదారుల యూనిట్లను అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల జాబితాపై మండలాలవారిగా కలెక్టర్ సమీక్షించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని, అధికారులు ప్రణాళికబద్ధంగా పనిచేసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచేలా అధికారులు కృషిచేయాలని సూచించారు. లబ్దిదారులు మండలంలో ఏర్పాటుచేసిన ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను సందర్శించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించా రు.

**ధాన్యం తరలింపు రవాణాకు అధికారులు అత్యంతకీలకంగా వ్యవహరించాలి**

నాగర్‌కర్నూల్ జిల్లాలో చివరిదశలో ఉన్న వరికొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అధికారులను కొనుగోలు నిర్వాహకులను ఆదేశించారు. బుధవారం అదనపుకలెక్టర్ చాంబర్‌లో రెవెన్యూ, పౌరసరఫరాల, రవాణాశాఖల అధికారులు, మిల్లర్లు, లారీ అసోసియేషన్ సభ్యులు, అదనపు కలెక్టర్ పి.అమరేందర్‌తోకలిసి వరిధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమావేశం నిర్వహించారు.

**ప్రభుత్వనిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలి:**

ప్రభుత్వం నిర్దేశించిన ఇళ్లనమూనామేరకు లబ్దిదారులు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ లబ్దిదారులకు సూచించారు. బుధవారం నాగర్‌కర్నూల్ నియోజకవర్గం తిమ్మాజిపేట మండలంలోని ఇప్పలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి లబ్దిదారుని రేణుకభర్త రాములు నిర్మిస్తున్న ఇంటినిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు.

**వరి కొనుగోలుకేంద్రాన్ని తనిఖీచేసిన కలెక్టర్ :**


నాగర్‌కర్నూల్ నియోజకవర్గం తిమ్మాజిపేట మండలం మరికల్ గ్రామంలో నిర్వహిస్తున్న వరికొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ ఆకస్మికంగా సందర్శించారు. గ్రామాలలోని ధాన్యం కొనుగోలుకేంద్రాలలో ధాన్యం సేకరణ, రవాణా తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు.

## స్పెషల్ డ్రైవ్ బ్లాక్ ఫిల్మ్ వాడకంపై కఠిన చర్యలు

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:**జిల్లా పోలీసు అధికారి డి.జానకి, ఐ.పి.ఎస్ ఆదేశాల మేరకు బుధవారం మహబూబ్‌నగర్ పట్టణంలో ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో కార్లపై నిషేధిత బ్లాక్ ఫిల్మ్ వాడకంపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భగవంత్ రెడ్డి నేతృత్వంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు. తనిఖీల్లో భాగంగా కారు డోర్ అద్దాలకు బ్లాక్ ఫిల్మ్ వాడుతున్న కార్లను గుర్తించి వాటిపై చట్టరీత్యా జరిమానాలు విధించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భగవంత్ రెడ్డి మాట్లాడుతూ మోటరు వాహనాల చట్టం, ఆర్‌టిఎనిబంధనల ప్రకారం కార్ల డోర్ అద్దాలకు బ్లాక్ ఫిల్మ్ వేయడం నేరం. ఇది ప్రజల భద్రతకు హానికరం బ్లాక్ ఫిల్మ్ వలన వాహనాలలో కూర్చున్న వారిని వెలుపల నుండి చూడలేకపోవడం వల్ల అనేక నేరాలు జరుగుతున్నాయి. అందువల్ల ప్రజలందరూ ఈ నిషేధాన్ని పాటించాలి ఎవరైన బ్లాక్ ఫిల్మ్ వాడితే వారిపై చర్యలు తప్పవు అని హెచ్చరించారు. జిల్లా ట్రాఫిక్ పోలీసులు ప్రజల్లో సురక్షిత డ్రైవింగ్ అలవాట్లను పెంపొందించడానికి ఈ తరహా తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. జిల్లా ప్రజలకు విజ్ఞప్తి బ్లాక్ ఫిల్మ్ ను వాహనాలపై వాడకండి ట్రాఫిక్ నియమాలను పాటించండి భద్రత మీ చేతుల్లో ఉంది.




# మహబూబ్‌నగర్ .. సరస్వతీ పుత్రుల నిలయం



### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కితాబు

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:**మహబూబ్‌నగర్ సరస్వతి పుత్రుల నిలయమని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ నవరత్నాలు ఆధ్వర్యంలో టెట్ మరియు డిఎస్సీ పరీక్ష కోసం కోచింగు తీసుకుంటున్న 250 మంది అభ్యర్థులకు టెట్ మరియు డిఎస్సీ మెటీరియల్స్ ను క్యాంపు కార్యాలయంలో ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో పది సంవత్సరాలు విద్యావ్యవస్థ నిర్వీర్యం అయ్యిందని, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలు నింపకుండా కాలయాపన చేశారని, కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదని ఆయన మండిపడ్డారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు బిఇడి, డిఇడి పూర్తి చేసి టెట్ డిఎస్సీకి కోచింగు తీసుకునేందుకు ఆర్థిక పరిస్థితులు అనుకూలించక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అందుకే టెట్ , డిఎస్సీ కోసం హైదరాబాద్ ఫ్యాకల్టీ చేత ప్రత్యేక ఉచిత కోచింగు ఇప్పించడం జరిగిందని ఆయన తెలిపారు.రానున్న టెట్ డిఎస్సీ పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించి, జీవితంలో స్థిరపడాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడాచైర్మన్ లక్ష్మ ణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, గుండా మనోహర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో పట్టణం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి:** వర్షాకాలంలో పట్టణం పరిశుభ్రత గా ఉంచేలా వార్డ్ అధికారులు వార్డ్‌లలో పారిశుద్ధ్య నిర్వహణ సమర్థంగా నిర్వహించాలనిజిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. బుధవారం మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మున్సిపల్ వార్డు అధికారులకు ఏర్పాటు చేసిన దిశానిర్దేశం కార్యక్రమ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ వార్డు అధికారులు ప్రభుత్వ పథకాల అమలులో వారి వార్డులలో వారిదే కీలక పాత్ర అని ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం, రేషన్ కార్డులు వంటివి వార్డులలో వార్డు అధికారులే పరిశీలించాలని. ప్రతి రోజు ఉదయమే మీ వార్డుకు చేరుకుని చెత్త సేకరించడానికి సిబ్బంది వస్తున్నారో లేదో గుర్తించాలని, తడి, పొడి చెత్త వేరుగా సేకరిస్తున్నారా, ప్రజలు చెత్తను వేరు చేసి ఇస్తున్నారా లేదా పది ఇండ్ల లోని వారికి అడిగి తెలుసుకుని వారి వివరాలు రాసుకోవాలని. చెత్త సేకరించే వారు రానట్లయితే పై అధికారులకు తెలియజేయాలని అన్నారు. కాలువలను ఎప్పుడూ శుభ్రం చేస్తున్నది, ఎంత మంది కాలువలు శుభ్రం చేయడానికి వస్తున్నారు. వంటివి పరిశీలించాలని. ఎవరైనా సిబ్బంది రాకుంటే జవాన్ కు తెలియజేయాలని లేదా పై అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. వార్డులలో తాగునీరు ఎన్ని రోజులకు, ఎప్పుడెప్పుడు వస్తుందో లైన్ మెన్ ద్వారా తెలుసుకోవాలని, ఒక పది ఇండ్ల లోని వారిని తాగునీరు గురించి అడిగి తెలుసుకోవాలని కలెక్టర్ అన్నారు. రోడ్ల పై, కాలువలలో చాలా చోట్ల చెత్త, ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలతో నిండి ఉంటున్నాయని, వాటిని శుభ్రం చేసేలా వార్డు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, నాళాల్లో చెత్త చేరకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, కూలడానికి ఉన్న పాత ఇండ్లు, పాఠశాలలను గుర్తించి వారిని కమ్యూనిటీ సెంటర్లలో ఉండాలని. మున్సిపల్ పర్మిషన్ లేకుండా ఎవరైనా నిర్మాణాలు చేస్తున్నట్లయితే వారి వివరాలను అధికారుల దృష్టికి తీసుకు రావాలని అన్నారు. వార్డులలో ఎవరైనా కొత్తగా ఇల్లు కట్టుకుంటున్నట్లయితే వారికి ముందు వైపు కొంత భాగం వదిలి కట్టుకోవాలని తెలిపారు. ప్రాపర్టీ ట్యాక్స్, వాటర్ ట్యాక్స్ వంటివి పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. వార్డులలో మున్సిపల్ పార్కులువుంటే వాటిని అప్పుడప్పుడు తనిఖీ చేయాలని, పార్క్ పచ్చగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, పార్కును ఎవరు ఆక్రమించిన వార్డు అధికారులు పై అధికారులకు సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు. వార్డు లలో ఎంత మందికి తాగునీరు నల్ల కనెక్షన్ లేదో తెలుసుకోవాలని. ప్రతి వార్డు అధికారులకు వారి వార్డులో ఒక ఆఫీస్ వార్డు అధికారి కార్యాలయం వార్డు నంబర్ ఉండే బోర్డును ఏర్పాటు చేసి అందులో ఒక , కుర్చీలు, రిజిస్టర్లు, ఇతర సామాన్లు పెట్టుకొనుటకు బీరువా ఏర్పాటు చేయాలని కమిషనర్లకు తెలిపారు. మున్సిపల్ శాఖ ద్వారా వచ్చిన వంద రోజుల యాక్షన్ ప్లాన్ ను అందరూ అధికారులు వంద శాతం అమలు చేయాలని కలెక్టర్ అన్నారు. ఫ్రైడే డ్రై డే వంటి కార్యక్రమాలను నిర్వహించాలని. వార్డు అధికారి వారి వార్డు కు వెళితే వార్డు లోని ప్రజలు వార్డు అధికారి అని గుర్తుపట్టాలని ఆ విధంగా ప్రతి రోజు పనిచేయాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మహబూబ్ నగర్ పాలక సంస్థ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జడ్చర్ల, మున్సిపల్ కమిషనర్ భూత్పూర్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులు, వార్డు అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఫోకస్

# కళారంగం

## నాటకం.. ఓ కళ.. ఓ ప్రేరణ







నాటకం సర్వజనీయం, సర్వకాలీనం. ప్రాముఖ్యత కలిగిన ప్రాచీన కళల్లో నాటక కళ ఒకటి. ఇది కళ మాత్రమే కాదు... ప్రజలకు ప్రేరణ కూడా. రంగస్థల కళ అనేది మానవ సమాజంలో అతి పురాతనమైన కళారూపాల్లో ఒకటి. మాటలు, భావాలు, శరీర భాష, సంగీతం, నృత్యం మొదలైన ఎన్నో కళారూపాల సమ్మిళితంగా ఇది రూపుదిద్దుకుంది. ఆది మానవుడు తన జీవితంలో జరిగిన సంఘటనలను, భయాలను, ఆశలను, దేవతల పూజలను అనుకరిస్తూ నాట్య రూపంలో పరిణతమైందని చరిత్రకారులు అంటున్నారు. రంగస్థల కళా రూపాన్ని గ్రీకు నాటకాల నుండి మొదలు పెట్టినా, అది భారతదేశంలో నాట్యశాస్త్రం ద్వారా ఇంకా శాస్త్రీయంగా అభివృద్ధి చెందింది. శతాబ్దాల క్రితమే ఉన్న నాటక కళ, స్వతంత్రంగానే ఎదిగింది. దాదాపుగా ఒకే కాలంలో పాశ్చాత్య దేశాల్లోనూ, భారతదేశంలోనూ నాటక ప్రక్రియ మొదలయ్యింది. కాలాన్ని బట్టీ, ప్రదేశాన్ని బట్టీ, సంస్కృతిని బట్టీ నాటకం రూపం మారుతుందేగానీ అంతర్లీనంగా దాని మూల సూత్రం మాత్రం ఒక్కటే. అందువల్లే నాటకం బహుళాదరణ పొందిన రంగస్థల ప్రక్రియగావిరసిల్లుతుంది. ప్రస్తుతమున్న నాటకం కాలక్రమేణా రూపం మార్చుకుంటూ విశ్వజనీయమయ్యింది. ఇటీవల కాలంలో కనుమరుగవుతున్న నాటక రంగాన్ని కాపాడుకోవాల్సిన ప్రతి కళాభిమానిపైనా ఉంది. ప్రపంచవ్యాప్తంగా అనేక రూపాలలో నాటకాన్ని ప్రభుత్వాలు, ప్రజలు సమష్టిగా ప్రోత్సహించాలి. ప్రజలకు నాటక ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలి. విస్తృత స్థాయిలో నాటక సంస్థలకు ప్రోత్సహించడంలో ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలి. నాటకరంగాన్ని అభివృద్ధి చేయడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలి. మానసిక ఉల్లాసంకోసం నాటకాన్ని ఆస్వాదింపజేయడం అవసరం. అదే విధంగా నాటకం ద్వారా పొందుతున్న మానసిక ఉల్లాసాన్ని ఇతరులతో పంచుకోవడం కూడా తక్షణావసరమే. ప్రాంతాలు, భాషలు, మతాలు, కులాల పేరుతో మారణహోమాలు కొనసాగుతున్న ఈ రోజుల్లో, సంస్కృతుల మధ్య వారధిగా రంగస్థలాన్ని మలచాలి. శాంతి, సమరసతకు రంగస్థలాన్ని మాధ్యమంగా ఉపయోగించాలి. ఎందుకంటే, రంగస్థల కళ సామాజికంగా ఎంతో ప్రభావవంతమైన సాధనం. ఇది ప్రజల హృదయాల్లో మార్పు తీసుకురాగలుగుతుంది. అణచివేత, అన్యాయాలను బహిర్గతం చేస్తుంది. ప్రేమ, శాంతి, మానవతా విలువలను వ్యాప్తి చేస్తుంది. అయితే, నేటి డిజిటల్ యుగంలో రంగస్థల కళ కొంతవరకు చెదరిపోయిన పరిస్థితిలో ఉంది. టెలివిజన్, సినిమా, ఒటిటి మాధ్యమాలు ప్రజలను ఆకర్షిస్తున్నాయి. అయినా, రంగస్థల కళ ప్రత్యేకంగా నిలుస్తుంది, ఎందుకంటే:
ఇది ప్రత్యక్ష అనుభూతిని కలిగిస్తుంది. కళాకారుడు, ప్రేక్షకుడు నేరుగా పరస్పర బంధాన్ని ఏర్పరుచుకుంటారు. సామాజిక సమస్యలను రియలిస్టిక్‌గా, తక్షణంగా ప్రతిబింబించగలిగే శక్తి ఉంది. నాటకాలను ప్రోత్సహించడం ద్వారా స్థానిక సంస్కృతి పరిరక్షణ జరుగుతుంది. యువతలో అభినయ శక్తి, సామాజిక అవగాహన పెరుగుతుంది. ప్రస్తుతం రంగస్థల కళలో ప్రయోగాత్మక నాటకాలు, స్ట్రీట్ థియేటర్, ఇంటరాక్టివ్ థియేటర్, సోషియోపొలిటికల్ థియేటర్ వంటి రూపాలు అభివృద్ధి చెందుతున్నాయి. వీటిని ప్రోత్సహించాలి. అప్పుడే రంగస్థలానికి కొత్త ఊపిరి. నాటకాలకు సరైన గుర్తింపు... నిజమైన గౌరవం.

## ప్రేక్షకులపై బలమైన ముద్ర..




'ఇంటరాక్టివ్ థియేటర్' ప్రేక్షకులపై బలమైన ముద్ర వేస్తుంది. ఇది ఒక సజీవమైన, శక్తివంతమైన ధోరణి. ఇందులో ప్రేక్షకులు కేవలం చూడడానికే కాకుండా, నాటక ప్రదర్శనలో ప్రత్యక్షంగా పాల్గొనే అవకాశం ఉంటుంది. ఇది ప్రేక్షకుడిని ఒక పాత్రధారుడిగా మార్చే నూతన రంగస్థల శైలి. ఇది ఒక ప్రయోగాత్మక రూపం. ఇందులో ప్రేక్షకులు కథనంలో మమేకమవుతారు. తమతమ అభిప్రాయాలు వెల్లడిస్తారు. కథలో... కథనంలో మార్పులు చేస్తారు. ఈ ప్రక్రియలో ప్రేక్షకులు నేరుగా పాత్రలతో మాట్లాడగలగడం విశేషం. అందుకే, ప్రేక్షకుల సూచనలతో కథకు వేర్వేరు ముగింపులు ఉండవచ్చు. అలాగే, ప్రేక్షకుల స్పందనల ఆధారంగా నటులు తమ అభినయాన్ని మలచుకుంటారు. స్థిరమైన స్క్రిప్ట్ లేకపోవడంతో, నటులు పరిస్థితుల్ని బట్టి స్వేచ్ఛగా స్పందించవలసి ఉంటుంది. ఫోరమ్ థియేటర్ అనేది ఇంటరాక్టివ్ థియేటర్‌లో ఒక భాగం. దీనిని ఆగస్టో బోయల్ అభివృద్ధి చేశాడు. సామాజిక అన్యాయంపై కథ చూపించి, ప్రేక్షకుల నుంచి పరిష్కార సూచనలు తీసుకోవడం ఈ శైలికి ప్రత్యేకం. ఇమ్మెన్సివ్ థియేటర్‌లో ప్రేక్షకులు ఒక ప్రదేశంలో తిరుగుతూ, కథలో భాగమైనట్లు అనుభూతి చెందుతారు. అమెరికాలో అత్యంత ప్రసిద్ధమైన, ప్రజాదరణ పొందిన 'స్లీప్ నో మోర్' నటకాన్ని ఇందుకు ఉదాహరణ. కథ ఎలాంటి మలుపులు తిరగాలో... ఏ విధంగా ముగియాలో ప్రేక్షకులే నిర్ణయిస్తారు. ప్రేక్షకులు కథపై అభిప్రాయం తెలపడం, పాత్రలను తాత్కాలికంగా స్వీకరించడం... ప్రదర్శించడం గొప్ప అనుభూతినిస్తుంది. విద్యార్థుల ఆలోచనా శక్తి పెరగడానికి, సామాజిక మార్పుకు ఈ విధానం ఎంతగానో ఉపయోగపడుతుంది. సామాజిక చైతన్యం కలిగించేందుకు, పాఠశాలలు, కాలేజీలు, గ్రామాల్లో చర్చలకు వేదికగా ఈ కళారూపాన్ని ప్రదర్శిస్తారు. మానసిక చర్చ, భావోద్వేగ వికాసం కోసం, సామాజిక సమస్యలపై పరిష్కార మార్గాల అన్వేషణ కోసం కూడా ఇది ఉపయోగపడుతుంది. అయితే, పూర్తి నియంత్రణ లేకపోవడం వల్ల కథ అసలు లక్ష్యం పక్కనపడే ప్రమాదం ఉంది. కథనం వివిధ దిశలకు విస్తరించి, మూల భావాన్ని మింగేసే ప్రమాదం లేకపోలేదు. నైపుణ్యంలోని నటులు ఉంటే, సమయస్ఫూర్తితో స్పందించకుంటే, నాటకం నవ్వులపాలవుతుంది. నాటకీయ నిర్మాణంలో అనిశ్చితి ఏర్పడుతుంది. అందుకే, ఇలాంటి ప్రదర్శనలకు అన్ని విధాలా సంసిద్ధులై ఉండాలి. ఆచితూచి వ్యవహరించాలి. సదరు నాటకం ప్రాథమిక లక్ష్యానికి దూరంగా వెళ్లకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తపడాలి.

## దృశ్యాన్ని అనుభూతిగా మార్చే ఇన్‌స్టలేషన్ ఆర్ట్





ఒక దృశ్యాన్ని అనుభూతిగా మార్చడం అనేది సులభం కాదు. అయితే, అలాంటి ప్రయత్నం 20వ శతాబ్దం మధ్య కాలం నుంచి క్రమంగా అభివృద్ధి చెందుతూ, ఒక ప్రత్యామ్నాయ కళారూపంగా ఎదిగింది. ఇది పర్యావరణం, దృశ్యాన్ని అనుభూతిగా మార్చే ప్రయత్నం చేస్తుంది. ప్రేక్షకుడిని కళాకృతిలో భాగస్వామిగా మారుస్తుంది. స్థూలంగా చెప్పాలంటే, ఇది శిల్పకళ, వాస్తుశిల్పం, ధ్వని, వీడియో, లైటింగ్, ప్రత్యక్ష వస్తువులు, స్థల ప్రాముఖ్యత వంటి అనేక అంశాలను కలగలిపిన సమగ్ర కళారూపం. ఇందులో ప్రదర్శన స్థలం కళాకృతిలో భాగమే అవుతుంది. ఆ గదిలో, ఆ ప్రదేశంలో మాత్రమే అర్థవంతంగా ఉంటుంది. ప్రేక్షకుడు లేదా సందర్శకుడు ఈ కళను చూడడమే కాదు... వినేలా, స్పర్శించేలా, అందులో నిడచేలా రూపొందిస్తారు. అయితే ఇవి శాశ్వత రూపాలు కావి. కొన్ని రోజులు లేదా కొన్ని నెలలు మాత్రమే ఉంటుంది. ప్రొజెక్షన్‌లు, స్పీకర్లు, వెలుతుర్లు, వీడియోలు మొదలైన ఆధునిక మాధ్యమాలను ఉపయోగిస్తారు. నిరసన, గుర్తింపు, గుర్తుచేసుకోవడం వంటి భావాలను సృష్టించేందుకు ఇన్‌స్టలేషన్ ఆర్ట్ మెరుగైన విధానం. ఉదాహరణకు యాయోయి కుసామా (Yayoi Kusama) 'ఇన్ఫినిటీ రూమ్స్' అనేవి మనస్సు లోతుల్లోకి తీసుకెళ్లే అనుభూతిని కలిగిస్తాయి. అధికార దుర్వినియోగం, మానవ హక్కుల గురించి స్పందిస్తాయి. భారత మూలాలున్న ఈ బ్రిటిష్ కళాకారుడు అనిష్ కపూర్ విస్తృతస్థాయి శిల్పాలు, స్థలఆధారిత కళలతో ప్రపంచ ప్రఖ్యాతిని ఆర్జించాడు. వలస కార్మికులు, వనరుల దోపిడీ, పర్యావరణ సమస్యలు వంటి సామాజిక అంశాలపై ఇన్‌స్టలేషన్ ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. పర్యావరణ నాశనాన్ని తెలియజేసేలా నీటిలో మునిగిన గృహ నిర్మాణాల ప్రదర్శన... పింక్ బుట్టలు, గుడ్డ బొమ్మలు ఉపయోగించి నిర్బంధిత మాతృత్వాన్ని సూచించే ప్రదర్శన వంటివి ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కళారంగంలో విప్లవాత్మక మార్పులను మోసుకొచ్చిన ఇన్‌స్టలేషన్ ఆర్ట్స్‌పై విమర్శలు లేకపోలేదు. కళా విలువ లేకుండా, ఆలోచన మాత్రమే ఉందంటూ కొందరు విమర్శిస్తున్నారు. అర్థం పట్టుకోలేకపోతే తికమకపెట్టే అనుభూతి మాత్రమే మిగులుతుందని మరికొందరి వ్యాఖ్య. పాత లేదా తక్కు కింద పారేయాల్సిన వస్తువులను యథాతథంగా తిరిగి వినియోగించడం వల్ల వ్యర్థాల సమస్య... పర్యావరణ నష్టం తప్పవన్న వాదన కూడా ఉంది. ఏదిఏమైనా ఇన్‌స్టలేషన్ ఆర్ట్ అనేది ప్రత్యామ్నాయ కళలలో ఒక శక్తివంతమైన రూపం. ఇది దృశ్యాన్ని ఊహను మించిపోయేలా చేసి, కళను 'వీక్షించడాన్ని' కాదు, 'అనుభవించడాన్ని' చేస్తుంది. శబ్దం, వెలుగు, దృశ్యాలు – అన్నిటిని కలిపి ఒక విప్లవాత్మక మానసిక ప్రేరణగా రూపొందే ఈ కళ, భావావేశంతో కూడిన ప్రత్యామ్నాయ ప్రకటనగా నిలుస్తోంది.



---

## ఉపాధి కూలీలను ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులపై చర్యలు

బికెఎంయు జిల్లా కార్యదర్శి చింతకుంట్ల వెంకన్న డిమాండ్



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి :** మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలో ఉపాధి కూలీలను మస్టర్లు వేయకుండా, డబ్బులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం(బికెఎంయు) జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకుంట్ల వెంకన్న డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని సంతులాల్‌బోడ్ గ్రామంలో బికెఎంయు మండల మహాసభ బిచ్చనాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉపాధి కూలీలకు పనులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని ఆయన ఆరోపించారు. సంవత్సరానికి 200రోజులు పనిదినాలు కల్పించి రోజుకు రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. పనులు చేసిన ఉపాధి కూలీలకు తక్షణమే డబ్బులు చెలించాలని డిమాండ్ చేశారు. తొర్రూర్ డివిజన్ కేంద్రంలో జూన్ 8న వ్యవసాయ కార్మిక సంఘం మహబూబాబాద్ జిల్లా 3వ మహాసభలు జరుగనున్నట్లు ఆయన తెలిపారు. నిరంతర వ్యవసాయ, ఉపాధి హామీ కార్మికులు, రైతాంగం, పేద ప్రజల కోసం పోరాటాలు చేసే వ్యవసాయ కార్మిక సంఘాన్ని ఆదరించాలని ఆయన కోరారు. సమావేశంలో బికెఎంయు జిల్లా అధ్యక్షుడు కట్టెబోయిన శ్రీనివాస్, సిపిఐ మండల కార్యదర్శి సారిక శ్రీనివాస్, నాదెండ్ల పద్మ, నాయకులు గంగరబోయిన రాజు, కాంతమ్మ, రవి తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి : పల్లా నర్సింహారెడ్డి



**ప్రజాపక్షం/దేవరకొండ :** ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సిపిఐ దేవరకొండ మండల కౌన్సిల్ సమావేశం జక్కా మాధవరెడ్డి అధ్యక్షతన పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ వర్షాలు వస్తున్నందున కల్లాల్లో వడ్లు ఇంకా ఉన్నాయని , తక్షణమే అధికారులు స్పందించి లారీలు, హమాలీలను ఎక్కువగా పంపించి రైతులకు ఎలాంటి నష్టం లేకుండా ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలన్నారు. మిల్లర్లు తాలు పేరుతో ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడం లేదని, రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా కలెక్టర్ స్పందించాలని ఆయన కోరారు. వానాకాలం ప్రారంభమైన సందర్భంగా వ్యవసాయానికి సంబంధించి రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని, నకిలి విత్తనాలు అరికట్టాలన్నారు. రైతు బంధు పడని రైతులకు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి, కార్యవర్గ సభ్యులు వెంకట్రాములు రాంరెడ్డి, యాదయ్య, గోవర్ధన్, యాదయ్య, లింగమయ్య, పుల్లయ్య, శ్రీను, మల్లేష్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## శత్రుదేశంపై విజయం సాధించిన రీతిలో ఎన్‌కౌంటర్‌పై స్పందించడం అమానుషం

మావోయిస్టులను చంపి సంబురాలా..!
ఆపరేషన్ కగార్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** శత్రుదేశంపై విజయం సాధించిన రీతిలో మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై ప్రధానమంత్రి మోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షాలు స్పందించడం అమానుషమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. చత్తీస్‌గడ్ ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ సంఘటనను సుప్రీంకోర్టు సుమోటగా తీసుకోవాలని కోరారు. బుధవారం జనగామలోని సిపిఐ కార్యాలయంలో గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్‌లో జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశానికి కావాటి యాదగిరి అధ్యక్షత వహించగా తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో జరుగుతున్న ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణకు కేంద్రప్రభుత్వం ముందుకు రాకుంటే సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటాగా తీసుకోవాలన్నారు. సిపిఐ మావోయిస్టు కేంద్ర కార్యదర్శి నంబాల ఎన్‌కౌంటర్‌పై అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయని, ఈ వయస్సులో అడవిలో ఉన్నారా.. లేక పట్టుకెళ్లి మట్టుపెట్టారా అనే సందేహాలు ఉన్నాయన్నారు. ఆపరేషన్ కగార్ మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు వరకు జరిగిన ఎన్‌కౌంటర్‌పై విచారణ చేయాలని కోరారు. స్థానిక ప్రజల హక్కులు, వనరుల దోపిడికి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్న వారిని ఏకపక్షంగా ఎన్‌కౌంటర్‌ల పేరుతో చంపడం సమంజసం కాదన్నారు. ఇది శాంతిభద్రతకు విఘాతం కలిగించే చర్యగా చూడాల్సి వస్తుందన్నారు. 2026 మార్చి 31 వరకు నక్సలైట్లను అంతమొందిస్తామని లక్ష్యంగా పెట్టుకొని మరీ ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని ఆరోపించారు. శాంతి చర్చలకు తాము సిద్ధమని మావోయిస్టులు ప్రకటించినా కేంద్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఎన్‌కౌంటర్లకు పాల్పడుతుందని మండిపడ్డారు. ఇది దేశంలో ప్రజల ప్రజాస్వామిక హక్కులకు విఘాతం కలిగించే అంశమన్నారు. వీట్టన్నింటిని పరిగణలోని తీసుకొని సుప్రీంకోర్టు న్యాయ విచారణ చేపట్టవలసిన అవసరం ఉందన్నారు. బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కమ్యూనిస్టులు ప్రజలను చైతన్య పరచాలని తక్కెళ్లపల్లి పిలుపునిచ్చారు.

### జూన్ 3,4 తేదీల్లో సిపిఐ జిల్లా మహాసభలు

జూన్ 3,4 తేదీల్లో సిపిఐ జనగామ జిల్లా మహాసభలు నర్మెట మండలంలో జరగనున్నాయని పార్టీ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి తెలిపారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని, మహాసభలకు డెలిగేట్స్ రావడంతో పాటు పలు అంశాలపై తీర్మానాలు చేయాలన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిలర్ సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాసు, నాయకులు చామకూర యాకూబ్, కె యాదగిరి, చొప్పరి సోమయ్య, జువారి రమేష్, రావుల సదానందం, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేసేలా ఉద్యమాలు

సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేసేలా సిపిఐ ఉద్యమిస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు అన్నారు. బుధవారం సిపిఐ నాయకులు మామిడి వెంకయ్య, సుందరి పద్మ, జక్కుల రమేష్ అధ్యక్షతన పట్టణ మహాసభ హుజూర్‌నగర్‌లోని సిపిఐ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలు, కార్మికులు, రైతుల పక్షాన వారి సమస్యల పరిష్కారానికి సిపిఐ ఉద్యమిస్తుందన్నారు. దేశ స్వాతంత్ర్యోద్యమంలో, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో సిపిఐది కీలకపాత్ర అని గుర్తుచేశారు. మొదటి నుంచి నిజమైన దేశభక్తులు కమ్యూనిస్టులే అని పలు సందర్భాల్లో నిరూపించుకున్నారన్నారు. దేశంలో బిజెపి అనుసరిస్తున్న విధానాలపై అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్తేల నారాయణరెడ్డి, ధూళిపాళ ధనుంజయ్ నాయుడు, పోకల వెంకటేశ్వర్లు, దేవరం మల్లీశ్వరీ, మండవ వెంకటేశ్వర్లు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్‌యాదవ్, కొప్పోజు సూర్యనారాయణ, సోమగాని కృష్ణ, మామిడి నర్సయ్య, జడ వెంకన్న, ఇందిరాల వెంకటేశ్వర్లు, చక్రాల స్టాలిన్, చెన్నగాని సైదులు, పొనుగుపాటి వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.



## ప్రశ్నిస్తే దేశద్రోహులుగా చిత్రీకరిస్తున్న మోదీ

ట్రంప్ చెబితే పాకిస్థాన్‌తో యుద్ధాన్ని నిలిపేశారు
సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంత్‌రావు





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** యుద్ధానికి వ్యతిరేకమని కమ్యూనిస్టులు చెబితే తమని దేశద్రోహులుగా చిత్రీకరిస్తున్నా మోదీ, ట్రంప్ చెబితే మాత్రం పాకిస్థాన్‌తో యుద్ధాన్ని నిలిపివేసి ద్వంద వైఖరిని ప్రదర్శించాడని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు అన్నారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీపరిధి లోని వరంగల్ క్రాస్ రోడ్‌లో గల మా కాంప్లెక్స్‌లోని పోటు ప్రసాద్, వెంపటి సూర్యనారాయణ మీటింగ్ హాల్లో శాఖ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. డిబిఆర్ సర్కిల్లోని అరుణ పతాకాన్ని సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు. పహల్గాం ఉగ్రదాడిలో మృతులతో పాటు ఇటీవల పలు కారణాలతో మృతి చెందిన సిపిఐ సభ్యులు, సానుభూతిపరులకు సంతాపాన్ని వ్యక్తం చేశారు. సురేందర్, సైదిరెడ్డి, రాజు, యోబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో భాగం హేమంతరావు మాట్లాడారు బిజెపి మతతత్వ రాజకీయాలు చేస్తూ ప్రజల్లో విద్వేశాలు రెచ్చగొడుతుందన్నారు. దేశాన్ని హిందూ దేశంగా మార్చాలనే కాంక్షతో క్రిస్టియన్, ముస్లింలను శత్రువులుగా చిత్రీకరిస్తుండడం ఎంతవరకు సమంజసమన్నారు. గిరిజన హక్కుల కోసం పోరాటం చేసే నక్సలైట్లను ఆపరేషన్ కగార్ పేరుతో హతమార్చడం సరికాదన్నారు. వారేమి దేశ ద్రోహులు కాదని, వారి కోసమని గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదన్నారు. బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఎదురు తిరుగుతారనే నక్సలైట్లను ఎరివేస్తున్నారని ఆయన ఆరోపించారు. లౌకికి దేశంలో అధికారకాంక్షతో సాగిస్తున్న కేంద్ర చేస్తున్న దమనకాండ ప్రమాదకరమైందని ఆందోళన వ్యక్తం చేశారు. సోషలిజంతో సమసమాజాన్ని స్థాపించాలనుకునే కమ్యూనిస్టులు బిజెపి చేస్తున్న మత రాజకీయాలపై ప్రజలను చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. అనంతరం సభలో 28,29,30 డివిజన్లకు సంబంధించిన సిపిఐ, ఎఐవైఎఫ్, మహిళా సమాఖ్య నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్ రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, యడ్లపల్లి శంకరయ్య, బానోత్ రాంకోటి, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, గిరిజన సమాఖ్య నాయకులు పాల్తీయ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## పార్టీ పటిష్ఠతకు పనిచేసే కార్యకర్తలకు సముచిత స్థానం : బక్కని



ప్రజాపక్షం/షాద్‌నగర్: పార్టీ పటిష్ఠత కోసం పనిచేసే కార్యకర్తలు ఎల్లప్పుడు సముచిత స్థానం లభిస్తుందని టిడిపి పోలీట్‌బ్యూరో సభ్యులు, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు అన్నారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టిడిపి మహానాడుకు తెలంగాణ రాష్ట్రం తరుపున బక్కని నర్సింలు హాజరయ్యారు. ఈ సందర్భంగా బక్కని నర్సింలు మాట్లాడుతూ పార్టీలో క్రమశిక్షణతో పని చేస్తే మంచి గుర్తింపు రావడంతోపాటు ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం నుండి తనకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ ఈ అవకాశం కల్పించడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

## నిరుపేదలకు ఇళ్ళస్థలాలు అందించండి
సిపిఐ రాష్ట్రసమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు



ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : నిరుపేదల ఇండ్ల స్థలాల కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్రసమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు సూచించారు. పేదలకు సొంతింటి కలలు నేరవేర్చాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సిపిఐ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి మండల తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ సోషల్ ఎకనామికల్ సర్వే నిర్వహించి ప్రతి నిరుపేదకు న్యాయం జరిగేలా చూసి ఇళ్ళ స్థలాలు ఇచ్చి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ శేరిలింగంపల్లి కార్యదర్శి రామకృష్ణ, జిల్లా సమితి సభ్యులు చందుయాదవ్, ఎఐటియుసి మండల అధ్యక్షులు తుపాకుల రాములు, సిపిఐ నాయకులు వెంకటస్వామి, నారయణ, చంద్రమ్మ, బంగారి తదితరులు పాల్గొన్నారు.

## డిపో మేనేజర్‌ను బదిలీ చేయాలని ధర్నా



ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : కార్మికులను వేధింపులకు గురిచేస్తున్న ఇబ్రహీంపట్నం ఆర్‌టిసి డిపో మేనేజర్‌ను తక్షణమే బదిలి చేయాలని ఆర్‌టిసి జెఎసి ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం డిపో ఎదుట బుధవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఆర్‌టిసి డిపోలో ప్రశాంతంగా విధులు నిర్వహిసున్న డ్రైవర్, కండక్టర్లపై డిపో మేనేజర్ వివక్షత చూపుతున్నారని విమర్శించారు. కార్మికులకు సంబంధం లేని ఘటనలపై మేనేజర్ జోక్యం చేసుకోని ఇంక్రిమెంట్లు కట్ చేయిచడం, చార్జీ మెమోలు జారీ చేయటమే కాక బస్సు కిలోమీటర్లు, పని భారం పెంచటం వంటి సమస్యలతో మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులను మానసిక ఇబ్బందులకు గురి చేస్తే ప్రయాణికులను ప్రశాంతంగా గమ్యం చేర్చలేమని వారు వాపోయారు. కార్యక్రమంలో ఆర్‌టిసి జెసిసి కార్మికులు పాల్గొన్నారు.

## త్రివిధ దళాలకు సంఘీభావంగా ర్యాలీ




ప్రజాపక్షం/షాద్‌నగర్: ఆపరేషన్ సింధూర్‌ను విజయవంతం చేసిన త్రివిధ దళాలకు సంఘీభావంగా బుధవారం షాద్‌నగర్‌లో సిటిజన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో రాజకీయ పార్టీల కతీతంగా అన్నివర్గాల ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమంలో నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందె బాబయ్య, కక్కునూరి వెంకటేష్ గుప్తా, జె.నరసింహా, బోయ కుర్మయ్య, రఘురాం, హన్మంత్, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, కత్తి చంద్రశేఖర్ అప్ప, పసుపుల ప్రశాంత్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలు అమలు చేస్తున్నాం



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రణాళిక బద్ధంగా అమలు చేస్తున్నామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్ వివరించారు. బుధవారం ఫరూక్‌నగర్ మండల పరిధిలోని మధురాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్‌గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎంతో కృషి చేస్తున్నారని, కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి భార్గవ్‌కుమార్, మాజీ జడ్పిటిసి పి.వెంకట్‌రాంరెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు అమర్నాథ్‌రెడ్డి, కృష్ణయ్య, బాబిత, గ్రామ కార్యదర్శి వంశీ, నేతలు బుచ్చిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, మధుసూదన్ గౌడ్, రమేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సందీప్, పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతతో కల్వర్ట్ పనుల పూర్తి
హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశం



ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని లింగంపల్లి అండర్ బ్రిడ్జి పనులను అధికారులతో కలిసి బుధవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షకాలపు దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులను నాణ్యతతో చేపట్టి త్వరగా అందుబాటులోకి తీసుకొనిరావలని తెలిపారు. తదుపరి గోపి చెరువును పరిశీలించి చెరువులో మురుగు నీరు చేరకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. చెరువు నుంచి వచ్చే నీరు రోడ్లపై నిలువకుండా పనులను నిర్వహించాలన్నారు. శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ గోపి చెరువులో గుర్రపు డెక్కను తొలగింపు చర్యలను చేపట్టి ప్రజలకు దోమల బెడద నుండి విముక్తి చేయాలని, దోమలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని రంగనాథ్ దృష్టికి తీసుకెళ్ళగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపి అధికారులకు గుర్రపు డెక్కను వెంటనే తొలగింపు చర్యలు చేపట్టాలని అదేశాలిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, జిహెచ్‌ఎంసి ఇంజనీరింగ్ అధికారులు డిఇ ఆనంద్, ఎఇ భాస్కర్, జిహెచ్‌ఎంసి సిబ్బంది, హైడ్రా అధికారులు, నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# వర్షాకాల ప్రణాళికకు సిద్ధం కావాలి

నాణ్యమైన నీటి సరఫరాకు చర్యలు చేపట్టాలి
హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్




ప్రజాపక్షం/హైదరాబాద్ : ముందస్తు వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటామని హైదరబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో వర్షాకాల ప్రణాళిక 90 రోజుల కార్యచరణ, పురోగతిలో ఉన్న పలుప్రాజెక్టు పనులపై బుధవారం జలమండలి ఎండి.అశోక్ రెడ్డి, ఈడి.మయాంక్ మిట్టల్ ఉన్నతాధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జలమండలిలో చేపట్టిన వివిధ ప్రాజెక్టులు, పురోగతిలో ఉన్న ప్రాజెక్టులు, బోర్డులోని వివిధ విభాగాలు, పనితీరు, హైదరాబాద్ నగరానికి సరఫరా చేస్తున్న వివిధ ప్రాజెక్టులు, ఎస్‌టిపిలు, రెవెన్యూ ఆదాయ వ్యయాలతో పాటు భవిష్యత్తు ప్రణాళికను ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎండి అశోక్ రెడ్డి వివరించారు. జలమండలి అధికారులు, సిబ్బంది 90రోజుల కార్యాచరణ విజయవంతం చేసి, సీవరేజ్ ఓవర్‌ఫ్లో ఫిర్యాదులను 30శాతం తగ్గించడంపై ఎండితో సహా అందరిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ 90 రోజుల ప్రణాళికలో చేపట్టిన ఇంకుడు గుంతల నిర్మాణం పురోగతిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో డైరెక్టర్లు మొదలుకుని క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. తాగునీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సీవరేజ్ రహదారులపై సీవరేజ్ ఓవర్ ఫ్లో కాకుండా ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమయంలో కలుషిత నీరు సరఫరా అయ్యే అవకాశం ఉన్నందున తగిన మోతాదులో క్లోరిన్ ఉండేలాగా చూసుకోవాలన్నారు. జలమండలి, జిహెచ్‌ఎంసి 146 వాటర్ లాగింగ్ పాయింట్లను గుర్తించిందని, వాటిని ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. జలమండలి ఆర్థిక పరిస్థితిపై ఆరాతీసిన మంత్రి రెవెన్యూ పెంచుకోవడానికి, నీటి వృధాను అరికట్టడానికి, లీకేజీలను అరికట్టడానికి, ప్రజలలో నీటి వృధా తగ్గించేలా అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన, వివిధ శాఖలనుంచి జలమండలికి రావాల్సిన బకాయిలపై ముఖ్య మంత్రితో మాట్లాడుతామని ఈ సందర్భం గా హామీ ఇచ్చారు. ప్రభుత్వం బోర్డు తన కాళ్లమీద తాను నిలబడేలాగా అన్నీ రకాలుగా చేయుతనిస్తామన్నారు. హైదరాబాద్ నగరం వేగంగా అభివృద్ధి చెందుతోందని, దానికనుగుణంగా తాగునీరు, మురుగునీటి శుద్ధిపై తమ ప్రభుత్వం ప్రత్యేకదృష్టి పెట్టిందన్నారు. అందులో భాగంగా రూ.7వేల కోట్లతో గోదావరి ఫేస్ 2,3 ప్రాజెక్టును పనులను చేపట్టిందని, మురుగునీటి శుద్ధి కోసం 39 ఎస్‌టిపిలను నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని మంత్రి చెప్పారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే రానున్న 30ఏళ్ల వరకు నీటి అవసరాలకు భరోసా ఉంటుందని మంత్రి తెలిపారు. ప్రజలకు నీటిసరఫరా, మురుగునీటి సమస్యలపై జలమండలి కస్టమర్‌కేర్ 155313కు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఆపరేషన్ డైరెక్టర్ అమరేందర్‌రెడ్డి, కోర్సిటీ సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు, మేనేజర్లు, ట్రాన్స్‌మిషన్ అధికారులు పాల్గొన్నారు.

## వీధి దీపాల నిర్వహణకు టెండర్లు
జిహెచ్‌ఎంసి స్థాయీసంఘం ఆమోదం



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎల్ఇడి వీధి దీపాల నిర్వహణ కోసం టెండర్లు ఆహ్వానించేందుకు జిహెచ్‌ఎంసి స్థాయీసంఘం సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఎల్ఇడి వీధి దీపాల నిర్వహణపై మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన ప్రత్యేక స్థాయీసంఘం సమావేశం బుధవారం సాయంత్రం జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో జరిగింది. టెండర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు వీధి దీపాల నిర్వహణను చేపట్టడానికి అన్ని ఏర్పాట్లను వీధి దీపాల కొనుగోలు, మరమ్మతులను జోనల్ కమిషనర్ల ద్వారా చేపట్టేందుకు సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ కర్ణన్ తెలిపారు. సమావేశంలో స్థాయీ సంఘం సభ్యులు ఎం.డి బాబా ఫసియుద్దీన్, బొంతు శ్రీదేవి, బానోతు సుజాత, సయ్యద్ మిన్హాజుద్దీన్, సమీనా బేగం, అబ్దుల్ వాహెబ్, డాక్టర్ ఆయేషా హుమేరా, మహమ్మద్ సలీం, మహాలక్ష్మి రామన్‌గౌడ్, సిఎన్ రెడ్డి, కమిషనర్ ఆర్‌వికర్ణన్, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, హేమంత్ సహదేవ్ రావు, అపూర్వ చౌహాన్, ఎన్.రవికిరణ్, వెంకన్న అదనపు కమిషనర్ సత్యనారాయణ, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## కబ్జా చెర నుంచి మైత్రేయినగర్ పార్కుకు విముక్తి




ఘట్‌కేసర్‌లో రహదారుల ఆక్రమణలు తొలగింపు



ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రజావాణి ఫిర్యాదులపై హైడ్రా చర్యలు తీసుకుంది. ఘట్‌కేసర్‌లోని జయపురి కాలనీలో రహదారులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించారు. శేరిలింగంపల్లి మండలం చందానగర్‌లోని మైత్రేయినగర్‌లో ఎకరం పార్కుకు కబ్జాల చెర నుంచి విముక్తి కల్పించింది. ఈ పార్కు స్థలాన్ని ప్లాట్లుగా చేసి కబ్జాదారుడు విక్రయించేయగా, వివాదం వివిధ కోర్టులలో విచారణలో ఉంది. కోర్టులలో పార్కు స్థలం అని నిర్ధారణకు వచ్చినా లిటిగేషన్‌లతో వివాదం పరిష్కారం కాకుండా కబ్జాదారుడు ప్రయత్నాలు కొనసాగిస్తున్నాడని ప్రజావాణి ఫిర్యాదులో మైత్రేయినగర్ కాలనీ ప్రతినిధులు మొరపెట్టుకున్నారు. లేఔట్ ప్రకారం పార్కు ఉండటంతో హైడ్రా చర్యలు చేపట్టింది. ఎకరం పార్కును కబ్జాల చెర నుంచి విముక్తి చేయించి, రూ.40 కోట్ల ఆస్తిని కాపాడారంటూ స్థానికులు హైడ్రాకు ధన్యవాదాలు తెలిపారు.

ఘట్‌కేసర్ ఔటర్ రింగ్ రోడ్డు పక్కన సర్వీస్ రోడ్డుకు ఆనుకొని సర్వే నెంబరు 559, 563, 566 లో జయపురి కాలనీ పేరిట 1968లో లేఔట్ ఏర్పాటు చేశారు. ఇందులో 20 ఏళ్ల క్రితం కొందరు ప్లాట్లు కొనుగోలు చేశారు. లేఔట్ ఉండగా దానిని వ్యవసాయ భూమిగా చూపించి పాసు పుస్తకాలను సృష్టించారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసి ఆ పాసు పుస్తకాలను రద్దు చేయించారు. దీంతో ప్లాట్ల యజమానులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు హైడ్రా అధికారులు రహదారులకు అడ్డుగా నిర్మించిన ప్రహరీలను తొలగించారు.

### వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించిన రంగనాథ్

వరద ముంపు ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ పర్యటించారు. మంగళవారం కురిసిన వర్షానికి నీట మునిగిన రామచంద్రపురం ప్రాంతంలో క్షేత్ర స్థాయి పరిశీలించారు. పూడుకుపోయిన కాలువలను తెరిపించడంతో పాటు బైపాస్‌గా వరదకాలువ తవ్వకాలను ఆయన పరిశీలించారు. చందానగర్ లింగంపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్య సురభి కాలనీ ప్రారంభంలో ఉన్న ఆర్‌యుబి వద్ద నీరు నిలిచే ప్రాంతాలను పరిశీలించారు. డ్రైయిన్‌లలో చెత్త పేరుకుపోకుండా చూడాలని అధికారులను రంగనాథ్ ఆదేశించారు.

## సమన్వయంతో వన మహోత్సవానికి ఏర్పాట్లు





రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి : జిల్లాలో వన మహోత్సవానికి ప్రణాళికలు సిద్ధం చేసుకొని అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తూ విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశం మందిరంలో సంబంధిత అటవీ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, వ్యవసాయ శాఖలకు చెందిన అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వన మహోత్సవం సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో విరివిగా మొక్కలు నాటెందుకు సిద్ధం కావాలని తెలిపారు. జిల్లా స్థాయి విత్తన టాస్క్‌ఫోర్స్ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎరువులను అధిక ధరలకు అమ్మితే, కల్తీ ఎరువులను సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమస్యలు ఉంటే రైతులు జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ టెలిఫోన్ నెంబర్, 9398304336లో సంప్రదించాలని కోరారు. వర్షాకాలం సమీపిస్తు న్న తరుణంలో రైతులు నాణ్యమైన విత్తనాల ఎంపికలో జాగ్రత్త వహించాలని కలెక్టర్ తెలిపారు. సమావేశాలలో జిల్లా పరిషత్ సిఇఒ కృష్ణారెడ్డి, జిల్లా అటవీ శాఖ అధికారి సుధాకర్‌రెడ్డి, డిఆర్ డిఎ పిడి శ్రీలత, డిపిఒ సురేష్ మోహన్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి నర్సింహ రావుతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.


### జిల్లాలో 16,617 మందికి ఇందిరమ్మ ఇండ్లు

జిల్లాలో ఇప్పటివరకు 16,617 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, ఇంకా 839 మందికి మంజూరు ఇవ్వాల్సి ఉందని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ వికాసం పథకాల అమలుపై సంబంధిత అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంజూరైన లబ్ధిదారుల ఇండ్ల గ్రౌండింగ్ వెంటనే చేపట్టాలని, ఇంకా గ్రౌండింగ్ కానీ మండల, మున్సిపల్ పరిధిలో అధికారులు చొరవ చూపి వారంలో అన్ని గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో బ్యాంకర్స్ తోపాటు పిడి డిఆర్డీఎ శ్రీలత, బిసి వెల్ఫేర్ బి.కేశురామ్, మైనార్టీ వెల్ఫేర్ కోట్ల నవీన్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## పేదలకు సొంతింటి కల తీర్చాలన్నదే లక్ష్యం
షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/కొత్తూరు/కొందుర్గు: ఇందిరమ్మ రాజ్యంలో సొంతింటి కల తీర్చాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా చివరి లబ్ధిదారుడి వరకు ఇస్తున్నామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం నందిగామ మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలకు శంకుస్థాపన చేయడంతోపాటు లబ్ధిదారులకు ధృవపత్రాలను అందజేశారు. ఇన్ముల్‌నర్వ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లతోపాటు మురిరాజ్ సంఘం భవన్, సిసిరోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని గుర్తు చేశారు. కార్యక్రమం లో జంగ నరసింహులు, హరినాథ్‌రెడ్డి, చలివేంద్రంపల్లి రాజు, కృష్ణారెడ్డి, మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, మంజుల తులసిరాంనాయక్, సుదర్శన్ గౌడ్, రాజు నాయక్, రూప్‌సింగ్, లక్ష్మణ్‌నాయక్, వెంకట్‌చారి, దేవేందర్, హన్మంత్‌గౌడ్, శ్రీను, గణేష్ తదితరులు పాల్గొన్నారు.




### అర్హులందరికీ ఇండ్లు
చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

షాబాద్: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. షాబాద్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇం దిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మెన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, సర్ధానగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మెన్ కావలి చంద్రశేఖర్, గుండాల అశోక్, కుమ్మరి చెన్నయ్య, జనార్థన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, కాజమీయా పటేల్, బోకుల లింగం, రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్‌టిఆర్ జయంతి





నివాళులర్పించిన మాజీఎంపి మధుయాష్కీ

ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన మహానుభావుడు నందమూరి తారక రామారావు అని కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ, ఎల్‌బి నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మధుయాష్కీ గౌడ్ అన్నారు. బుధవారం ఎన్‌టిఆర్ జయంతిని వనస్థలిపురం డివిజన్ పనామా చౌరస్తాలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నేలపాటి రామారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజల శ్రేయస్సు కోసం అనేక సంక్షేమ పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చిన ఘన చరిత్ర ఎన్‌టిఆర్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కుట్ల నరసింహ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌పాశం అశోక్‌రెడ్డి, బండిగారి శ్రీనివాస్, స్వర్ణ మాధవి, భీమిడి రామకృష్ణారెడ్డి, కృష్ణమూర్తి, దాము మహేందర్ యాద వ్, శ్రావణ్ గుప్తా, అంతటి శ్రీనివాస్ గౌడ్, రేణుగౌడ్, దు బ్బాక గోపాల్‌రెడ్డి, సత్యనారాయణ, మల్లికార్జున్ పాల్గొన్నారు.

**ఎన్‌టిఆర్‌కు బిఆర్‌ఎస్ నివాళి...** వనస్థలిపురం డివిజన్ పనామా చౌరస్తాలో ఎన్‌టిఆర్ విగ్రహానికి బిఆర్‌ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్తా, బిఎన్ రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, మాజీ మార్కెట్ డైరెక్టర్ అనిల్‌కుమార్ చౌదరి, మువ్వ సతీష్ కుమార్ చౌదరి, ఆనంద్ రాజ్, లగ్గాని శ్రీధర్ గౌడ్, కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




**షాద్‌నగర్:** షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని బివి రావు నగర్‌లో కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జయంతిని పురస్కరించుకొని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో షాద్‌నగర్ ముఖ్యకూడలిలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. అక్కడి నుంచి మహానాడుకు తరలివెళ్ళారు. కార్యక్రమంలో కమ్మసేవా సమితి షాద్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు పాతూరి వెంకట్‌రావు, మాజీ ఎంపిపి చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, బూర్గుల కుమార్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, మండల అధ్యక్షుడు వెంకటయ్య గౌడ్, తెలుగు యువత అధ్యక్షుడు ఎం.రమేష్, ఆనంతయ్య, కమ్మ సేవా సమితి నాయకులు బండారుపల్లి నాగేశ్వర్‌రావు, పాతూరి సత్యనారాయణ, పికపాక ప్రభాకర్, వసంతరావు, మలేశ్వర్‌రావు, నువ్వుల నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



**ప్రజాపక్షం/అల్వాల్ :** యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆయుర్వేద వైద్య అధికారి డాక్టర్ శైలజ అన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు నెల రోజుల ముందు నుంచే డివిజన్ బస్తీలలో ప్రతి ఒక్కరూ యోగ కార్యక్రమాలు నిర్వహించాలని ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతిరోజు ఉదయం,సాయంత్రం యోగా టీచర్లు జగన్ రెడ్డి, తేజస్విని అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనగ్, రాధిక , రేణుక ,అనురాధ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## క్యాన్సర్ స్క్రీనింగ్‌పై శిక్షణ శిబిరాలు

**ప్రజాపక్షం/అల్వాల్ :** మహిత స్వచ్ఛంద సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారి సహకారంతో ప్రభుత్వ ప్రైమరీ హాస్పిటల్ లో క్యాన్సర్ స్క్రీనింగ్ పై శిక్షణ శిబిరం మూడు రోజులుగా నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఎంహెచ్ఓ ఉమాగౌరి హాజరై మాట్లాడుతూ మహిళలు క్యాన్సర్ స్క్రీనింగ్ పై ముందుగా జాగ్రత్తలు తీసుకోవాలని 35 సంవత్సరాల దాటిన మహిళలందరూ పరీక్షలు నిర్వహించుకోవాలని ఆ మిషన్లను జాగ్రత్త గా వాడుకోవాలని తెలిపారు. అనంతరం డాక్టర్లకు, స్టాఫ్‌నర్స్ లకు క్యాన్సర్ స్క్రీనింగ్ మిషన్ వాడకంపై అవగాహన కల్పించారు. క్యాన్సర్ స్క్రీనింగ్ మిషన్‌లు కుషాయిగూడ అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ శోభా రాణి, డాక్టర్ శ్వేత, స్వర్ణలత, ఎన్జీవో బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.



## సెరినిటీ పాఠశాల విద్యార్థులకు సత్కారం

**ప్రజాపక్షం/నాగారం:** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సెరినిటీ పాఠశాలలో పదవ తరగతిలో అత్యుత్తమైన మార్కులు సాధించిన 13 మంది విద్యార్థులను శారదాంబ బ్రహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సత్కరించి చిరు సహాయాన్ని అందజేశారు. సమాజం నుండి ఏదైన సహాయం స్వీకరించినపుడు దానికి రెట్టింపు సహాయాన్ని తిరిగి సమాజానికి ఇవ్వాలని ప్రధాన కార్యదర్శి కాజ గంగాధరరావు అన్నారు. స్కూల్ కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి మాట్లాడుతూ శారదాంబ బ్రహ్మణ సేవా సంస్థ చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు రామకృష్ణ, రాంమోహన్‌రావు, హనుమంతరావు, రంగారావు, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు బాచుపల్లిలో కాంగ్రెస్ ర్యాలీ

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** గురువారం మేడ్చల్ జిల్లా బాచుపల్లిలో జరిగే జైహింద్ ర్యాలీకి కాంగ్రెస్ శ్రేణులు భారీ సంఖ్యలో హాజరు కావాలని మల్కాజిగిరి పార్లమెంటు ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పిలుపిచ్చారు. బుధవారం ఆర్‌కె నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ గురువారం బాచుపల్లి వివిఎన్‌రావు విజ్ఞాన్ జ్యోతి ఇంజనీరింగ్ కళాశాల నుండి కెజిఆర్ కన్వెన్షన్ వరకు ఈ ర్యాలీ జరుగుతుందని, అనంతరం కొలన్ గోపాల్‌రెడ్డి కన్వెన్షన్‌లో భారీ సభ జరుగుతుందని ఆయన తెలిపారు.



## మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** గత ఐదేళ్లుగా డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ పూర్తి చేసానని, మరే సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొని రావాలని గౌతంనగర్ కార్పొరేటర్ మేకల సునీతా రాము యాదవ్ అన్నారు. డివజన్‌లోని జ్యోతినగర్‌లో రూ.42 లక్షల వ్యయంతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను జిహెచ్‌ఎంసి మల్కాజిగిరి సర్కిల్ ఎఇ దివ్య జ్యోతితో కల్సి బుధవారం పరిశీలించారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని, సకాలంలో పూర్తి అయ్యేలా చూడాలని కోరారు. బిఆర్‌ఎస్ శ్రేణులు మేకల రాము యాదవ్, బైరు అనిల్, కృష్ణ గౌడ్, కిట్టు, సిద్దిరాములు, నర్సింగరావు, జ్యోతినగర్ కాలనీవాసులు,తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తీర్థయాత్రలకు ప్రత్యేక రైళ్లు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** తీర్థ యాత్రలు వెళ్లే తెలుగు రాష్ట్ర ప్రజల సౌకర్యార్థం రైల్వే శాఖ జూన్ 14 నుండి జూలై 13 వరకు రెండు ప్యాకేజీలుగా ప్రత్యేక రైళ్లను హైదరాబాద్ నుండి నడిపిస్తున్నారు. ఐఆర్‌టిసి జాయింట్ మేనేజర్ డిఎస్‌జిపి కిషోర్ దీనికి సంబంధించి వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. ప్యాకేజి1గా గంగా రామాయణ పుణ్యక్షేత్ర యాత్రలో వారణాసి(కాశి), అయోధ్య, నైమిశారణ్యం, ప్రయాగరాజ్, శృంగవర్పూర్, ప్రాంతాల దర్శనానికి గాను సాధారణ టికెట్ రూ.16,200, 3 ఎసి టికెట్ రూ.26,500, 2 ఎసి టికెట్‌రూ.35,000గా ఉంటుంది. ఈ యాత్ర సికింద్రాబాద్, భువనగిరి, జనగాం, కాజిపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, పలాస, బరంపూర్, భువనేశ్వర్‌ల మీదుగా ఈ ప్రత్యేక రైలు ప్రయాణిస్తుంది. ప్యాకేజి2గా ఐదు జ్యోతిర్లింగాల పుణ్య క్షేత్ర యాత్రలో ఉజ్జయిని(మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీమశంకర్, ఘృష్ణేశ్వర్, ఎల్లోరా, మోవ్, నాగ్పూర్ ప్రాంతాల దర్శనానికి గాను సాధారణ టికెట్ రూ.14,700, 3 ఎసి టికెట్ రూ.22,900, 2ఎసి టికెట్‌రూ.29,900గా ఉంటుంది. ఈ యాత్ర సికింద్రాబాద్, కామారెడ్డి, నిజామాబాద్, నాందేడ్, ధర్మాబాద్, ముద్దడ్, పూర్ణ మీదుగా ఉంటుంది. ఈ తీర్థయాత్రల ప్రత్యేక రైళ్లల్లో ఆయా పుణ్యక్షేత్రాలకు రైల్వే స్టేషన్‌ల నుండి ఉచిత ప్రయాణ సౌకర్యం, ఆయా ప్రాంతాల్లో హోటళ్లల్లో బస, ప్రతి రోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు, వాటర్ బాటిల్స్‌లను ఉచితంగా అంద చేయటంతో పాటు టూర్ ఎస్కార్ట్‌లు అందుబాటులో ఉంటారు. ఈ ప్రయాణానికి గాను ప్రయాణ బీమా సైతం కల్పిస్తున్నారు. ప్రతి రైలులో 718 ప్రయాణీకులు, వారికి కావల్సిన సౌకర్యాలను అందచేసేందుకు గాను ఇద్దరు కోఆర్డినేటర్లు, ప్రతి కోచ్‌లో ఒక సెక్యూరిటి గార్డు, సిసి కెమెరాల నిఘాతో కూడిన భద్రత ఉంటుందన్నారు. ఈ తీర్థయాత్రల ప్రత్యేక రైళ్లల్లో ప్రయాణీకులు 970136 0701, 9281030 712, 9281495845, 9281030749, 9281030 750 లను సంప్రదించటంతో పాటు ఇతర సమాచారానికి www.irctc tourism.com వైబ్‌సైట్ ద్వారా తెల్సుకొనే వీలుంటుందని జాయింట్ మేనేజర్ తెలిపారు.

# భారత్‌లో మొదటి జాతీయ పేపర్ ఎక్స్‌పో

### హైదరాబాద్‌లో జూన్ 6 నుంచి 8వ తేదీ వరకు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారతదేశంలో మొట్టమొదటి జాతీయ పేపర్ ఎక్స్‌పో హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లో జూన్ 6 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పాపైరస్ ఎక్స్‌పో ఎల్‌ఎల్‌పి సిఇఒ నిర్మల్ కుహాద్ తెలిపారు. ఈ వివరాలు తెలిపేందుకు బేగంపేటలోని ది ప్లాజాలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల్ కుహాద్ మాట్లాడుతూ మేము స్థాపించిన పేపర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొదటిసారిగా ఎక్స్‌పో నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా కాగిత వినియోగాన్ని ప్రోత్సహించడం, అభివృద్ధి చేయడం లక్ష్యమన్నారు. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో భారత్ ఒకటన్నారు. అయినా, కాగిత వినియోగం పరిమితంగానే ఉందన్నారు. ఆ పరిస్థితిని మార్చే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు.

మూడు రోజుల పాటు జరగనున్న ఈ ఎక్స్‌పోలో పేపర్ పరిశ్రమలోని అన్ని విభాగా లు పాల్గొంటాయన్నారు. ఇది దేశంలో అతి పెద్ద, సమగ్ర పేపర్ పరిశ్రమ సమావేశంగా నిలవనుందని చెప్పారు. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా సతియా మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అజయ్ సతియా, ఎమామీ పేపర్ మిల్స్ సిఎంఒ సౌమ్యాజిత్ ముఖర్జీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ (ఐఐపి) డిప్యూటీ డైరెక్టర్ నటరాజ్, ఎఫ్‌టిసిసిఐ అధ్యక్షుడు డాక్టర్ సురేష్ కుమార్ సింఘాల్, ప్రాంప్ట్ ప్యాకేజింగ్ సోహన్‌లాల్ దయామా, శ్రీ పేపర్ బోర్డ్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రుషభ్ షా, జానీ సేల్స్ డైరెక్టర్ అబైలి జానీ తదితరులు విచ్చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఎక్స్‌పోకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ (ఐఐపి), ఇండియన్ పల్ప్ అండ్ పేపర్ టెక్నికల్ అసోసియేషన్ (ఐపిపిటిఎ), ఫెడరేషన్ ఆఫ్ పేపర్ ట్రేడర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (ఎఫ్పిటిఎ) తదితర సంఘాల మద్దతు ఉందన్నారు.

భారత ప్రభుత్వ ఎంఎస్‌ఎంఇ మంత్రిత్వ శాఖ మద్దతుతో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శన ఈ రంగంలోని చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు బలాన్ని ఇవ్వనుందని చెప్పారు. దేశంలోని ప్రముఖ కాగిత తయారీదారులు వస్తున్నారన్నారు. గల్ఫ్‌దేశాలు, ఇతర దేశాల సందర్శకులు వస్తుండడం ద్వారా దీనికి అంతర్జాతీయ ప్రాముఖ్యత ఏర్పడిందన్నారు. భారతదేశంలో తయారవుతున్న, ఉపయోగించబడుతున్న కాగితంలో దాదాపు 80 శాతం రీసైకిల్ చేసిన మూలాల నుంచి వస్తుందన్నారు. ఈ వేదిక ద్వారా పర్యావరణానికి అనుకూలంగా అభివృద్ధి చెందుతున్న కాగిత పరిశ్రమను, దీని స్థిరమైన అభివృద్ధిలో పాత్రను హైలైట్ చేయడం మా లక్ష్యమన్నారు.

మూడు రోజులలో ఈ ఎక్స్‌పోలో 15,000 మందికిపైగా సందర్శించనున్నట్లు అంచనా అన్నారు. తిరుమల బాలాజీ పేపర్ ప్రైవేట్ లిమిటెడ్, హైపర్ ప్యాక్, శ్రీ అయ్యప్పన్ కో., ఎంఎల్‌ఎం ప్యాకేజింగ్, సోనా పేపర్స్ వంటి ప్రముఖ వ్యాపార సంస్థల కూడా హాజరవుతాయన్నారు.

# ఏటేటా పెరుగుతున్న విత్తనాల ధర, నకిలీ విత్తనాల దందా

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** పంటల సీజన్ ప్రారంభం కాబోతోంది. ఏటేటా విత్తనాల ధరలతో పాటు నకిలీ విత్తనా ల దందా సైతం పెరుగుతుంది. తక్కువ ధరకు నాణ్యమైన విత్తనాలు అంటూ వాటిని రైతులకు అంటగడుతున్నారు. అటువంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసు, వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఖరీఫ్ సాగుకు సై అంటున్న రైతులకు నాసిరకం విత్తనాల విక్రయాలకు కొందరు వ్యాపారులు రంగం సిద్ధం చేసుకున్నారు. గ్రామాల్లో ఉన్న నిరుద్యోగులను ఏజెంట్లుగా నియమించుకుని రైతులకు ఎరవేస్తున్నారు. జున్‌లో వానాకాలం సీజన్ ప్రారంభం కానుండడంతో ఈ దందా జోరందుకుంది. వికారాబాద్ జిల్లావ్యాప్తంగా 5063 లక్షల ఎకరాల్లో సాగు ప్రణాళిక సిద్ధం, 42.064 క్వింటాళ్ల విత్తనాల అవసరం ఉందని తెలుస్తుంది. వికారాబాద్ జిల్లాలో కొండగల్ మండల పరిధిలోని అన్నారంలో గతంలో ఒక ఇంట్లో నకిలీ విత్తనాలను పోలీసులు పట్టుకొని నిందితులపై కేసులు నమోదు చేసి జైల్‌కు వెళ్లి వచ్చిన తర్వాత కూడా తిరిగి వ్యాపారం కొనసాగిస్తున్నట్లు అరోపణలు వస్తున్నాయి. రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారులు కోరుతున్నారు. సరిహద్దు రాష్ట్రమైన కర్ణాటక నుంచి హైదరాబాద్, బీజపూర్ జాతీయ రహదారిమీదుగా జిల్లాని పలుగ్రామాలకు నకిలీ విత్తనాలు రవాణా చేస్తున్నారు. కర్ణాటక రాష్టంలోని గుర్మిట్కల్ ఓ ఎరువుల వ్యాపారి ఈ నకిలి విత్తనాల దందా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కర్ణాటకలోని కుష్టగిరి జిల్లాలోని ఓ జన్నింగ్ మిల్లు నుంచి తకువ ధరకు పత్తి విత్తనాలను కొనుగోలు చేసి ఆ విత్తనాలకు రంగులు కలిపి బ్రాండెడ్ కంపెనీ కవర్లలో ప్యాకింగ్ చేసి గ్రామాలకు సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వికారాబాద్ జిల్లాలో గతేడాది ఖరీఫ్ ప్రణాళికలో 5097 ఎకరాలలో పంటలసాగు అంచనా వేశారు. ఈసారి మాత్రం 5063 లక్షల ఎకరాల సాగు ప్రణాళికను రూపొందించారు. దీంతో గతేడాది ఖరీఫ్‌తో పోల్చితే 340180 ఎకరాల పంట తగ్గినట్లు కనిపిస్తుంది.

**కఠిన చర్యలు తీసుకుంటాం :** నకిలీ విత్తనాలు విక్రయించే వరిపై పిడి యాక్టు నమోదు చేసి జైలుకు పంపిచడం జరుగుతుందని జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి అన్ని పోలీస్ స్టేషన్ అధికారులను ఆదేశించడం జరిగింది అని తెలిపారు. రైతులను మోసంచేసే వారిపై నిఘా పెట్టాం అన్నారు. జాతీయ రహదారిపై తనిఖీలు చేస్తున్నాం. సమాజానికి హాని కలిగించే కల్తీ నకిలీ, నిషేధిత విత్తనాలు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకుంటం అని జిల్లా ఎస్‌పి తెలిపారు.

## ధాన్యం తడిసిన రైతులకు నష్టం వాటిల్లకుండా చర్యలు : కలెక్టర్ ప్రతీక్‌జైన్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** కలెక్టర్ కార్యాలయంలో వరి ధాన్యం సేకరణ ధాన్యాన్ని మిల్లర్లకు చేరవేయటం, రవాణా సదుపాయం వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్టంలో రుతుపవనాలు ముందగానే వచ్చినందున వర్షాలు కురియడం జరుగుతుందని, దీనివల్ల ధాన్నాన్ని అరబెట్టటం ఇబ్బంది అవుతుందన్నారు. తేమ శాతం ఎక్కువగా ఉన్నప్పటికి రైతులకు నష్టం వాటిల్లకుండా వరి ధాన్యాన్ని మిల్లర్లకు చేరవేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికి తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లర్లకు చేరవేయాలని అధికారులకు సూచించారు. సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డిఎంసిఎసి రాము, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ ధారూర్ వ్యవసాయ మార్కెట్ గిద్దంగి, పెద్దముల్ మండలం మంబాపూర్ వరి కొనుగోలు కేంద్రాలను ఆరబెట్టిన ధాన్యాన్ని కలెక్టర్ పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ రైతులకు నష్టం జరగకుండా ధాన్యాన్ని మిల్లులకు చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

## వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** ఉరేసుకుని వ్యక్తి మృతి చెందిన సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండి మల్లేష్(57) నివా సం లాల్‌గడిమలక్‌పేట, ప్రైవేట్ ఉద్యోగి కాగా గత కొన్ని రోజులుగా మల్లేష్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం



మధ్యాహ్నం బయటకు వెళ్లి వస్తాను అని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెదికినా ఫలితం లేదు. అలియాబాద్ నుంచి వెళ్లే దారిలోని నయార పెట్రోల్ బంక్ సమీపంలోని ఓపెన్ ప్లాట్‌లో వేపచెట్టుకు ఉరేసుకుని ఓ వ్యక్తి మృతి చెందాడని సమాచారం అందడంతో ఫిర్యాదురాలు వెళ్లి చూడటంతో ఉరేసుకుని మృతి చెందిన వ్యక్తి కొండి మల్లేష్‌గా గుర్తించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## సిపిఐ 4వ రాష్ట్ర మహాసభకు ఇంటింటి ప్రచారం : వి.ఎస్.బోస్

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** ఆగస్టు 19 నుండి 22 వరకు మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్‌లో జరగనున్న సిపిఐ 4వ రాష్ట్ర మహాసభకు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ తెలిపారు. బుధవారం ఇసిఐఎల్‌లోని రాజశేఖరరెడ్డి భవన్‌లో జిల్లా కార్యవర్గ సభ్యులు జి.దామోదర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన నూతనంగా ఏర్పడిన జిల్లా పార్టీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం చేపట్టాక పాలకులు ప్రజా సమస్యల పరిష్కారాన్ని నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పౌరహక్కుల ఉల్లంఘన చేస్తోందని, మతాలు, ప్రాంతాలు, కులాల మధ్య చిచ్చుపెట్టి ఓట్ల రాజకీయం చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర మహాసభలకు గాను జూన్ 4న ఆహ్వాన సంఘ కమిటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్ మాట్లాడుతూ సిపిఐ అన్ని వర్గాల ప్రజలకు అండదండగా ఉంటూ పోరాటం చేస్తుందన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డిజి సాయిలు గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.దామోదర్‌రెడ్డి, శంకర్, తోటపల్లి శంకర్, హరినాథరావు, స్వామి,శ్రీనివాస్, సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## కబ్జాకు గురైన స్థలాన్ని కూల్చివేసిన హైడ్రా అధికారులు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్ 559,563, 566లోని జయపురి కాలనీ గ్రామపంచాయతీ లే అవుట్‌గా రూపొంది కొన్ని రోడ్లను కబ్జాచేసి నిర్మించిన ప్రహరీ గోడలను హైడ్రా అధికారులు బుధవారం జెసిబిలతో కూల్చివేశారు. 1968లో గ్రామపంచాయతీ తాజా లే అవుట్‌గా రూపొందించి కొన్ని రోడ్లు కబ్జాకు గురికావడంతో ప్లాట్స్ ఓనర్స్ గత ఫిబ్రవరిలో హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా కమిషనర్ ఎవి రంగనాథ్ ఆదేశాల మేరకు జయపురి కాలనీ లే అవుట్‌ను సందర్శించి విచారణ చేపట్టిన హైడ్రా అధికారులు సైదులు, బాచిరెడ్డిలు రోడ్డుకు అడ్డంగా అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడలను కూల్చివేశారు. కబ్జాదారులపై విచారణ జరిపి వారిపై చర్యలు తీసుకుంటామని హైడ్రా అధికారులు తెలిపారు.

## ధాన్యం కొనుగోలు పక్రియ వేగవంతం


**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని పౌరసరఫరా శాఖ జిల్లా మేనేజర్ ఎల్ సుగుణబాయి సూచించారు. బుధవారం జిల్లాలోని ఏదులాబాద్, మాదారం, ప్రతాపసింగారం ప్రాంతాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని, కొనుగోలు కేంద్రాల్లో తగినంత సంఖ్యలో హమాలీలు ఉండేలా చూడాలని, అవసరమైన తేమ మీటర్లు, తూకం యంత్రాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వివరాలను వెంటవెంటనే ఆన్‌లైన్ పద్ధతిలో ట్యాబ్‌లో నమోదు చేస్తుండాలన్నారు.



# పలు ప్రాంతాల్లో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/అల్వాల్ :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా గొల్లగూడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కమాన్ వద్ద ఎన్టీ రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని స్థాపించి ఆంధ్రప్రదేశ్ ను ప్రపంచ స్థాయిలో గుర్తింపు ఉండేలా తీర్చిదిద్దారని, ఆయన హయాంలోనే రెండు రూపాయల కిలో బియ్యం వృద్ధులకు, వితంతువులకు పెన్షన్ ప్రవేశ పెట్ట డం



జరిగిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో శాంతమ్మ, వాసు, శంకర్, లక్ష్మణ్, అశోక్, తదితరులు పాల్గొన్నా రు.

**నాగారంలో :** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణ కాలనీలో ఎన్‌టిఆర్ 102 జయంతిని పురస్కరించుకుని 5వ వార్డు కంటెస్టెంట్ కౌన్సిలర్ కొండ సుజాత జంగారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ఎన్‌టిఆర్ విగ్రహనికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో నాయకులు అన్నంరాజు శ్రీనివాస్, దయాకర్‌రావు,ఆంజనేయులు,ఉదిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

**కుషాయిగూడలో:** చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడ బస్టాండ్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి టిడిపి నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్ రుద్రగోని రాంచందర్ గౌడ్, కెకె రావు, కె ప్రేమ్‌గౌడ్, ఆర్. నాథం, టి.బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

**దుండిగల్‌లో :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ బహదూర్ పల్లి వద్ద కమ్మ సంఘం తరపున నందమూరి తారకరామారావు విగ్రహానికి కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోలన్ హనుమంత్ రెడ్డి ఘన నివాళి అర్పించి శుభాకాంక్షలు తెలియజేశారు. పేద ప్రజలకు కూడు, గూడు, గుడ్డ అనే మూడు అవసరాలను తీర్చడమే తన జీవితాశయంగా భావించిన ధీరోదాత్తుడు ఎన్టీఆర్ అని, సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో ప్రజాస్వామ్యానికి కొత్త అర్థం చెప్పిన దార్శనికుడు. కమ్మ సంఘం అమోఘ నరేందర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు, అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

**నిజాంపేట్‌లో:** స్వర్గీయ ఎన్టీఆర్ ఆశయాల సాధనకు ప్రతిఒక్కరు పాటుపడాలని బిఆర్‌ఎస్ పార్టీ నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజవర్గం పరిధిలోని ప్రగతినగర్ కమాన్ వద్ద స్వర్గీయ ఎన్టీ రామారావు జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ



కార్పొరేషన్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్ కొలను వీరేందర్ రెడ్డిలు విచ్చేసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**చర్లపల్లి లో:** పేదల,బడుగు బలహీన వర్గాల పార్టీ తెలుగుదేశం అని చర్లపల్లి కంటెస్టెంట్ కార్పొరేటర్,టిడిపి ఫౌండర్ సభ్యులు రుద్రగోని రాంచందర్ గౌడ్ అన్నారు. విశ్వ విఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావు 102వ జయంతిని పురస్కరించుకుని చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి చౌరస్తాలో ఎన్‌టిఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు,అభిమానులకు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో రాగీరు సత్యనారాయణగౌడ్,కె ప్రేమ్‌గౌడ్, రాగీరు నాథం, కెకె రావు, సత్యంయాదవ్, ఉతిష్ణ, నందంగౌడ్,బాలకృష్ణ గౌడ్,సురేష్‌గుప్తా,టి బీరప్ప,కె కుమార్ తదితరులు పాల్గొన్నారు.



**ఘట్‌కేసర్‌లో :** తెల్లవారు జామునే ఎన్టీఆర్ ఘాట్‌కు వచ్చిన మాజీ సర్పంచ్ మల్కాజ్గిరి పార్లమెంట్ అడక్ కమిటి అధ్యక్షులు వేముల సంజీవ గౌడ్ ఎన్టీఆర్ ఘాట్‌లో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేముల సంజీవ గౌడ్ మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకులు దివంగత మాజీ ముఖ్యమంత్రి విశ్వవిఖ్యాత నటసార్వభౌమ స్వర్గీయ నందమూరి తారక రామారావు సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అనే నినాదాన్ని నిత్య శ్వాసగా చేసుకొని ప్రజల గుండెల్లో దేవుడిగా నిలిచారని ప్రతి అడుగు నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు.



# క్రీడ

## పంత్‌కు జరిమానా.. రూ.30 లక్షలు



లక్నో సూపర్ గెయింట్స్ కెప్టెన్ రిషబ్ పంత్‌కు .. 30 లక్షల జరిమానా విధించారు. ఐపీఎల్‌లో ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో లక్నో జట్టు స్లో ఓవర్ రేట్‌తో బౌలింగ్ చేసింది. ఈ నేపథ్యంలో లక్నో జట్టుకు ఫైన్ వేశారు. అయితే లక్నో ప్లేయర్లకు కూడా 12 లక్షల జరిమానా విధించారు. దీంట్లో ఇంపాక్ట్ ప్లేయర్ కూడా ఉన్నాడు. ఈ సీజన్‌లో ప్రవర్తనా నియమావళిని మూడో సారి లక్నో జట్టు ఉల్లంఘించినట్లు ఐపీఎల్ తన ప్రకటనలో తెలిపింది. అందుకోసమే పంత్‌కు 30 లక్షలు ఫైన్ వేసినట్లు చెప్పింది. లక్నో జట్టులోని మిగితా ఆటగాళ్లకు 12 లక్షలు లేదా 50 శాతం ఫీజులో కోత విధించనున్నారు. హై స్కోరింగ్ గేమ్‌లో ఆర్సీబీ జట్టు ఆరు వికెట్ల తేడాతో లక్నోపై విజయం సాధించింది. రిషబ్ పంత్ సెంచరీ చేసినా తమ జట్టుకు విక్టరీని అందించలేకపోయాడు. ఈ మ్యాచ్‌లో అతను 61 బంతుల్లో 118 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఆర్సీబీ ఈ గెలుపుతో క్వాలిఫయర్ 1కు వెళ్లింది. గురువారం చండీఘడ్‌లో ఆ జట్టు పంజాబ్ కింగ్స్‌తో ఆడనున్నది.

## ఫైనల్‌లో తలపడనున్న జట్లు

### పంజాబ్, ఆర్సీబీ, గుజరాత్, ముంబై.. ఐపిఎల్‌లో ఇలా?



ఐపిఎల్ 2025లో లీగ్ రౌండ్‌లో 70 మ్యాచ్‌లు పూర్తయ్యాయి. లీగ్ మ్యాచ్‌ల తర్వాత ప్లేఆఫ్స్‌కు 4 జట్లు నిర్ణయించబడ్డాయి. 58 మ్యాచ్‌ల వరకు ఎవరు ప్లేఆఫ్‌కు చేరుకుంటారని ఖచ్చితంగా చెప్పలేకపోయారు. కానీ దీని తర్వాత మే 18న జరిగిన డబుల్ హెడర్ అన్ని సమీకరణాలను పరిష్కరించిది. ఇప్పుడు క్వాలిఫయర్1, ఎలిమినేటర్ మ్యాచ్‌లు నిర్ణయించబడ్డాయి. మే 29న జరిగే మొదటి క్వాలిఫయర్‌లో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న రెండు జట్లు అంటే పంజాబ్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తలపడతాయి.

అదే సమయంలో మే 30న జరిగే ఎలిమినేటర్‌లో గుజరాత్ టైటాన్స్ ముంబై ఇండియన్స్‌తో తలపడనుంది. ఈ నాలుగు జట్లు ఇంతకు ముందు ప్లేఆఫ్‌కు చేరుకున్నాయి కానీ ఆర్సీబీ, పంజాబ్ కింగ్స్ ఎప్పుడూ టైటిల్ గెలవలేదు. ఈ రెండు జట్లు తమ మొదటి టైటిల్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ 2022లో టైటిల్‌ను గెలుచుకుంది. ముంబై ఐదు సార్లు టైటిల్‌ను గెలుచుకుంది. ఈ జట్లు ఇతంకు ముందు ఎప్పుడు ప్లేఆఫ్స్‌కు చేరుకున్నాయో, లీగ్ రౌండ్‌లో ఏ స్థానంలో ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించాయో తెలుసుకుందాం.

**1.పంజాబ్ కింగ్స్**

పంజాబ్ కింగ్స్ ప్లేఆఫ్స్‌కు చేరుకుంది ఇది మూడో సారి మాత్రమే. అంతకు ముందు ఆ జట్టు 2008, 2014లో ప్లేఆఫ్స్‌కు చేరుకుంది. 2008లో పంజాబ్ జట్టు పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలిచింది. 2014లో ఆ జట్టు మొదటి స్థానాన్ని దక్కించుకుంది. అయితే 2008లో పంజాబ్ సెమీఫైనల్స్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు చేతిలో ఓటమిని ఎదుర్కోవలసి వచ్చింది. అదే సమయంలో 2014లో ఫైనల్లో కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో జట్టు ఓటమిని ఎదుర్కోవలసి వచ్చింది. ఇప్పుడు 2025లో పంజాబ్ జట్టు మరోసారి అగ్రస్థానంలో నిలిచి ప్లేఆఫ్స్‌కు చేరుకుంది. ఈ సారి పంజాబ్ కింగ్స్ తన టైటిల్ కరువును అంతం చేసుకోగలదా లేదా అనేది చూడాలి. శ్రేయస్ అయ్యర్ గతంలో కేకేఆర్ జట్టు తరపున ఆడి టైటిల్ గెలుచుకున్నాడు. శ్రేయస్ అయ్యర్ వరుసగా రెండో ఏడాది టైటిల్ గెలుచుకోవాలని ప్రయత్నిస్తున్నాడు.

**2.రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు**

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు పదోసారి ప్లేఆఫ్స్‌కు చేరుకుంది. గతంలో ఆ జట్టు 2009, 2010, 2011, 2015, 2016, 2020, 2021, 2022, 2024లలో కూడా ప్లేఆఫ్స్‌కు చేరుకుంది. ఆ జట్టు 2009, 2011, 2016లలో రన్నరప్‌గా నిలిచింది. 2011లో ఆర్సీబీ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. 2016లో రెండో స్థానంలో నిలిచింది. 2009, 2015, 2021లో ఆ జట్టు మూడో స్థానంలో నిలిచింది. 2010, 2020, 2022, 2024లలో ఆ జట్టు నాల్గవ స్థానంలో నిలిచి ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించింది. ఇప్పుడు మరోసారి ఆర్సీబీ రెండో స్థానంలో నిలిచింది. కాబట్టి ఆర్సీబీ తమ మునపటి రికార్డును బ్రేక్ చేయాలనుకుంటోంది. ఫైనల్ కు చేరుకోవడంతో పాటు ఎలాగైనా ఈ సారి టైటిల్ ను గెలుచుకోవా లని గట్టి పట్టుదలతో ఉంది.

**3.గుజరాత్ టైటాన్స్**

గుజరాత్ టైటాన్స్ జట్టు 2022లో ఉనికిలోకి వచ్చింది. అప్పటి నుంచి నాలుగు సీజన్లలో ఈ జట్టు ప్లేఆఫ్స్‌కు చేరుకున్న తర్వాత స్థిరమైన జట్టుగా నిలిచింది. 2022లో తన తొలి సీజన్‌లోనే ఆ జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. దీని తర్వాత 2023లో కూడా ఆ జట్టు ఫైనల్‌కు చేరుకుంది. కానీ సీఎస్కే చేతిలో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. ఈ రెండు సీజన్లలో గుజరాత్ జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. దీని తర్వాత 2024లో గుజరాత్ జట్టు లీగ్ రౌండ్‌లోనే నిష్క్రమించింది. ఆ జట్టు అప్పుడు 8వ స్థానంలో ఉంది. ఈ సారి గుజరాత్ జట్టు మూడో స్థానంలో నిలిచి అర్హత సాధించింది.

**4. ముంబై ఇండియన్స్**

ఐపీఎల్ చరిత్రలో ముంబై ఇండియన్స్ ఐదు సార్లు ఛాంపియన్‌గా నిలిచింది.2013, 2015, 2017, 2019, 2020 సంవత్సరాల్లో ఐపీఎల్ టైటిల్ గెలుచుకుంది. ఈ ఐదు సీజన్లలో ఆ జట్టు మొదటి రెండు స్థానాల్లో నిలిచింది. ఇప్పటివరకు ఆ జట్టు మూడవ లేదా నాల్గవ స్థానంలో నిలిచి టైటిల్ గెలవలేదు. ఈ సారి ఆ ప్రకటన తప్పు అని నిరూపించడానికి జట్టు ప్రయత్నిస్తోంది. ముంబై జట్టు మొత్తం 11 సార్లు ప్లేఆఫ్స్‌కు చేరుకుంది. అయితే ఈ సీజన్లన్నింటిలోనూ ఆ జట్టు మూడు లేదా నాల్గవ స్థానంలో నిలిచింది. ఫైనల్‌కు చేరుకోలేకపోయింది. హార్దిక్ కెప్టెన్సీలో ముంబై జట్టు ఆరోసారి ఛాంపియన్‌గా నిలిచింది.

# రీల్




## ఆసక్తికరంగా 'మిరాయ్' టీజర్

యువ నటుడు తేజ సజ్జా ప్రధానపాత్రలో రూపొందుతోన్న చిత్రం 'మిరాయ్'. కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో ఇది రానుంది. నేడు దీని టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. 'కలియుగంలో పుట్టిన ఏశక్తీ దీన్ని ఆపలేదు..' ఆసక్తికర డైలాగులతో టీజర్ ఆకట్టుకునేలా ఉంది. ఇందులో మంచు మనోజ్ కీలకపాత్రలో కనిపించనున్నారు. విజువల్స్ భారీ స్థాయిలో ఉన్నాయి. సెప్టెంబర్ 5న ఇది ప్రేక్షకుల ముందుకు రానుంది.



## ఐదు పదాల్లో కథ చెప్పొచ్చు

### కమల్‌హాసన్

కమల్‌హాసన్ కీలకపాత్రలో మణిరత్నం దర్శకత్వంలో రూపొందిన గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా 'థగ్‌లైఫ్'. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ జూన్ 5న తమిళ, తెలుగు, హిందీ భాషల్లో విడుదల కానుంది. మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా చిత్రబృందం ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. అందుకు సంబంధించిన ప్రోమో విడుదలైంది. ఆ ప్రోమోలో కమల్ మాట్లాడుతూ.. 'థగ్‌లైఫ్' కథను ఐదు పదాలతో చెప్పేయచ్చు అన్నారు.



## మనసు చెప్పేదే వింటా

### దీపికా పదుకొణె

ఎప్పుడూ తన మనసు చెప్పేదే వింటానన్నారు బాలీవుడ్ నటి దీపికా పదుకొణె. ఏ కార్యక్రమంలోనైనా సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా నిలిచే ఆమె.. తాజాగా ఓ ఫ్యాషన్ షోలో హొయలొలికించారు. అక్కడ మీడియాతో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''జీవితంలో బ్యాలెన్స్‌డ్‌గా ఉండాలంటే నిజాయతీ ముఖ్యం. నేను దానికే ప్రాధాన్యతనిస్తాను. క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడల్లా నా మనసు చెప్పేది వింటాను. ఆ తర్వాతే నిర్ణయాలు తీసుకుంటాను. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొంటాను'' అని దీపికా చెప్పారు. రెండు రోజులుగా దీపికా పేరు సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. తన సినిమాను లీక్ చేసే ప్రయత్నం చేస్తున్నారంటూ ఒక స్టార్ డైరెక్టర్ చేసిన కామెంట్స్ ఆమెను ఉద్దేశించే అంటూ నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో నిజాయతీ గురించి దీపికా చేసిన వ్యాఖ్యలు పరోక్షంగా ఆ వివాదాన్ని ఉద్దేశించే అనుకుంటున్నారు. దీపికా చివరిసారిగా 'సింగం అగైన్'లో కనిపించారు. రోహిత్ శెట్టి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అజయ్ దేవ్‌గణ్, కరీనాకపూర్ ఖాన్, రణ్‌వీర్‌సింగ్, అక్షయ్‌కుమార్‌లు కీలకపాత్రలు పోషించారు. దీనితో పాటు గతేడాది 'కల్కి 2898 ఏడీ'లో సుమతి పాత్రలో కనిపించి సందడి చేశారు. ప్రస్తుతం దీని సీక్వెల్ పనులు జరుగుతున్నాయి.




## సస్పెన్స్ థ్రిల్లర్‌తో వస్తున్న 'మార్గన్'

తమిళ నటుడు విజయ్ ఆంటోని నటించే సినిమాలకు తెలుగులోనూ మంచి క్రేజ్ ఉంటుంది. ఆయన నుంచి ఓ సినిమా వస్తుందంటే అది ఎలాంటి కంటెంట్‌తో రాబోతుందా అనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంటుంది. ఇక ఆయన నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'మార్గన్' ఇప్పటికే షూటింగ్ పనులు ముగించుకుని రిలీజ్‌కు రెడీ అయ్యింది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన తెలుగు ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ ట్రైలర్ ఆద్యంతం సస్పెన్స్ థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో ఆసక్తికరంగా కట్ చేశారు. థ్రిల్లింగ్ అంశాలకు పెద్దపీట వేస్తూనే ఇన్వెస్టిగేటివ్ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులను స్టన్ చేసేందుకు ఈ చిత్రం రెడీ అవుతుంది. ఇక విజయ్ ఆంటోని మరోసారి తనదైన యాక్టింగ్‌తో ప్రేక్షకులను ఇంప్రెస్ చేయడం ఖాయం. ఈ ట్రైలర్‌లో సూపర్ న్యాచరల్ అంశాలు కూడా కనిపించడంతో అసలు ఈ సినిమా ఎలాంటి కథతో రాబోతుందా అనే ఆసక్తి క్రియేట్ అవుతుంది.

ఈ సినిమాలో దీప్శిక, అజయ్ దిషన్, సముద్రఖని తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి విజయ్ ఆంటోని సంగీతం అందించగా, లియో జాన్ పాల్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాను జూన్ 27న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ చేస్తున్నారు.

## రైతు భరోసా జమ (మొదటి పేజీ తరువాయి)

ఎరువులు, పురుగు మందులు లేని పంటలను పండించాలని ఆయన సూచించారు. ఎల్లపుడూ ఒకే పంటకు ప్రాధాన్యత ఇవ్వకుండా పంట మార్పిడికి రైతులు ప్రయత్నించాలని, పామాయిల్ తోటల వైపు రైతులు మొగ్గు చూపాలని, జిల్లాలో ఆయిల్ ఫామ్ పరిశ్రమ నిర్మాణానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. దేశంలోనే అత్యధిక ధాన్యం ఉత్పత్తి చేసిన రాష్ట్రంగా తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచిందని అన్నారు. ధాన్యం పండించిన రైతులకు రూ. 1150 కోట్లను వారి ఖాతాలలో వేయడం జరిగిందని వెల్లడించారు. రైతు భరోసా, రైతు భీమా, ఎరువులు, విత్తనాలు సకాలంలో రైతులకు అందించినపుడే వ్యవసాయాన్ని పండగలా చేయగలుగుతారని, ఆ దిశలో తమ ప్రభుత్వం పనిచేస్తుందని తుమ్మల అన్నారు.

శాసనమండలి సభ్యులు గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వాలు పనిచేయాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో రైతులు వ్యవసాయ పనులను ప్రారంభించుకోవాలని, రైతులకు ఇది శుభపరిణామమని అన్నారు. పార్లమెంట్ సభ్యులు కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామానికి ప్రజాపాలన అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని, అపార అనుభవమున్న మంత్రుల పర్యవేక్షణలో పరిపాలన కొనసాగుతుందన్నారు. శాసనసభ్యులు వేముల వీరేశం మాట్లాడుతూ చౌటుప్పల్ మార్కెట్ యార్డు పరిధిలో ఉన్న చిట్యాల మండలంలోని 8 గ్రామాలను చిట్యాల వ్యవసాయ మార్కెట్ యార్డులో కలపాలని, నార్కట్‌పల్లి సబ్ మార్కెట్‌ను పూర్తి స్థాయి మార్కెట్ యార్డుగా రూపొందించాలని మంత్రిని కోరారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, ఎంఎల్‌సి శంకర్‌నాయక్, జిల్లా అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్, ఆర్‌డిఓ వై అశోక్‌రెడ్డి, వ్యవసాయ శాఖ జెడి శ్రీనివాస్, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకు ఛాయాదేవి, పిఎసిఎస్ చైర్మన సుంకరి మల్లేష్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి చిన వెంకట్‌రెడ్డి, నాయకులు నర్రా మోహన్‌రెడ్డి, పోకల దేవదాసు, కాటం వెంకటేశం, వనం వెంకటేశ్వర్లు, మారగోని అంజనేయులు, గుడిపాటి లక్ష్మినర్సింహ్మా, జడల చినమల్లయ్య, ఎద్దులపురి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కౌమార బాలికలకు ఇందిరమ్మ అమృతం

### ఆడపిల్లల్లో శక్తి పెంచేందుకు పౌష్టికాహారం

### నేడు భద్రాద్రి జిల్లాలో ప్రారంభించనున్న మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కౌమార బాలికల్లో రక్తహీనత తగ్గించి శక్తిని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ అమృతం పేరిట కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకాన్ని పైలెట్ ప్రాజెక్ట్ క్రింద నేడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ,శిశు దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖా మంత్రి దనసరి అనసూయ సీతక్క లాంఛనంగా ప్రారంభించనున్నారు. అనేక కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేస్తున్న ప్రభుత్వం తాజాగా ఆడపిల్లలకు శక్తినిద్దాం, ఆరోగ్య తెలంగాణ నిర్మిద్దాం అనే నినాదంతో ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. స్రీ,శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఇందిరమ్మ అమృతం పేరిట 1418 ఏళ్ల వయస్సున్న కౌమార బాలికలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తారు. పల్లి, చిరుధాన్యాలతో తయారుచేసిన పట్టీలు ప్రతి నెలా అంగన్వాడీ కేంద్రాల్లో నెలకు రెండు సార్లు ఉంచితంగా పంపిణీ చేయనున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు జయశంకర్ భూపాలపల్లి, కొమరంభీం ఆసీఫాబాద్ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు క్రింద ప్రారంభిస్తున్నారు. జాతీయకుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం రాష్ట్రంలో 64.5 శాతం కౌమార బాలికలు రక్తహీనతతో బాధపడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ సమస్య నుండి భావితరానికి మేలు చేసేందుకు ప్రభుత్వం ముందడగు వేసింది. నెలకు సరిపోను రెండుసార్లు కిట్ల రూపంలో అందిస్తారు. ఒక్కొక్క చిక్కీలో 600 కేలరీలు, 20 గ్రాముల ప్రోటీన్లు ఉండే విధంగా సిద్ధం చేస్తున్నారు. బాలికల ఆరోగ్యాన్ని అంచనా వేసేందుకు అన్ని రకాలు రక్త పరీక్షలు నిర్వహించనున్నారు. మరింత మెరుగైన ఆరోగ్యం కోసం ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు కూడా అందివ్వనున్నారు. సెర్ప్ సహకారంతో బాలికల జీవన నైపుణ్యాలు అభివృద్ధి చేసేందుకు పలు రకాల కార్యక్రమాలు కూడా చేపట్టనున్నారు. పౌషకాహారం, ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతం, బాలికా వివాహాలపై అవగాహన కల్పిస్తారు.

పథకం ప్రారంభం ఇక్కడే కౌమార బాలికల్లో రక్తహీనత తగ్గించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న ఇందిరమ్మ అమృతం పథకరం భద్రాద్రి జిల్లాలోనే మంత్రి సీతక్క గురువారం ప్రారంభిస్తారు. పైలెట్ ప్రాజెక్టు క్రింది ఎంపికైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 23,399, కొమరంభీం ఆసీఫాబాద్ జిల్లాలో 18,230, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 8,640 మంది కౌమార బాలికలు ఉన్నారు. మొత్తంగా ఉన్న 50,269 మంది కౌమార బాలికలు ఇందిరమ్మ అమృతం పథకం ద్వారా లబ్ధిపొందబోతున్నారు.

### బాలసదన్ చిన్నారులతో మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్

## రూ.2 కోట్ల చెక్కు అందజేసిన దాతలు



**ప్రజాపక్షం / హైదరాబాద్:** హైదరాబాద్‌లోని హోటల్ ట్రిడెంట్ వేదికగా మిస్ వరల్ పోటీదారులతో 'హార్ట్ ఆఫ్ గోల్డ్' పేరిట ఓ వినూత్నమైన చారిటీ ఈవెంట్‌ను బుధవారం నిర్వహించారు. వికారాబాద్, నారాయణపేట జిల్లాల ప్రభుత్వ ఐసిడిస్ బాలసదన్‌లలోని అనాథ చిన్నారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్‌ను కలిసే అవకాశం చిన్నారులకు కలిపించాలాని ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ చిన్నారులతో ముచ్చటిస్తూ, వారితో కలిసి ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ ఉల్లాసంగా గడిపారు. చిన్నారులను తమ ఒడిలో కూర్చోబెట్టుకొని సెల్ఫీ, వీడియోలు తీసుకుంటు ఆనందం వ్యక్తం చేశారు. మిస్ వరల్డ్ పోటీదారుల్లో చాలా వరకు సామాజిక సేవలో ఉన్నవారు అయినందున చిన్నారులతో ఆసక్తిగా ముచ్చటించారు. లైవ్ బ్యాండ్ సంగీతానికి వారు చిన్నారులతో కలిసి ఉత్సాహంగా డాన్సు చేయడం, సెల్ఫీలు తీసుకోవడం కార్యక్రమం అంతా సందడిగా సాగింది.

**200 విద్యార్థులకు ఏడాది పాటు సహకారం.. రూ.2 కోట్ల చెక్కు అందవేత**

ఫార్చ్యూన్ హాస్పిటాలిటీ, సుదీక్ష ఎస్టేట్స్ సంస్థలు మిస్ వరల్డ్ సంస్థతో కలిసి బాలసదన్‌లలోని 200 మంది అనాథ పిల్లలకు ఏడాది పాటు సహాయం చేసేందుకు స్పాన్సర్‌షిప్ ప్రోగ్రామ్‌ను ప్రకటించాయి. విద్యా, పాఠ్యపుస్తకాలు, పోషకాహార, నెలవారీ రేషన్ సరఫరా, దుస్తులు, స్వెటర్లు, రెయిన్ కోట్లు, డ్రెస్సులు, స్కూల్ కిట్లు (స్కూల్ బ్యాగ్లు, వాటర్ బాటిళ్లు, టిఫిన్ బాక్సు), టాయిలెట్రీలు, బాత్రూమ్ అవసరాలు, డిజిటల్ వాచ్లు, విద్యా ఆ ట బొమ్మలు, వ్యక్తిగత వస్తువుల కోసం ట్రాలీ బ్యాగ్లు, ప్రోటీన్ పౌడర్, సప్లిమెంట్లుతో కూడిన 200 కిట్లను చిన్నారులకు అందించారు. ఒక్కో చిన్నారికి పోటీదారులు చేతులమీదగా ఈ కిట్లని అందజేశారు. ఈ సహాయం ఏడాది పాటు చేస్తామని దాతలు ప్రకటించారు. అదేవిధంగా విక్టోరియా మెమోరియల్ పాఠశాల పూర్తిస్థాయి పునరుద్ధరణను కూడా దాతలు ముందుకు వచ్చారు.

## కృషి స్ఫూర్తిదాయకం (మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధరక భవన్‌లో గల సురవరం ప్రతాప రెడ్డి ఆడిటోరియంలో జరిగింది. శాంతా వసంతా ట్రస్ట్ సౌజన్యంతో సురవరం ప్రతాప రెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్ అధ్వర్యంలో సురవరం ప్రతాప రెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ ఎల్లూరి శివా రెడ్డి అధ్యక్షతన జరిగిన పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి శ్రీధర్‌బాబు, విశిష్ట అతిథులుగా శాంతా వసంతా ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ కె.ఐ.వర ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2025 సంవత్సరానికి గాను ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ అనుమాండ్ల భూమయ్య, ప్రముఖ రచయిత, పరిశోధకులు డాక్టర్ సంగి శెట్టి శ్రీనివాస్ కు సురవరం ప్రతాప రెడ్డి సాహిత్య వైజయంతి సాహితీ పురస్కారాలను అందజేసి ఘనంగా సన్మానించారు. సభలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ తెలుగు భాషా పరిరక్షణ కోసం ఏనలేని కృషి చేసి సురవరం ప్రతాప రెడ్డి భావి తరాలకు గుర్తు ఉండే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన పేరును తెలుగు విశ్వ విద్యాలయానికి పెట్టడం ద్వారా ఆమహానీయుడిని సముచితంగా గౌరవించిందన్నారు. తెలంగాణ భాషా, యాసకు మరింత ప్రాచుర్యం కల్పించేందుకు ప్రభుత్వం ప్రతాప రెడ్డి ప్రముఖ రచనలను పుస్తక రూపంలో తీసుకురానున్నామని, ఇందుకు సంబంధించి సలహాలు, సూచనలు ఇవ్వాలని సాహితీవేత్తలను మంత్రి కోరారు. కె.ఐ.వర ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ సురవరం ప్రతాప రెడ్డి నిజమైన హీరో అని కొనియాడారు. నిజాం కాలంలో తెలుగును చదువుకోవడం పక్కన పెడితే, కనీసం ఉచ్చరించే పరిస్థితి కూడా లేని విపత్కర పరిస్థితుల్లో తెలుగు భాష కోసం పోరాటం చేసిన మహా యోధుడన్నారు. తెలంగాణ భాష, యాసను ఆంధ్ర ప్రాంతంలో కొంత మంది అవహేళన చేసే విధంగా మాట్లాడితే తమకు భాష, యాస ఉందని చాటిచెప్పిన గొప్ప వైతాళికులన్నారు. కార్యక్రమంలో సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపి సురవరం సుధాకర్ రెడ్డి, సురవరం ప్రతాప రెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్ కార్యదర్శి సురవరం పుష్పలత, ట్రస్టు సభ్యులు సురవరం కృష్ణవర్ధన్ రెడ్డి, సురవరం రఘువర్ధన్ రెడ్డి, సురవరం విజయభాస్కర్ రెడ్డి, సురవరం రంగా రెడ్డి, సురవరం అనిల్ కుమార్ రెడ్డి, సురవరం కపిల్, పలువురు కవులు, సురవరం ప్రతాప రెడ్డి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మరోసారి చంద్రబాబు ఎన్నిక

(మొదటి పేజీ తరువాయి)

మహానాడులో చంద్రబాబును మరోసారి టిడిపి జాతీయ అధ్యక్షుడిగా పార్టీ నాయకులు ఎన్నుకున్నారు. మహానాడు రెండవ రోజున పార్టీ అధ్యక్ష పదవికి సంబంధించి చంద్రబాబు నామినేషన్‌ను అనేక మంది నేతలు ప్రతిపాదించగా పార్టీ నేతలంతా మద్దతు తెలిపారు. దీంతో చంద్రబాబు నాయుడు టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చంద్రబాబు పార్టీ పగ్గాలు చేపట్టిన తర్వాత కడపతో కలుపుకుని ఇప్పటి వరకు 25 మహానాడులు నిర్వహించారు. కరోనా నేపథ్యంలో రెండేళ్లు జూమ్ ద్వారా మహానాడు నిర్వహించారు. చంద్రబాబును ప్రస్తుతం 12వ సారి టీడీపీ అధినేతగా మహానాడు ఎన్నుకుంది. జాతీయ పార్టీ అధ్యక్షుడిగా చంద్రబాబుతో వర్ల రామయ్య ప్రమాణం చేయించారు. టీడీపీ ఎన్నికల కమిటీ అధ్యక్షుని హోదాలో తనకు ఈ అవకాశం కల్పించినందుకు చంద్రబాబుకు వర్ల రామయ్య కతజ్ఞతలు తెలిపారు.

**వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేశ్‌కు బాధ్యతలు అప్పగించాలి :**

రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు అప్పగించాలంటూ మహానాడులో సీనియర్ నేతలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, మంత్రి పయ్యావుల కేశవ్, దూళిపాళ్ల నరేంద్ర తదితరులు ప్రతిపాదించారు. టీడీపీ మరింత బలోపేతం కావాలంటే లోకేశ్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ ఇవ్వాలన్నది సహేతుకమైన నిర్ణయమని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు.కడపలో జరుగుతున్న మహానాడు వేదికగా లోకేశ్‌కు కీలక పదవి ఇవ్వాలని పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర ప్రతిపాదించారు. లోకేశ్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలని తాము గుంటూరు మినీ మహానాడులో తీర్మానించామని సీఎం చంద్రబాబు నాయుడుకు ఈ సందర్భంగా దూళిపాళ్ల నరేంద్ర చెప్పారు. పార్టీ శ్రేణులందరూ కోరుకుంటున్న విధంగా నారా లోకేశ్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలని సీఎంకు నరేంద్ర విజ్ఞప్తి చేశారు.

## ముఠా అరెస్టు (మొదటి పేజీ తరువాయి)



సంబంధించి అందిన విశ్వసనీయ సమాచారం ప్రకారం సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో సూర్యాపేట సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ ఎం.శివకుమార్, సూర్యాపేట పట్టణ ఇన్‌ఛార్జి సిఐ జి.రాజశేఖర్, రూరల్ ఎస్ఐ బాలునాయక్, సిసిఎస్ ఎస్ఐ హరికృష్ణ, పెన్‌పహాడ్, చివ్వెంల ఎస్ఐ లు గోపికృష్ణ, వి.మహేష్‌లు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారణ చేయగా వాస్తవమేనని ఒప్పుకున్నారు. చిన్నారులను అక్రమ రవాణా చేస్తున్న ముఠా బృందం సూర్యాపేటకు వచ్చారని, హైటెక్ బస్టాండ్ సమీపంలో ఉన్నారని సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన నక్కా యాదగిరి, నక్కా ఉమారాణి, విజయవాడకు చెందిన కోరే నాగేంద్రకుమార్, కొట్టే రామలక్ష్మి , పిల్లల పావని, గరికమాకు విజయలక్ష్మి , ఆముదాలపల్లి సత్యరాణి, నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం బాణాల గ్రామానికి చెందిన మూడవత్ రాజు, హైద్రాబాద్‌లోని ఉప్పల్ ఘట్‌కేసర్‌కు చెందిన ఐత శోభరాణి, రాజస్తాన్ రాష్ట్రంలోని ఉదయ్‌పూర్ జిల్లా సల్వ ముంబర్‌కు చెందిన ఖాన్‌షాహిన, తిరుమలగిరి మార్కెట్‌కు చెందిన ఎండి సబానా, హైద్రాబాద్‌లోని దిల్‌సుఖ‌న్‌నగర్ సైదాబాద్‌కు చెందిన సబావత్ శ్రీనివాస్, హైద్రాబాద్ హైటెక్ సిటికి చెందిన ఏర్పుల సునీతలు పట్టుబడినవారిలో ఉన్నారు. వీరిపై గతంలో చిన్నారుల అక్రమ రవాణా కేసులు జనగాం, ఏలూరు, మంగళగిరి, హైద్రాబాద్‌లోని మేడిపల్లి, ముంబాయి తదితర పోలీస్‌స్టేషన్‌లో నమోదైనట్లు ఎస్‌పి తెలిపారు. ముఠా సభ్యులు అక్రమంగా అమ్మిన ఏడుగురు మగ పిల్లలను, ముగ్గురు ఆడ పిల్లలను సంరక్షకుల నుండి తీసుకుని శిశు సంరక్షణ కేంద్రానికి తరలించినట్లు చెప్పారు. సూర్యాపేట మండలంలోని టేకుమట్ల నుండి ఇద్దరు బాలురిని, సూర్యాపేట పట్టణంలో ఇద్దరు బాలికలను, పెన్‌పహాడ్ మండలం నుండి ఒక బాలుడు, నల్లగొండ జిల్లా ఉప్పలపహాడ్ ఇద్దరు బాలురు, చిన్నసూరారంలో ఒక బాలిక, హైద్రాబాద్‌లోని ఒక బాలుడిని రక్షించామని తెలిపారు. ఈ ముఠా సభ్యులు గుడ్ల వ్యాపారం సాగిస్తూ పిల్లలు లేని తల్లిదండ్రులను తెలుసుకుని శిశువు కావాలన్న వారికి పది లక్షల నుండి రెండు లక్షల రూపాయలకు విక్రయించినట్లు విచారణలో తేలినట్లు చెప్పారు. సూర్యాపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో జువ్వెనల్ జస్టిస్ యాక్ట్ 2015 ప్రకారం కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించారు.

**మిన్నంటిన తల్లిదండ్రుల ఆర్తనాధాలు**

మా పిల్లలను మాకు ఇవ్వాలంటూ తల్లిదండ్రుల ఆర్తనాధాలతో సూర్యాపేట పట్టణ పోలీస్‌స్టేషన్ అట్టుడుకింది. అక్రమంగా చిన్నారులను గతకొంతకాలంగా విక్రయిస్తున్న 13 మంది ముఠా సభ్యులను పోలీసులు పట్టుకుని వారి నుండి పది మంది పిల్లలను గుర్తించి శిశు సంరక్షణ కేంద్రానికి బుధవారం తరలించారు. దీనిని తట్టుకోలేని చిన్నారులను పెంచుకుంటున్న తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. మా పిల్లలను మాకు ఇవ్వండి అంటూ బోరున విలపించారు

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com